ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
హైదరాబాద్
fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
19-6-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 138 పేజీలు: 10+4 వెల: 6.50

2023 నవంబరులో 600 ఫోన్ల ట్యాపింగ్ 3
భారత్‌కు ఎవరి మధ్యవర్తిత్వం అక్కర్లేదు: ప్రధాని మోడీ 5

# నీటికోసం కోర్టుకు వెళ్తాం

**మోడీకి దగ్గరైనంత మాత్రాన మీకు అనుమతులు రావు..**

**మీరు ఎన్‌ఓసిలు ఇస్తే మేమూ అభ్యంతరం చెప్పం**

**తెలంగాణకు 1500 టిఎంసిలకు ఎన్‌ఓసిలు ఇవ్వండి**

**ఏపి సిఎం చంద్రబాబుకు స్పష్టం చేసిన సిఎం రేవంత్**

**299 టిఎంసిలు సరిపోతాయన్న కెసిఆర్ సంతకమే గుదిబండ**

**సాయం కోసం కేంద్రం వద్దకు వెళ్తా.. మీ ఫాంహౌస్‌కు వస్తే రూ. 50 వేల కోట్లిస్తారా?: కెసిఆర్‌ను ప్రశ్నించిన సిఎం**

**అఖిలపక్ష సమావేశం అనంతరం మీడియాతో ముఖ్యమంత్రి**



బుధవారం హైదరాబాద్‌లో ఎంపీల అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి ఉత్తమ్ కుమార్, ఎంపీలు డి కె అరుణ, అసదుద్దీన్ ఒవైసీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్18:** తెలంగాణలోని పలు సాగునీటి ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీలు) జారీ చేస్తే, ఏపీ ప్రాజెక్టులపై తాము కూడా ఎలాంటి అభ్యంతరం చెప్పబోమని ఆయన స్పష్టం చేశారు."ఈరోజు అందుకే నేను పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు సూచన చేస్తున్నాను. కేంద్రంలో మీకు పలుకుబడి ఉండవచ్చు.. మీరేం చెబితే మోదీ అది వినవచ్చు. అలా అని ప్రాజెక్టులన్నింటికీ అనుమతి వస్తుందని అనుకుంటే అది భ్రమ. అలాంటి వాటికి అవకాశం లేదు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో అవసరమైన ప్రణాళిక, వ్యూహరచన మా వద్ద ఉంది. మేము వివిధ రాజ్యాంగబద్ధమైన సంస్థలకు ఫిర్యాదు చేస్తున్నాం. అక్కడ మాకు న్యాయం జరగకుంటే న్యాయస్థానాలకు వెళతాం.. అక్కడి నుంచి ప్రజల వద్దకు వెళతాం" అని ఆయన అన్నారు. బుధవారం గోదావరిబనకచర్ల ప్రాజెక్టు అంశంపై అఖిలపక్ష ఎంపీలతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర రైతాంగ ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు.తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునేందుకు మా ప్రణాళిక మాకుంది. చంద్రబాబు గారు.. కేసీఆర్ చెప్పారని కాదు.. గోదావరి బేసిన్ లో 3వేల టీఎంసీలు మిగులు జలాలు ఉన్నాయని మీరు నమ్మితే >>2

## రైతులపై రాజీలేదు

**బనకచర్లపై అన్ని పార్టీలతో చర్చలు జరుపుతున్నాం**

**పెన్నా బేసిన్‌కు రోజు 3 టిఎంసిల గోదావరి జలాల తరలింపునకు యత్నం.. అఖిలపక్ష సమావేశంలో నీటిపారుదల మంత్రి ఉత్తమ్**

**కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ గైర్హాజరు, బిఆర్‌ఎస్ వాకౌట్**

**హైదరాబాద్, జూన్ 18,ప్రభాతవార్త:** తెలంగాణ రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టు పై అన్ని పార్టీలతో చర్చలు జరుపుతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గోదావరిబనకచర్ల ప్రాజెక్టుపై బుధవారం అంబెద్కర్ సచివాలయంలో తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ అఖిలపక్ష ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.సమావేశానికి సిఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ఎంపిలతో పాటు, బిజెపి ఎంపిలు డికె ఆరుణ, రఘునందన్‌రావు , బిఆర్ ఎస్ ఎంపీ రవిచంద్ర, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గోదావరిబనకచర్లపై అన్ని పార్టీలతో చర్చలు జరుపుతున్నాం. >>2



బుధవారం రైతులకు బేడీలు వేసి అలంపూర్ కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

## రైతులకు మళ్లీ బేడీలు?


**లగచర్ల ఘటన మరువక ముందే రాజోలిలో పునరావృతం**

**అలంపూర్ కోర్టుకు హాజరుపర్చిన పోలీసులు**

**సోషల్ మీడియాలో ఫొటోలు, విడియో వైరల్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్18, ప్రభాతవార్త:** లగచర్ల రైతులకు బేడీలు వేసిన ఘటన మరువక ముందే రాజోలి రైతులకు కూడా సంకెళ్లు వేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహబూబ్‌నగర్ జైలు నుంచి అలంపూర్ కోర్టుకు రైతులకు బేడీలు వేసి తరలిస్తున్న దృశ్యాలు మీడియాకు చిక్కాయి. పోలీసుల తీరుపై ప్రజా సంఘాలు, మానవ హక్కుల సంఘాలు మండిపడుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా ధన్వాడలో ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా ఆందోళన చేసిన 12మంది అన్నదాతలపై పోలీసులు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఇవాళ రిమాండ్ ముగియడంతో.. వారిని మహబూబ్ నగర్ కోర్టు నుంచి అలంపూర్ >>2

# యుద్ధానికి సిద్ధంకండి



## ట్రంప్‌ను హెచ్చరించిన ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

**ఇజ్రాయెల్‌పై దాడులు ముమ్మరం చేసిన ఇరాన్, 10 చోట్ల హైపర్‌సోనిక్ దాడులు**

**అమెరికా జోక్యం చేసుకొంటే నష్టం మరింత తీవ్రం.. ఇరాన్ అంతు చూసేదాకా వదలబోమన్న నెతన్యాహు**

**టెహ్రాన్, జూన్ 18:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీకి బేషరతుగా లొంగిపోవాలని హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై ఖమేనీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఉగ్రవాద జియోనిస్ట్ పాలనకు గట్టి సమాధానం చెప్తామని.. వారి పట్ల కనికరం చూపే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బుధవారం తెల్లవారుజామున ఇరాన్ ఇజ్రాయెల్‌పై రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన కొద్దిసేపటికే ఈ పోస్టు పెట్టడం గమనార్హం. ఇజ్రాయెల్‌తో కలిసి టెహ్రాన్ అణుకేంద్రాలపై దాడులు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు అమెరికా ఇంటెలిజెన్స్ అధికారి ఇప్పటికే ఉప్పందించారు. టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ ప్రకారం.. మరో పోస్టులో పార్సీ భాషలో 'యుద్ధం ప్రారంభమైంది' అని ఖమేనీ పోస్టు చేశాడు. దానితోపాటు ఖైబర్ చారిత్రాత్మక యుద్ధాన్ని సూచిస్తూ కోట ద్వారంలోకి కత్తితో ప్రవేశించే వ్యక్తి చిత్రం కూడా ఉంది. ఇదిలా ఉండగా



ఖమేనీ

ఇరాన్- ఇజ్రా యెల్ మధ్య ఆరో రోజు కూడా భీకర పోరు కొనసాగుతోంది. ట్రంప్ కఠిన హెచ్చరికల తర్వాత ఇరాన్ ఇజ్రాయెల్‌లో 10 చోట్ల హైపర్‌సోనిక్ క్షిపణులతో దాడులకు తెగబడింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) తాజా దాడిని ఒక ప్రకటనలో ధ్రువీకరించడంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. బుధవారం తెల్లవారుజామున ఇజ్రాయెల్‌లోని 10 లక్ష్యాలపై ఫతాహ్-1 హైపర్‌సోనిక్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు ఐఆర్‌జిసి ధ్రువీకరించింది. 'ఆపరేషన్ హానెస్ట్ ప్రామిస్ 3'లో 11వ దశ కొనసాగుతోందని ప్రభుత్వ టివి చానల్ ద్వారా వెల్లడించింది. ఆక్రమిత భూభాగాల గగనతలంపై పూర్తి నియంత్రణ సాధించామని ప్రకటించుకుంది. యుద్ధం మొదలైందని ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ప్రకటన తర్వాత టెహ్రాన్ ఈ దాడులు నిర్వహించింది. కాగా ఇజ్రాయెల్ ప్రతీకార దాడులకు ప్రణాళి కలు రచిస్తోంది. ఇరాన్ >>2

## ఐలవ్ పాకిస్థాన్

**భారత్ - పాక్ యుద్ధాన్ని నేనే ఆపించా..**

**మోడీ గొప్ప వ్యక్తి.. ఆయనతో చాలా విషయాలు మాట్లాడా: ట్రంప్**



**వాషింగ్టన్, జూన్ 18:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ మరోసారి ప్రకటించుకున్నారు. ఇరు దేశాల మధ్య ఒప్పందం విషయంలో అమెరికా ప్రమేయం లేదని ఫోన్ కాల్‌లో ట్రంప్‌నకు ప్రధాని నరేంద్రమోడీ స్పష్టం చేసిన గంటల వ్యవధిలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. అదేవిధంగా ప్రధాని మోడీని అద్భుతమైన వ్యక్తిగా ట్రంప్ కొనియాడారు. ' ఐ లవ్ పాకిస్థాన్.. మోడీ అద్భుతమైన వ్యక్తి. మంగళవారం రాత్రి ఆయనతో మాట్లాడాను. మేం భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకోబోతున్నాం. పాకిస్థాన్-భారత్‌ల >>2

'కబుర్ల దేవత'కు కేంద్ర బాలసాహిత్య పురస్కారం
సాహిత్య యువ పురస్కారానికి మైరావణ నవల ఎంపిక 2

## సెల్‌ఫోన్లు, లాప్‌టాప్ అప్పగించని కెటిఆర్

**'ఫార్ములా కార్' కేసులో తదుపరి చర్యలకు ఎసిబి సిద్ధం**



**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి ఎసిబి కోరినట్లుగా రేసింగ్ జరిగిన సమయంలో తాను వాడిన సెల్‌ఫోన్లు, మ్యాక్ బుక్, లాప్‌టాప్‌ను కెటిఆర్ బుధవారం నాడు అప్పగించలేదు. దీనికి బదులుగా ఎసిబి అధికారులకు ఒక లేఖ ద్వారా సమాధానం పంపారు. ఎసిబి అధికారులు కోరినట్లుగా సెల్‌ఫోన్లు, మ్యాక్ బుక్, లాప్‌టాప్ అప్పగించడం సుప్రీం కోర్టు నిబంధనల అనుసారం ప్రాథమిక హక్కులు, గోప్యతకు ఇదిభంగం కలిగించేదిగా కెటిఆర్ తన లేఖలో తెలిపారు. సోమవారం నాడు ఈ కేసులో ఎసిబి అధికారులు కెటిఆర్‌ను ఎనిమిది గంటల పాటు విచారించడం తెలిసిందే. విచారణ సందర్భంగా >>2

## కొత్తగా భూ హక్కులకూ రైతు భరోసా

**సర్కార్ కీలక నిర్ణయం**

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా భూ యాజమాన్య హక్కులు పొందిన వారికి కూడా రైతుల భరోసా కింద పెట్టుబడి నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా త్వరలోనే ఎకరాలతో సంబంధం లేకుండా రైతు భరోసా నిధులు విడుదల చేయనుంది. కొత్తగా భూ యాజమాన్య హక్కులు పొందిన రైతులకు భరోసా నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు గాను సదరు భూముల రిజిస్ట్రేషన్‌లకు కటాఫ్ తేదీని కూడా ప్రకటించింది. ఈ నెల 5వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ అయి ఉంటే చాలని, అటువంటి రైతులకు ఈ రైతు భరోసా నిధులు మంజూరు అవుతాయని తెలిపింది.

ఇందుకుగాను, ఈ నెల 20 వరకు దరఖాస్తు గడువుగా పేర్కొంది. సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు పట్టాదారు, బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్ ఇస్తే పోర్టల్‌లో నమోదు చేస్తారని ఈ మేరకు తెలిపింది. రానున్న రోజుల్లో ఎకరాలతో సంబంధం లేకుండా అందరూ రైతులు ఈ లబ్ధి పొందేలా ఏర్పాట్లు చేస్తోంది. అంతేకాకుండా రైతు భరోసా నిధులు తమ బ్యాంకు ఖాతాల్లో పడ్డాయో లేదో తెలుసుకోవడానికి ఆన్‌లైన్‌లో స్టేటస్ చెక్ చేసుకునే విధానం కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది.

## మరో భారీ ఎన్‌కౌంటర్

**మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో హోరాహోరీ**

**మావోయిస్టు అగ్రనేత రవి, అరుణ, అంజు హతం**

**బంద్ నేపథ్యంలో అలజడి**



గాజర్ల రవి (ఫైల్)

**చర్ల, జూన్ 18, ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్‌ని తక్షణమే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని దేశవ్యాప్తంగా ఒక వైపు నిర సనలు వెల్లువెత్తుతున్న క్రమంలో మరో వైపు ఎన్ కౌంటర్లను నిరసిస్తూ మావోయిస్టులుఈనెల20న ఆంధ్ర తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మావోయిస్టులకు మరో బిగ్ షాక్ తగిలింది. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా రంప చోడవరం నియోజకవర్గ పరిధిలోని మారేడుమిల్లి మండలంలోని కింటుకూరు అటవి ప్రాంతంలో భుదవారం జరిగిన ఎన్ కౌంటర్ లో మావోయిస్టు అగ్రనేత కేంద్ర కమిటీ సభ్యుడు ఆంధ్ర ఒరిస్సా బోర్డర్ కమిటీ సభ్యుడు గాజర్ల రవి ఆలియాస్ గణేష్ ఉదయ్ (బిరుసు ) స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు (ఏఓబి) సభ్యురాలు కేంద్రకమిటీ కమిటి సభ్యుడు చలపతి భార్య వెంకట లక్ష్మీ ృ చైతన్య ఆలియాస్ అరుణ(రూపే )తో పాటు మరో దళ సభ్యురాలు అంజు లు మృతిచెందారు.మారేడుమిల్లి అటవిప్రాంతంలోని కొండ మెదలు చింతకూరు కొయ్యలగూడెం అటవి ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న >>2




కెనడాలోని కననాస్కిస్‌లో జరిగిన 51వ జి7 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోడీ, వివిధ దేశాధినేతలు

## దౌత్యవేత్తల పునర్నియామకానికి భారత్-కెనడా అంగీకారం

**మళ్లీ బలపడుతున్న సంబంధాలు**

**ఉగ్రవాదంపై ద్వంద్వ వైఖరికి ఛాన్సే లేదు: ప్రధాని మోడీ**

**టొరాంటో, జూన్ 18:** నిజ్జర్ హత్యతో దెబ్బతిన్న భారత్-కెనడా మధ్య సంబంధాలు మళ్లీ బలపడుతున్నాయి. గత రెండేళ్లుగా ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఇటీవలే కెనడా ఎన్నికల్లో అధికార మార్పు జరగడం.. తాజాగా ప్రధాని మోడీ కెనడా పర్యటనతో మొత్తం మారిపోయింది. ట్రూడో పాలనలో తెగిపోయిన సంబంధాలు ఇప్పుడు మళ్లీ బలపడుతున్నాయి. రెండు దేశాల మధ్య పూర్తి దౌత్య సేవలను తిరిగి ప్రారంభించడానికి ఇరు దేశాలు తాజాగా అంగీకారానికి వచ్చాయి. కెనడాలో జరుగుతున్న జి-7 శిఖరాగ్ర సదస్సుకు హాజరయ్యేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ వెళ్లిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీతో మోడీ సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి సంబంధించిన కీలక అంశాలపై ఇరువురూ చర్చించారు. ఈ సందర్భంగా దౌత్యవేత్తలను తిరిగి నియమించడంపై ఏకాభిప్రాయం కుదిరింది. ఇరుదేశాల పౌరులు, వ్యాపారాలకు సాధారణ సేవలను పునరుద్ధరించే లక్ష్యంతో కొత్త హైకమిషనర్లను నియమించడానికి అంగీకరించినట్లు కెనడా ప్రధాని మార్క్ కార్నీ తెలిపారు. కాగా ఉగ్రవాదం మానవాళికి ప్రధాన శత్రువని భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. కెనడాలో జరిగిన జి-7 సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని బహిరంగంగా సమర్థించే దేశాలుతగిన మూల్యం చెల్లించుకుంటాయని >>2

గూగుల్, హైదరాబాద్ పాత స్నేహితులే: సిఎం రేవంత్ 2



క్రొయేషియాలోని జాగ్రెబ్ విమానాశ్రయానికి బుధవారం చేరుకున్న మోడీకి స్వాగతం పలుకుతున్న ప్రవాస భారతీయులు

# రైతులకు మళ్లీ బేడీలు?

>> కోర్టులో హాజరు పరిచేందుకు పోలీసులు తీసుకెళ్లారు. అయితే రాజోలి రైతులకు సంకెళ్లు వేసి అలంపూర్ కోర్టులో హాజరు పరచడం.. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. అన్నదాతలు నేరస్తులా అంటూ సోషల్ మీడియాలో రైతులకు బేడీలు వేసి కోర్టులో హాజరుపరచడాన్ని తప్పుబడుతున్నారు. ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాడి జైలుకు వెళ్లిన 12మంది రైతులకు బెయిల్ మంజూరైంది. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్ద ధన్వాడ శివారులో ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేయొద్దని పోరాటం చేసిన ఘటనలో 12మంది రైతులను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈనెల 4న జైలుకెళ్లిన వీరికి 14 రోజుల తర్వాత కండీషన్ బెయిల్ మంజూరైంది. బెయిల్ వచ్చాక కూడా రైతులకు బేడీలు వేయడం ఎంతవరకు సమంజసం అని బీఆర్ఎస్ నేతలు, ప్రజా సంఘాల నేతలు మండి పడుతున్నారు. జోగులాంబ గద్వాల్ జిల్లా పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడిన రైతుల చేతులకు సీఎం రేవంత్ బేడీలు వేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడుతున్నారు.

**అత్యంత దుర్మార్గమైన చర్య: కెటిఆర్**

జోగులాంబ గద్వాల్ జిల్లా పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడిన రైతుల చేతులకు సీఎం రేవంత్ బేడీలు వేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎక్స్ సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని తెలిపారు. అలంపూర్ కోర్టు వద్ద అన్నదాతలకు పోలీసులు సంకెళ్లు వేసిన సంఘటన ముఖ్యమంత్రి రాక్షస మనస్తత్వానికి పరాకాష్ట అన్నారు. ముఖ్యమంత్రి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుంది కాబట్టి రేవంత్ వెంటనే రైతులందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఐఎఎస్ అరవింద్‌కుమార్‌పై హైకోర్టు సీరియస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్18:** ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.ఆయన హెచ్ఎండిఏ కమిషనర్‌గా ఉన్న సమయంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఓ నిర్వాసితుడు తనకు ప్లాట్ మంజూరు చేయకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాడు. ఈ క్రమంలో విచారణ చేపట్టిన హైకోర్టు హెచ్ఎండిఏ కమిషనర్‌కు ప్లాట్ మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు కోర్టు ఆదేశాలు అమలు కాకపోవడంతో బాధితుడు విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లాడు. గతంలో ఇచ్చిన ఆదేశాలు పాటించనందుకు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మూడు వారాల్లోగా ఆదేశాలు పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. లేని పక్షంలో రెండు వారాల పాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ప్రస్తుతం ఆరవింద్‌కుమార్ సెలవుపై విదేశాలలో ఉన్నారు. ప్రభుత్వం ఆయన సెలవులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 21వ తేదీన హైదరాబాద్ చేరుకోనున్నట్లు సమాచారం.

# యుద్ధానికి సిద్ధంకండి

>> మీడియా ప్రకారం.. ఇజ్రాయెల్ టెహ్రాన్ సమీపం లోని ఖోజిర్ క్షిపణి ఉత్పత్తి కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు సమాచారం. ఈ కేంద్రం ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి అత్యంత అవసరమైంది. 2024లో కూడా ఇజ్రాయెల్ దీనిపై దాడి చేసింది. తమపై దాడి చేసి ఇజ్రాయెల్ భారీ తప్పిదం చేసిందని, అందుకు శిక్ష తప్పదని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ దాడుల వేళ విడియో సందేశం చేసిన ఆయన.. ఇరాన్ లొంగిపోదనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ట్రంప్ హెచ్చరికలను ఉద్దేశిస్తూ.. అటువంటి బెదరింపులకు భయపడమనే విషయం ఇరాన్ చరిత్ర తెలిసిన వారికి అర్థమవుతుందన్నారు.

**ఇరాన్‌లో 1,100 లక్ష్యలను ధ్వంసం చేశాం : ఇజ్రాయెల్**

టెల్అవీవ్ : ఇరాన్ అణు ముప్పును తాము ఓ వ్యూహం ప్రకారం అణచివేస్తున్నామని ఇజ్రాయెల్ సాయుధ దళాలు తెలిపాయి. ఇప్పటికే తమ వాయుసేన ఆ దేశంలోని 1,100 లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు ఐడిఎఫ్ ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ ఎఫీ డెఫ్రిన్ పేర్కొన్నారు. 'మేము ఓ పద్ధతి ప్రకారం ఇరాన్‌లోని అణు ముప్పును నాశనం చేస్తున్నాం. మేము చేసే దాడులు వారి నష్టాన్ని గణనీయంగా పెంచుతున్నాయి. ఫలితంగా వారి బాలిస్టిక్ క్షిపణులు, ఎయర్ డిఫెన్స్ వ్యవస్థలు దెబ్బతింటున్నాయి' అని పేర్కొన్నారు. దాడులకు సంబంధించిన విడియోలను కూడా ఇజ్రాయెల్ దళాలు షేర్ చేశాయి. ఇజ్రాయెల్ వాయుసేన విమానాలు గత శుక్రవారం నుంచి ఇరాన్‌పై దాడులు నిర్వహిస్తున్నాయి. పశ్చిమ ఇరాన్, టెహ్రాన్ గగనతలంపై తాము పూర్తిగా పట్టు సాధించినట్లు చెబుతున్నాయి. ఇప్పటి వరకు 70 ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ బ్యాటరీలను ధ్వంసం చేసినట్లు చెబుతోంది. మరోవైపు ఐడిఎఫ్‌కు చెందిన ఓ భారీ డ్రోన్‌ను కూల్చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈవిషయాన్ని ఇజ్రాయెల్ కూడా ధ్రువీకరించింది. ఇరాన్ సైనిక స్థావరాలు, చమురు క్షేత్రాలు, అణుశుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ భీకర దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ దాడులతో టెహ్రాన్‌లోని పలు కీలక ప్రాంతాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. తాజాగా ఇజ్రాయెల్‌చేసిన దాడుల్లో ఇరాన్‌లో 585 మందిమృతి చెందినట్లు మానవహక్కుల సంఘాలు తెలిపాయి.

## లాభాల బాటలో ఆర్టీసీ: మంత్రి పొన్నం

**మధిర జూన్ 18 ప్రభాతవార్త :** గత ప్రభుత్వ కాలంలో ఉనికే ప్రశ్నార్థకంగా మారిన స్థితిలో ఉన్న ఆర్టీసీని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లాభాల బాటలోకి తీసుకొచ్చామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం మధిరలో రూ 10 కోట్ల అంచనా తో నూతనంగా అధునాతన బస్టాండ్ నిర్మాణానికి గాను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ఆయన శంకుస్థాపన, 10 నూతన బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన గంటనుండే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందని అన్నారు. ఊరుకో బస్సు ఇంటికో దీపం పేరిట రాష్ట్రంలో అభివృద్ధికి బాటలు వేసామని అన్నారు. కరెంటు లేని ఇల్లు ఉండదని ఇంటికో దీపం పేరుతో ప్రతి ఇంట్లో విద్యుత్ వెలుగులు విరజిమ్మలనేది కాంగ్రెస్ ప్రభుత్వాల సిద్ధాంతం అన్నారు. నేటి వరకు ఈ విధానాన్ని ముందుకు తీసుకు వెళ్తున్నాం అన్నారు. గత పది సంవత్సరాలపాటు అధికారంలో ఉన్నవారు ఆర్టీసీని నిరక్ష ్యం చేశారని అన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ తక్కువ ధరతో సామాన్యునికి రవాణా సౌకర్యం కల్పించే ఎర్ర బస్సును, ఆర్టీసీని నిలదొక్కుకునేలా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

# అప్పగించని కెటిఆర్

>> ఫార్ములా ఈ కార్ రేస్ జరిగిన సమయంలో మీరు వాడిన సెల్‌ఫోన్లు, మ్యాక్ బుక్, లాప్‌టాప్ అప్పగించాలని ఎసిబి కోర గా తాను ఈరోజు వాటిని తేలేదని చెప్పడం విదితమే. అయితే ఈ నెల 18వ తేదీలోగా వాటిని తమకు విచారణ నిమిత్తం అప్పగించాలని ఎసిబి అధికారులు కెటిఆర్‌ను కోరారు. దీనికి కెటిఆర్ అంగీకరించినట్లు ఎసిబి అధికారులు తెలపగా మంగళవారం రాత్రి దీనిపై కెటిఆర్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారని వార్తలు వెలువడ్డాయి. ఆయన తన న్యాయవాదులతో మాట్లాడిన తరువాత సుప్రీం కోర్టు నిబంధనల అనుసారం పోలీసు కేసుల విచారణలో భాగంగా సెల్‌ఫోన్లు, మ్యాక్ బుక్, లాప్‌టాప్‌లు అప్పగించాలని ఎక్కడా లేవని తన పార్టీ నాయకులతో మాట్లాడనట్లు వార్తలు వచ్చాయి. అయితే వీటిని ఎసిబి అధికారులు ధృవీకరించలేదు. బుధవారం నాడు సాయంత్రం కెటిఆర్ ఇదే అంశాలను లేఖ ద్వారా ఎసిబికి లేఖ ద్వారా సమాధానం ఇచ్చారు. కెటిఆర్ తాము కోరినట్లుగా సెల్‌ఫోన్లు, మ్యాక్ బుక్, లాప్‌టాప్ అప్పగించనందుకు ఆయనపై తదుపరి చర్యలు తీసుకోవాలని ఎసిబి అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

# ఐలవ్ పాకిస్థాన్

>> మధ్య యుద్ధాన్ని ఆపింది నేనే. పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ చాలా ప్రభావవంతమైన వ్యక్తి. పాకిస్థాన్ వైపు నుంచి మునీర్, భారత్ తరఫున మోడీ తదితరులు యుద్ధానికి తెరదించేందుకు చొరవ చూపారు. రెండు ప్రధాన అణ్వస్త్ర దేశాల మధ్య యుద్ధాన్ని ఆపాను' అని మీడియాతో ట్రంప్ పేర్కొన్నారు. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను తానే ఆపానంటూ ట్రంప్ పదే పదే చెబుతున్న విషయం తెలిసిందే. ట్రంప్ ప్రకటనపై స్పష్టతనివ్వాలని అటు ప్రతిపక్షాలు కూడా డిమాండ్ చేశాయి. ఈ క్రమంలోనే ప్రధాని మోడీ తొలిసారిగా దీనిపై స్పందించారు. ఇరు దేశాల మధ్య ఒప్పందం విషయంలో అమెరికా ప్రమేయం లేదని తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని అగ్రరాజ్య అధ్యక్షుడికి ప్రధాని మోడీ స్పష్టంగా చెప్పినట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు.

## భారత్-కెనడా అంగీకారం

>> హెచ్చరించారు. గత ఏప్రిల్‌లో జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి మానవత్వంపై జరిగిన దాడిగా మోడీ అభివర్ణించారు. 'ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు చోటు ఉండకూడదు ఉగ్రవాదం మానవాళికి శత్రువు. ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టే అన్ని దేశాలు దీన్ని వ్యతిరేకించాలి. ప్రపంచ శాంతి, శ్రేయస్సు కోసం మన ఆలోచనలు, విధానాలు స్పష్టంగా ఉండాలి. ఏదైనా దేశం ఉగ్రవాదానికి మద్దతిస్తే అందుకు ఆ దేశం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు' అని మోడీ పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలు అనిశ్చితి, సంఘర్షణలతో ఎక్కువగా బాధపడుతున్నాయని మోడీ వ్యాఖ్యానించారు.

## వారం - వర్జ్యం

తేది : 19-06-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
అష్టమి ఉ.11.52
ఉత్తరాభాద్ర రా.11.14
వర్జ్యం ఉ.10.28-11.57
దు.ఉ.9.58-10.50, 2) మ.3.13-4.05
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** బంధువులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**వృషభం :** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. రుణాలు తీరి ఊరటచెందుతారు.

**మిథునం:** అనుకోని ఉద్యోగ, విద్యావకాశాలు లభిస్తాయి. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**కర్కాటకం :** ముఖ్యమైన కార్యక్రమాలు సజావుగా పూర్తిచేస్తారు. ఆర్థిక ఇబ్బందులనుండి బయటపడతారు.

**సింహం :** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. స్వల్ప ధనలాభం.

**కన్య :** ఉద్యోగాలలో పదోన్నతులు పొందుతారు. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసివస్తాయి.

**తుల:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. వస్తులాభం.

**వృశ్చికం:** ఆకస్మిక ప్రయాణాలు కలిసి వస్తాయి. ఆర్థిక పరిస్థితులు అనుకూలిస్తాయి.

**ధనుస్సు:** ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. పట్టుదలతో ముందుకు సాగుతారు.

**మకరం:** ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు. ఇతరుల విషయాలలో జోక్యం తగదు.

**కుంభం :** వివాదాలకు దూరంగా వుండండి. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**మీనం :** సన్నిహితులను కలిసి మంచి, చెడు పంచుకుంటారు. వృత్తి-వ్యాపారాలు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మరో భారీ ఎన్‌కౌంటర్

>> సమాచారంతో రంపచోడవరం పోలీసులు గ్రేహండ్స్ బలగాలు సంయుక్తంగా కూబింగ్ ఆపరేషన్ చేపట్టారు.ఈ క్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు అగ్రనేతలతోపాటు మరో దళ సభ్యురాలు మృతిచెందారు.ఎన్ కౌంటర్ ఘటన ప్రాంతంలో 3 ఎకె 47 రైఫిల్స్‌తో పాటు మందుగుండి సామాగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.. మృతదేహాలను రంపచోడవరం వైద్యశాలకు తరలించ నున్నారు.

**గాజర్ల రవి..శాంతి చర్చల్లో కీలక నేత**

గాజర్ల రవి ఆలియాస్ గణేష్ స్వస్థలం భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వెలిశాల గ్రామం ఆయనపై 25 లక్షల రూపాయల రివార్డు ఉంది.నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో ఉండి అంచెలంచెలుగా ఎదిగి కేంద్రకమిటీ సభ్యుడిగా ఏఓబి కమిటి సభ్యుడిగా పనిచేస్తున్నారు.వైస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి గా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత 2004 అక్టోబర్ నెలలో జరిగిన శాంతిచర్చల్లో రవి కీలకపాత్ర పోషించారు.గణేష్ సోదరులు అశోక్ సారయ్యలు మావోయిస్టు ఉద్యమంలో పనిచేసారు.సారయ్య గతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందగా ఆశోక్ పోలీసులకు లొంగిపోయాడు. ప్రస్తుతం కాంగ్రెస్‌పార్టీలో క్రియాశీలక సభ్యుడుగా పనిచేస్తున్నట్లు తెలిసింది.గాజర్ల రవి ఆలియాస్ గణేష్ మృతిచెందడం మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలినట్లు అయ్యింది.

**ముగిసిన అరుణ శకం**

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు రామచంద్రారెడ్డి ఆలియాస్ చలపతి భార్య అరుణ.ఈమెది విశాఖ జిల్లా పెందుర్తి మండలం కరకవాణిపాలెం గ్రామానికి చెందినది.అరుణ తల్లి మావి గతజలో జరిగిన ఎన్ కౌంటర్ లో మృతిచెందింది.నాలుగు దశాబ్దాల ఉద్యమంలో అనేక ఎన్ కౌంటర్లలో పాల్గొన్నది.

తిరుపతి అలిపిరి ఘాట్ రోడ్డులో అప్పటి ఇప్పటి ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై జరిగిన దాడి ఘటనలో విశాఖ జిల్లా మాజీ ఎంఎల్ ఏ కొలారి సర్వేశ్వరరావు పాటు ఎంఎల్ ఏ హత్య ఘటనలతోపాటు అనేక ఎన్ కౌంటర్లలో ఈమె ప్రమేయం ఉన్నట్లు చెబుతారు.మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలి ఏవోబి కమిటీ మెంబర్ ప్రస్తుతం పనిచేస్తుంది. అరుణ భర్త మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు ఒరిస్సా రాష్ట్ర కార్యదర్శి రామచంద్రారెడ్డి ఆలియాస్ చలపతి జనవరి 20న చత్తీస్‌గఢ్ దండకారణ్యంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు.భర్త మృతిచెందిన ఐదునెలలకే అరుణ మారేడుమిల్లి అటవీప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ మృతిచెందడం గమనార్హం.

# నీటికోసం కోర్టుకు వెళ్తాం

>> గోదావరి నుంచి 968 టీఎంసీలు వాడుకునేందుకు, కృష్ణా జలాల నుంచి 555 టిఎంపీలను వాడుకునేందుకు తెలంగాణకు సంపూర్ణ అనుమతులు ఇచ్చాక మీరు మిగులు జలాలు తీసుకోండి. కృష్ణా,గోదావరి జలాల నుంచి తెలంగాణకు మొత్తం 1500 టిఎంసీలు కావాలని అనుమతులు ఇప్పించి మీరు మిగతా నీరు తీసుకోవాలని సూచించారు. కెసీఆర్ తెలంగాణకు చేసిన తీరని ద్రోహం వల్లే ఏపీకి నీళ్లు వెళుతున్నాయి. మేడిగడ్డ గుండెకాయ లాంటిది.. అది లేకపోతే ఆ ప్రాజెక్టు ఉన్నా ప్రయోజనం లేదు. పదేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే తెలంగాణకు ఇవాళ ఈ పరిస్థితి వచ్చేది కాదు అని చెప్పారు. కృష్ణానది జలాలు జూరాలలో తెలంగాణకు వస్తాయి. ఆ నీటిని వాడుకుంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. దీనికి కారణం కేసీఆర్ కాదా? రాయలసీమ ప్రాజెక్టులకు మీరే కదా ఒప్పుకున్నది. భగవంతుడికి భక్తుడికి అనుసంధానం అన్నట్టు మోదీకి చంద్రబాబు అవసరం ఉంది, చంద్రబాబుకి గోదావరి జలాల అవసరం ఉంది. చంద్రబాబు.... దూరం పెంచుకుంటే సమస్య పరిష్కారం కాదు.. మోదీ దగ్గర అనుమతులు తెచ్చుకున్నంత మాత్రాన మీ ప్రాజెక్టులు పూర్తికావు. కృష్ణా, గోదావరి బేసిన్ లపై మా తెలంగాణ ప్రాజెక్టులకు మీరు ఎన్ఓసీ ఇవ్వండి మిగిలిన నీరును మీరు ఎలాగైనా వాడుకోండి. గురువారం ఉదయం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ను కలిసి బనకచర్లపై మా అభ్యంతరాలను వివరిస్తాం. ఇందుకోసం రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ప్రయోజనాల కోసం అందరూ కలిసిరావాలని కోరుతున్నా అని చెప్పారు. అఖిలపక్ష భేటీకి రాకుండా కిషన్ రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రిని ముందే కలవడంలో ఆంతర్యం ఏంటి? గురువారం మేం వెళ్లి కలుస్తామని తెలిసి ఒక రోజు ముందు వెళ్లి కలవడం వెనక ఏం కుట్ర దాగుంది? అని కిషన్‌రెడ్డి తప్పుపట్టారు. 2019 అక్టోబరులోనే అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కలిసి గోదావరి జలాలను రాయలసీమకు తరలించే విషయంపై చర్చించారని రేవంత్ రెడ్డి అన్నారు.ఆ సమావేశం వివరాలను ఆనాటిమంత్రులు ఈటెల రాజేందర్, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి వివరించారని పేర్కొన్నారు.రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని ఆనాడు కెసిఆర్ మాట్లాడారు. గోదావరిబనకచర్ల ప్రాజెక్టుకు ఆనాడే ఒకరకంగా అంకురార్పణ జరిగింది. రాయలసీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తామని కేసీఆర్ అన్నట్లు నాడు పత్రికలలో కథనాలు కూడా వచ్చాయని ఆయన తెలిపారు. బనకచర్ల వ్యవహారంపై ఏ విధంగా ముందుకు సాగాలనే అంశంపై విపక్షాలతో చర్చించినట్లు చెప్పారు. తెలంగాణకు గోదావరి, కృష్ణా నదులే జీవనాధారమని, ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే అత్యంత ముఖ్యమని ఆయన పునరుద్ఘాటించారు. 2016 సెప్టెంబర్ 21న కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఏటా 3 వేల టీఎంసీల గోదావరి నీరు వృథాగా సముద్రంలోకి పోతోందని కెసిఆర్ అన్నారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు."ఈ విషయంపై మొదట మాట్లాడిందే కేసీఆర్. అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఎవరు ఏం మాట్లాడారో రికార్డుల్లో స్పష్టంగా ఉంది. తెలంగాణకు కృష్ణా నది జలాల్లో 299 టీఎంసీలు సరిపోతాయని కూడా ఆనాడే కేసీఆర్ అంగీకరించి సంతకం చేశారు. ఆ సంతకమే ఇప్పుడు తెలంగాణకు గుదిబండగా మారింది" అని ఆయన విమర్శించారు. ఢిల్లీ శ్రమ శక్తి భవన్ లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఆనాటి సాగునీరు మంత్రి హరీష్ రావు, ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్ పాల్గొన్నారు.8 పేజీల మీటింగ్ మినిట్స్ రికార్డు చేశారు. రాయలసీమకు నీళ్లు ఇవ్వాలని ఆ సమావేశంలోనే పునాది పడిందని పేర్కొన్నారు. ఈ మీటింగ్ మినిట్స్ హరీష్ రావుకి పంపిస్తానని చెప్పారు.ఏ అంశం వచ్చినా.. ఏ విషయం ప్రస్తావనకు వచ్చినా బీఆరెస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని, వాళ్ల సెంటిమెంట్ తో మళ్లీ పార్టీని బ్రతికించుకునే ప్రయత్నం చేస్తున్నారు.రైతాంగాన్ని కష్టాల నుంచి బయటపడేసేందుకు ఆనాడు కాంగ్రెస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించామని చెప్పారు. కేసీఆర్, హరీష్ సంపూర్ణ అవగాహనతో ప్రభుత్వానికి సహకరించినా, సూచనలు చేసినా స్వీకరిస్తాం.కానీ దురుద్దేశంతో రాజకీయ ప్రయోజనాల కోసం మాపై విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గోదావరి బనకచర్ల విషయంలో 2016లో కేసీఆర్, చంద్రబాబు మాట్లాడుకున్న అంశాల సాకుతో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముందుకువెళుతోందని సిఎం రేవంత్ తెలిపారు.బేసిన్లు లేవు, భేషజాలు లేవు అని కెసిఆర్ ఆనాడు మాట్లాడారు. ఏపీ చేపట్టేది 200 టీఎంసీ ప్రాజెక్టు కాదు 300 టీఎంసీల కోసం, ఆనాడు కెసిఆర్ 400 టీఎంసీలు తీసుకోవచ్చని అంగీకరించారని చెప్పారు. మేం కష్టపడి ఎస్ఎల్బీసీ పనులు ప్రారంభిస్తే మనుషులు చనిపోతే వాళ్ళు పైశాచిక ఆనందం పొందుతున్నారని దుయ్యబట్టారు. ఎక్కడ ఎవరు చనిపోయినా వాళ్ళ ముఖాల్లో పైశాచిక ఆనందం కనిపిస్తోంది.ఇవాళ మేం నిజాలు బయటపెట్టాం.. తలకాయ ఎక్కడ పెట్టుకుంటారు? అని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులు, మెట్రో విస్తరణ, రీజనల్ రింగురోడ్డు, మూసీ ప్రక్షాళన అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని కలవొద్దా? మీరు నిధులు ఇస్తామంటే చెప్పండి మేం మీ ఫామ్ హౌస్ కే వస్తాం.. రూ. 50 వేల కోట్లు ఇవ్వండి.ప్రభుత్వం తరపున బాండ్లు సమర్పిస్తాం అని చెప్పారు.తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం. ఈ విషయంలో మాకు ఎలాంటి శషభిషలు లేవు.. సామ,దాన, దండోపాయాల్లో మొదటి దశలో ఉన్నాం. కేంద్రంలో అందరినీ కలిసి సమస్యలను వివరిస్తాం.. అయినా న్యాయం జరగకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తాం అని చెప్పారు.




బుధవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బ్రహ్మోస్ ఏరోస్పేస్ బృందం. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

# హైదరాబాద్‌లో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థ విస్తరణ

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బ్రహ్మోస్ ఏరోస్పేస్ బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్18:** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగాబ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రతినిధి బృందం కలిసింది. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. సీఎంను కలిసినవారిలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండీ,సీఈవో డా. జైతీర్థ్ ఆర్.జోషి, బ్రహ్మోస్ హైదరాబాద్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సూరంపూడి సాంబశివ ప్రసాద్,డిఆర్‌డిఎల్ డైరెక్టర్ జీ.ఏ. శ్రీనివాస మూర్తి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను విస్తరించాలని వారిని సిఎం కోరారు. హైదరాబాద్, బెంగుళూరు డిఫెన్స్ కారిడార్ ఏర్పాటు చేసేందుకు అనుకూలమైనవని సిఎం వివరించారు. ఇప్పటికే హైదరాబాద్ లో డిఫెన్స్ కు సంబంధించి వివిధ సంస్థలు ఉన్నాయని సిఎం తెలిపారు. దేశంలో పెట్టుబడులకు తెలంగాణ అనుకూల ప్రదేశమని వివరించారు. బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణకు తెలంగాణ, హైదరాబాద్ ను ఎంచుకోవాలని, ప్రభుత్వం వైపు నుంచి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్న సీఎం పేర్కొన్నారు. సిఎం సూచనకు బ్రహ్మోస్ ఏరోస్పేస్ బృందం సానుకూలంగా స్పందించింది.

# 'కబుర్ల దేవత'కు కేంద్ర బాలసాహిత్య పురస్కారం

## సాహిత్య యువ పురస్కారానికి మైరావణ నవల ఎంపిక




**న్యూఢిల్లీ, జూన్ 18:** బాల సాహిత్య, యువ పురస్కారాలను కేంద్ర సాహిత్య అకాడమీ ప్రకటించింది. 24 భాషల్లో ఉత్తమ రచనలను ప్రతిష్ఠాత్మక అవార్డులకు ఎంపిక చేసింది. తెలుగు భాషకు సంబంధించి గంగిశెట్టి శివకుమార్ రచించిన 'కబుర్ల దేవత' పుస్తకానికి కేంద్ర బాల సాహిత్య పురస్కారం లభించింది. సాహిత్య యువ పురస్కారానికి ప్రసాద్ సూరి రచించిన మైరావణ నవల ఎంపికైంది. భారతీయ భాషల్లో సాహిత్య రంగంలో పలు పుస్తకాలను ఈ ప్రతిష్టాత్మక అవార్డులకు జ్యూరీ సభ్యులు సిఫారసు చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ నేతృత్వంలోని సాహిత్య అకాడమీ ఎగ్జిక్యూటివ్ బోర్డు అవార్డు గ్రహీల వివరాలు వెల్లడించింది. ఈ యేడాది డోగ్రీ భాషకు సంబంధించి యువ పురస్కారాన్ని ప్రకటించలేదు. 23 భాషల్లో ప్రచురితమైన పుస్తకాలకు మాత్రమే యువ పురస్కారాలను ప్రకటించింది.

# రైతులపై రాజీలేదు

>> రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. గోదావం బనకచర్లపై ఏపీ ప్రభుత్వం కేంద్రానికి ఫీజిబులిటీ నివేదిక సమర్పించింది" అని వివరించారు. పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు తెలంగాణ నీటి హక్కులకు పెద్ద దెబ్బ అని అన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఆంధ్రపాలకులు విభజన చట్టాన్ని కూడా ఉల్లంఘిస్తున్నారని ఆయన ఆరోపించారు. బనకచర్లపై ఎపి కేంద్రానికి ప్రీ ఫీజబులిటీ రిపోర్టు ఇచ్చింది.ఎపి రిపోర్టుపై స్పందించాలని కేంద్రం మమ్మల్ని అడిగింది. ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దని ప్రాథమికంగా అభ్యంతరాలు తెలుపుతూ కేంద్రానికి లేఖ రాశాం. పూర్తి స్థాయి నివేదికను కేంద్రానికి మేం సమర్పిస్తాం. సిఎం రేవంత్ రెడ్డి నేను గురువారం ఢిల్లీ వెళ్లి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ను కలిసి రాష్ట్ర అభ్యంతరాలను తెలుపుతామన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై ఇవాళ రాష్ట్ర సచివాలయంలో అఖిలపక్ష ఎంపీలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు.కిషన్ రెడ్డి సంజయ్ లు గైర్హాజరు పీపీటీకి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా బీఆర్ఎస్ నుంచి ఎంపీ రవిచంద్ర, బీజేపీనుంచి ఎంపీలు డీకే అరుణ, రఘునందన్ రావు, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ ఎంపీలు సురేష్ షట్కర్, రఘురాం రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, రేణుకా చౌదరి, చాలమ కిరణ్ కుమార్ రెడ్డి, బలరామ్ నాయక్, మల్లు రవి, గడ్డం వంశీ కృష్ణ, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోదావరిబనకచర్ల ప్రాజెక్టు వివరాలను సభ్యులకు ఉత్తమ్ వివరించారు. బనకచర్లపై ఏపీ ప్రభుత్వం కేంద్రానికి ప్రీ ఫీజబిలిటీ నివేదిక సమర్పించిందని చెప్పారు. గోదావరి జలాలను కృష్ణా, పెన్నా బేసిన్ లోకి తరలిస్తున్నారు. గోదావరి బనకచర్లను అనుసంధానించి 200 టీఎంసీలు వాడుకునేందుకు ఎపి ప్రణాళికలు చేస్తోంది. రోజుకు మూడు టిఎంసి తరలించే 7.41 లక్షల ఎకరాలకు నీరు అందించే ప్రణాళికతో ఉన్నారు. గోదావరి జలాలను కృష్ణా, పెన్నా బేసిన్ లోకి తరలిస్తున్నారు ఆవేదన వ్యక్తంచేశారు. గోదావరి బనకచర్లను అనుసంధానించి 200 టీఎంసీలు వాడుకునేందుకు ఎపి ప్రణాళికలు చేస్తోంది. రోజుకు మూడు టీఎంసీలు తరలించే 7.41 లక్షల ఎకరాలకు నీరు అందించే ప్రణాళికతో ఉన్నారని ఉత్తమ్ ఆరోపించారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి,బండిసంజయ్ గైర్హాజర్ అయ్యారు.బిఆర్ఎస్ వాకౌట్‌తో నిరసన తెలపింది.

**రాజీ పడేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం**

రాజకీయాలు ఎలా ఉన్నా రైతుల విషయంలో రాజీ పడేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే ముఖ్యం అని అన్నారు. గోదావరిబనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఇవాళ రాష్ట్ర సచివాలయంలో అఖిలపక్ష ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సిఎం మాట్లాడారు. గోదావరిబనకటర్లపై ఏ విధంగా ముందుకు వెళ్లాలి అనే అంశంపై విపక్షాలతోనూ చర్చించామని బనకచర్లపై ఎంపీలు తమ అభిప్రాయాలు చెప్పారన్నారు.

# గూగుల్, హైదరాబాద్ పాత స్నేహితులే

## గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి. హైదరాబాద్,జూన్18:** గూగుల్ ప్రారంభించినప్పటి నుంచి ప్రపంచం మారిపోయింది. నేడు, మన జీవితాలు పూర్తిగా డిజిటల్ మారాయని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మనం గోప్యత, భద్రత గురించి నేడు ఆందోళన చెందుతున్నామని పేర్కొన్నారు.గూగుల్ దివ్యశ్రీ భవన్‌లో ప్రముఖ ఐటీ దిగ్గజం గూగుల్ కంపెనీ ఏర్పాటు చేసిన గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్‌ని బుధవారం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,గూగుల్ సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్‌ని సిఎం పరిశీలించారు. జిఎస్ఈసీ పనితీరును సిఎంకు గూగుల్ సిబ్బంది వివరించారు. గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ప్రారంభోత్సవంలో సిఎం మాట్లాడుతూ హైటెక్ సిటీలో గూగుల్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ సెంటర్ 2 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దానికి సమీపంలోనే ఇందిరా మహిళా శక్తి సెంటర్ మూడున్నర ఎకరాల్లో ఉందని ముఖ్యమంత్రి అన్నారు.తెలంగాణ మహిళలు గూగుల్‌కు గట్టి పోటీ అని ఆయన సరదాగా అన్నారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో గూగుల్ మొదటి సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని,ఇది ప్రపంచంలో 4వది మాత్రమేనని చెప్పారు. మన ఆర్థిక వ్యవస్థ, మన ప్రభుత్వం, మన జీవితాలు డిజిటల్ గా మారాయని, డిజిటల్ సురక్షితంగా ఉంటే,మనం మరింత అభివృద్ధి చెందుతామని చెప్పారు.ఆధునాతన సైబర్ సెక్యూరిటీ, భద్రతా పరిష్కారాల కోసం గూగుల్ ఈ సైబర్‌సెక్యూరిటీ హబ్‌ను ఉపయోగిస్తున్నందుకు గర్విస్తున్నట్లు తెలిపారు. ఇది నైపుణ్య అభివృద్ధి పై దృష్టి పెడుతుంది. ఉపాధిని సృష్టించడంతో పాటు దేశం సైబర్ భద్రతా సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు.చెడు చేయవద్దన్నది గూగుల్ సంస్థ సిద్ధాంతం,ఈ విధానాన్ని నేను ఇష్టపడుతున్నానని పేర్కొన్నారు. గూగుల్ లాగా, నా ప్రభుత్వం కూడా మంచిని మాత్రమే చేస్తుందని చెప్పారు. ఈ విధానం వల్ల ప్రయోజనాలు కొంత నెమ్మదిగా కనిపిస్తాయి.. అయితే మనం దీర్ఘకాలికంగా దృష్టి పెట్టి పని చేయాలని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలు ఉత్తమ పెట్టుబడి అనుకూల రాష్ట్రం కోసం శోధిస్తే దానికి సమాధానం తెలంగాణ అని వస్తుందని నాకు కచ్చితంగా తెలుసు అన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి రూ. 8వేల కోట్లను విడుదల చేయాలి

**టోకెన్ ఇచ్చిన వాటికి నెలాఖరులోగా నిధులివ్వాలి**

**ప్రతి యేడాది నాలుగు విడతల్లో ఫీజురీయింబర్స్‌మెంట్‌ను ఇవ్వాలి**

**ముఖ్యమంత్రితో చర్చించిన అనంతరం భవిష్యత్ కార్యాచరణ**

**మీడియాకి తెలిపిన ఎఫ్‌ఏటిహెచ్‌ఐ**

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఇంజనీరింగ్ ఇతర వృత్తి విద్య కాలేజీలకు ప్రభుత్వం నుంచి రావల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసిన కాలేజీలను ఆదుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఎఫ్ఏటిహెచ్ఐ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రైవేటు ఇంజనీ రింగ్, ఫార్మసీ, ఇతర వృత్తివిద్య కాలేజీల యాజమాన్యాలు కొత్తగా అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. తెలంగాణ వృత్తి విద్య కళాశాలల యాజమాన్యాలు ఫెడరేషన్‌గా ఏర్పడి 33 మందితో కమిటీని ఏర్పాటు చేసుకున్నాయి. అసోసియేషన్ బుధవారం హైదరాబాద్ లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సమావేశంలో అసోసియేషన్ ఛైర్మన్ నిమ్మటూరి రమేష్ బాబు, సెక్రటరీ జనరల్ కెఎస్ రవి కుమార్, ట్రెజరర్ కొడాలి కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కాటం సునీల్ కుమార్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజనీరిగ్, వృత్తివిద్య కాలేజీలకు రూ. 8 వేల కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని తెలిపారు. వాటిని విడుదల చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ నేతలు ప్రభుత్వాన్ని కోరారు. బకాయిలను విడతల వారీగా చెల్లించాలన్నారు. రూ. 2 వేల కోట్లకు ప్రభుత్వం టోకెన్‌లు ఇచ్చిందని వాటికి ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వలేదన్నారు. టోకెన్‌లు ఇచ్చిన వాటికి ఈ నెలాఖరులోనే నిధులను విడుదల చేయాలని కోరారు. 2023-24 విద్యా సంవత్సరం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను 3 నెల ల్లోపు విడుదల చేయాలని 2024-25 విద్యా సంవత్సరం ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని 6 నెలల లోపు విడుదల చేయాలని కోరారు. ఇక ఈ విద్యా సంవత్సరం 2025-26 నుండి కళాశాలలకు రీయింబర్స్‌మెంట్ చెల్లింపును ఒకే విద్యా సంవత్సరంలో 4 వాయిదాల్లో విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు తెలిపారు. రీయింబర్స్‌మెంట్ విడుదలలో జాప్యం వల్ల కలిగే పరిణామాలను వివరించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మంత్రులను కలవాలని సమాఖ్య ఏకగ్రీవంగా నిర్ణయించినట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్య సంక్షేమం కోసం, ఉన్నత విద్య నాణ్యతను కాపాడటానికి ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, విద్యార్థులతో సమావేశం కావాలని కార్యనిర్వాహక మండలి ఏకగ్రీవంగా నిర్ణయించిందని తెలిపారు. తమ సమస్యను ప్రజలకు తెలియజేయడానికి సహకారించాలని కోరుతూ అన్ని మీడియా యాజమాన్యాలను కలవాలని కార్యనిర్వాహక మండలి ఏకగ్రీవంగా తీర్మానించినట్టు అసోసియేషన్ నేతలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన తరవాతే తమ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.

# బిఆర్ఎస్ హయాంలోనే బనకచర్లకు క్లియరెన్స్

**ఎంపి ధర్మపురి అరవింద్**

**హైదరాబాద్, జూన్ 18 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ హయాంలోనే బనకచర్లకు క్లియరెన్స్ ఇచ్చారని ఎంపి ధర్మపురి అరవింద్ అన్నారు. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏపి మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రపోజల్ మేరకే కెసిఆర్ ఆమోదం తెలిపారని అన్నారు. హామీల వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. కెసిఆర్ డైరెక్షన్‌లో తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టడానికి. ఇపుడు కాంగ్రెస్‌కూడా డైవర్షన్ పాలిటిక్స్ కోసం బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ కార్యక్రమం పెట్టారని చెప్పారు. బనకచర్లవల్ల తెలంగాణకు జరిగే నష్టం ఎంతో ఉత్తమ్‌కు తెలువదన్నారు. ఉత్తమ్..సగం కాంగ్రెస్..సగం బిఆర్ఎస్ అని ధ్వజమెత్తారు. ఉత్తమ్ పిసిసి చీఫ్‌గా ఉన్నప్పుడు కెసిఆర్ చెప్పిన వాళ్లకే టికెట్ ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ బిజెపిపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం నాటకాలాడుతున్నారని విమర్శించారు. ఆల్ పార్టీ ఎంపిల సమావేశంలో కూడా ఏమి ఉండదన్నారు. తెలంగాణలోని ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఉత్తమ్‌కు అవగాహన లేదన్నారు. ఎన్ని టిఎంసిలు అవసరం, ప్రాజెక్టుల వ్యయం ఎంత అనేది తెల్వదన్నారు. ఓ వైపు సిఎం రేవంత్ రెడ్డి డబ్బుల్లేవంటారని.. ఒక్కొక్కరు ఒక్కో విధంగా మాట్లాడుతారని విమర్శించారు. బనకచర్లపై కేంద్రం. సిడబ్ల్యూసి పరిశీలించి నిర్ణయం తీసుకుంటుంది. నాడు బనకచర్లపై జగన్, కెసిఆర్ చర్చించుకున్నారు. ఇప్పుడు చంద్రబాబు. రేవంత్ కూర్చున్నారా? నన్ను సిట్ పిలవలేదన్నారు. మహేష్ కుమార్ గౌడ్ ఫోన్ ఎందుకు ట్యాపింగ్ చేశారో అర్థంకావడం లేదు. ఆనాడు ఏ పదవిలో ఉన్నారని ఆయన్ను విచారణకు పిలిచారని ప్రశ్నించారు.

# ఇంజనీరింగ్ ఫీజుల సవరణకు బ్రేక్!

**సబ్ కమిటీ వేయాలని టిఎఎఫ్ఆర్‌సి నిర్ణయం?**

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల తోపాటు ఇతర వృత్తివిద్య కోర్సుల ఫీజుల సవరణకి బ్రేక్ పడింది. రాష్ట్రంలోని ఇంజనీరింగ్ ఫీజులపై 2025-26 నుంచి 2027-28కి సంబంధించిన బ్లాక్‌పిరియడ్ కోసం తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ(టిఎఎఫ్ఆర్‌సి) కసరత్తుకు సర్కారు బ్రేకులు వేయడంతో.. ఈ ఏడాది ఫీజుల పెంపు ఉండబోదని తెలుస్తోంది. ఈ విద్యాసంవత్సరం వరకు పాత ఫీజులే కొనసాగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. టిఏఎఫ్ఆర్‌సి ప్రతిపాదిత ఫీజులపై సమగ్ర అధ్యయనం చేయాలని బుధవారం నిర్వహించిన సమావేశంలో నిర్ణయించినట్టు తెలిసింది. ఇందుకోసం సబ్ కమిటీ వేయాలని నిర్ణయం తీసుకుంది. సబ్ కమిటీ ఏర్పాటు బాధ్యతలను తెలంగాణ ఉన్నత విద్యామండలికి అప్పగించారు. ఫీజుల ఖరారు కోసం తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) సమావేశాన్ని బుధవారం మాసాబ్ ట్యాంక్‌లోని కార్యాలయంలో నిర్వహించారు. టీఏఎఫ్ఆర్సీ ఛైర్మన్ జస్టిస్ గోపాల్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం కుమార్, మహాత్మాగాంధీ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ సమావేశానికి హాజరయ్యారు. ఫీజుల సవరణపై సమావేశంలో చర్చించారు. టిఏఎఫ్ఆర్‌సి కాలేజీల ఫీజుల ప్రతిపాదనలను ఖరారుచేయగా.. వాటిల్లో కొన్ని కాలేజీల్లో ఫీజులు అసాధారణంగా పెరిగాయి. ఆయా ఫీజుల సవరణపై మరోమారు అధ్యయనం చేయాలని బుధవారం జరిగిన సమావేశంలో నిర్ణయించినట్టు తెలిసింది. జులై చివరి వారంలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుండగా ఆలోపుగా ప్రభుత్వం ఫీజులపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# ఈగల్ ఎక్స్‌పర్ట్ ఇమిగ్రేషన్ కన్సల్టెన్సీ గోల్‌మాల్ కేసులో మరో నిందితురాలి అరెస్టు

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** విదేశాల్లో ఉన్నత చదువులతో పాటు అధిక వేతనంతో కూడిన ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను నిండా ముంచిన ఈగల్ ఎక్స్‌పర్ట్ ఇమిగ్రేషన్ కన్సల్టెన్సీ అనే కంపెనీ గోల్‌మాల్ వ్యవహారంలో మరో నిందితురాలిని సిఐడి అరెస్టు చేసింది. దీంతో ఈ కంపెనీ తరపున అరెస్టయిన వారి సంఖ్య ఆరుకు చేరింది, దీనికి సంబంధించిన వివరాలను సిఐడి చీఫ్ చారు సిన్హా బుధవారం మీడియాకు వెల్లడించారు. కరీంనగర్ కేంద్రంగా 2023లో సిహెచ్ కమలాకర్ అనే వ్యక్తి అబ్రాడ్ స్టడీ ప్లాన్ ఓవర్‌సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ పేరిట ఓ గోల్‌మాల్ కంపెనీని ప్రారంభించాడు. ఈ కంపెనీని కెపిహెచ్‌బితో పాటు నిర్మల్‌లోని ఖానాపూర్ లోనూ విస్తరించాడు, విదేశాల్లో ఉన్నత చదువులతో పాటు మంచి జీతంతో కూడిన ఉద్యోగాలు ఆశచూపి నిరుద్యోగుల నుంచి ఐదు లక్ష ల రూపాయలు అంతకు ఎక్కువగా వసూలు చేశాడు. మాల్టాతో పాటు మరికొన్ని విదేశాల్లో అవకాశాలు వున్నాయని అతను నిరుద్యోగులను నమ్మించాడు. అయి తే ఇతన్ని నమ్మిన నిరుద్యోగులు లక్షలాది రూపాయలు ఇచ్చి మల్టా దేశానికి వెళ్లగా అక్కడ ఎలాంటి అవకాశాలు లేకపోవడంతో వెనుదిరిగారు. దీంతో బాధితు లు కెపిహెచ్‌బితో పాటు ఖానాపూర్, కరీంనగర్‌లలో ఫిర్యాదు చేయగా దీనిపై మూడు చోట్ల కేసులు నమోదు కాగా అనంతరం ఈ కేసులను సిఐడి చేబట్టింది. దీనిపై సిఐడి విచారణ చేబట్టి అరెస్టులు మొదలుపెట్టింది. ఇప్పటి వరకు ఐదుగురిని అరెస్టు చేసింది. ఈ కంపెనీ తరపున ఘంటా అనిల్ కుమార్, ఘంటా సు నీల్ కుమార్, కొట్టు సాయి మనోజ్‌చ శుభం, వంశీ అనే వ్యక్తులు కీలకంగా వున్నారని తేలింది. వీరంతా తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు కర్నాటక సహా పలు రాష్ట్రాలలో వంద మంది వరకు నిరుద్యోగులను ఇలా మోసం చేశారు. ఈ కేసులో తాజాగా మారెడ్‌పల్లికి చెందిన ఎ8 నిందితురాలు సరోజ్ శిష్వంత్ త్రోట్ (40)ని అరెస్టు చేశారు. ఈమెను రిమాం డుకు తరలించారు. ఈమె తన భర్త ఉయ్యూరు భరత్ కుమార్‌తో కలిసి ఈగల్ ఎక్స్‌పర్ట్ ఇమిగ్రేషన్ కన్సల్టెన్సీ పేరి ట గోల్‌మాల్ కంపెనీని నిర్వహించేదని తేలింది. ఈ కంపెనీ ప్రతినిధులు అబ్రాడ్ స్టడీ ప్లాన్ ఓవర్‌సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ డైరెక్టర్లతో కలిసి అమాయకులను ముంచారు. ఈ కేసులో మిగతా నిందితుల కోసం గాలిస్తున్నారు.

# మెట్రో రెండో దశ, బనకచర్లపై కేంద్ర మంత్రులతో కిషన్‌రెడ్డి భేటీ



**హైదరాబాద్, జూన్ 18 ప్రభాతవార్త:** కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో శ్రమ్ శక్తి భవన్‌లో కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సమావేశమయ్యారు. తెలంగాణలో కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల స్థితి గురించి చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ పనులకు కేంద్రప్రభుత్వ సహకారం అంశంపై చర్చ జరిగింది. మెట్రో ఫేజ్ - 2 కోసం తెలంగాణ ప్రభుత్వం పంపించిన డిపిఆర్ ఇటీవలే అందిందని ఖట్టర్ తెలిపారు. ఈ డిపిఆర్‌ను మంత్రిత్వశాఖ అధికారులు పరిశీలిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డిపిఆర్‌లో కేంద్ర ప్రభుత్వం చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని ఈ డిపిఆర్ రూపొందించి ఉంటారని ఖట్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నిరంతరం సహకారం అందిస్తుందని ఆయన వెల్లడించారు. కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌ను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టు గురించి చర్చించారు. ఈ గోదావరి బనకచర్ల లింకు ప్రాజెక్టును మంత్రిత్వశాఖ నిబంధనలకు అనుగుణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని కిషన్ రెడ్డికి సిఆర్ పాటిల్ తెలియజేశారు. అన్ని భాగస్వామ్య పక్షాలతో చర్చించిన తర్వాత పారదర్శకమైన పద్ధతిలోనే ప్రాజెక్టుకు సంబంధించిన నిర్ణయం ఉంటుందన్నారు. ఈ విషయంలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సిఆర్ పాటిల్ భరోసా ఇచ్చారు.

# బేగంపేట విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

**బయటకు పరుగులు తీసిన సిబ్బంది**

**డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీలు**

**అంతా ఉత్తిదేనని తేల్చిన పోలీసులు**



బేగంపేట విమానాశ్రయంలో బుధవారం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

**హైదరాబాద్ (బేగంపేట) జూన్ 18,ప్రభాతవార్త:** బేగంపేట విమానాశ్రయంలో బాంబు ఉందంటూ మెయిల్ రావడంతో ఉదయం 10గంటలకు విధులకు వచ్చిన విమానాశ్రయ అధికారులు మెయిల్ చూసి అప్రమత్తమై భద్రతా దళాలకు సమాచారం ఇచ్చారు. సిబ్బంది భయంతో బయటకు పరుగులు తీసారు. వెంటనే అప్రమత్తమైన తెలంగాణ ప్రొటెక్షన్ ఫోర్స్,సీఐఎస్ఎఫ్, బాంబ్,డాగ్‌స్క్వాడ్ లు అప్రమత్తమయ్యాయి. విమానాశ్రయాన్ని ఖాళీచేసి బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలు విమానాశ్రయంలోని అణు వణువును జాగ్రత్తగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల కాలంలో అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి బయలు దేరిన విమానం ప్రమాదానికి గురై బారి సంఖ్యలో ప్రయాణీకులు ప్రాణాలు కోల్పోయిన ఘటనను మరువక ముందే అనేక ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న బేగంపేట విమానాశ్రయానికి బాంబ్ బెదిరింపు రావడంతో ఒక్క సారిగా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మెయిల్ ద్వారా వచ్చిన బెదిరింపుపై సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు. విమానాశ్రయంలోని రన్‌వేతో పాటు విమానాశ్రయ ప్రాంగణంలో పార్కు చేసిన హెలికాపర్టర్‌లు అన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేసారు. అయితే తనిఖీలలో ఎలాంటి బాంబ్ లేదని నిర్ధారిం చుకున్న పోలీసులు బెదిరింపు మెయిల్ పై దృష్టి సారించారు. బాంబ్‌బెదిరింపు నేపథ్యంలో అగ్నిమాపక శకటం. అంబులెన్స్‌లు కూడా బేగంపేట విమానాశ్రయ ప్రాంగణానికి చేరుకున్నాయి. అయితే ఎలాంటి బాంబ్ లేదని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆకతాయిలు చేసిన పనిగా వారు గుర్తించారు.

# జగిత్యాల జిల్లా వాసి ఇజ్రాయెల్‌లో మృతి

**బాంబుల శబ్దానికి గుండెపోటుతో రవీందర్ మృతి**

**మృతదేహాన్ని త్వరగా తెప్పించాలి కుటుంబ సభ్యులు వేడుకోలు**



**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:** ఇజ్రాయెల్- ఇరాన్ దేశాల మధ్య భీకర యుద్ధం జరుగుతున్న ప్రదేశంలో తీవ్రంగా బాంబుల శబ్దం రావడంతో గుండెపోటుతో ఇజ్రాయిల్ లో జగిత్యాల పట్టణానికి చెందిన రేవెల్ల రవీందర్ మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. బతుకుదెరువు కోసం ఇజ్రాయెల్ వెళ్లిన రవీందర్ బాంబుల శబ్దం ఎక్కువ కావడం గుండెపోటు వచ్చి మృతి చెందాడు... ఇజ్రాయిల్ నుండి తన మిత్రుల ద్వారా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందటంతో ఇంటి వద్ద కన్నీరు మున్నీరు అవుతున్నారు... ఇప్పటికే ఇజ్రాయెల్ ఇరాన్ దేశాల మధ్య భీకర యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో విమాన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో రవీందర్ కుటుంబ సభ్యులు ఆయన మృతదేహం కోసం ఆందోళన చెందుతున్నారు. పేదరిక కుటుంబం కాగా బతుకు దెరువు కోసం అప్పులు చేసి ఇజ్రాయెల్ వెళ్లాడు. చేసిన అప్పులు కూడా తీర్చుకోకపోవడం అకస్మాత్తుగా మృతి చెందడంతో అప్పులు ఎలా తీర్చాలి అంటూ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇజ్రాయిల్ లో మృతి చెందటంతో అతని నీ చివరి చూపు చూసుకునేందుకు కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు ప్రభుత్వం మృత దేహాన్ని త్వరగా తెప్పించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.


తెలంగాణ లెదర్ పరిశ్రమలు ప్రామోషన్ కార్పోరేషన్ లిమిటెడ్
#NO: 5-77/27, H.S. దర్గా, హైదరాబాద్ 104
టెండరు ప్రకటన
టెండర్ నం: TGLIPC/ADMN/టిన్తాల్ ఆఫ్ ఐరన్ స్క్రాప్/2024-25. వరంగల్ జిల్లా ఐనవోలు (గ్రా) వద్ద వున్న మరియు రాయదుర్గం, హైదరాబాద్ వద్ద TGLIPC లిమిటెడ్ యొక్క కేంద్ర కార్యాలయం వద్ద వున్న ఐరన్ స్క్రాప్ యొక్క విక్రయానికి 20.06.2025 నుండి 04.07.2025 వరకు ఇ-టెండర్లు కోరబడుతున్నవి. తదుపరి వివరాలకు www.eprocurement.telangana.gov.in వీక్షించండి. కాంటాక్ట్ నం: 8332090900, 9959044490.
సం/-. వైస్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్.
DIPR.NO. 3781-PP/CL/ADVT/1/2025-26 తేది: 18.06.2025



BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II
1st FLOOR, TRIVENI COMPLEX, ABIDS, AT : HYDERABAD
O.A. No. 124 OF 2025
BETWEEN :
ICICI Bank Limited ...Applicant
AND
MR. EDWIN FRANCIS LAWRENCE ...Defendant(s)
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
To,
1. Edwin Francis Lawrence S/o. Lawrence Francis, Age : Major, Occ : Private Employee, H. No. 55 A, Trimulgherry, Near Church, Gunrock, Secunderabad-500015, TS Email: Edwin.31Francis@ gmail.com
Also at: Edwin Francis Lawrence S/o. Lawrence Francis, Age : Major, Occ : Private Employee, Divya Sree Orion Sez Sy. No. 66/1, Raidurgam, Madhura, Nagar Colony, Block No. 5/6, Gachibowli, Hyderabad-500031, TS. ...Defendants
Please take the summons in the above O.A. No. 124 of 2025 filed by the Applicant for Recovery of money Rs. 28,68,268.28 Ps against you, The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "Vaartha" Hyderabad Edition newspaper and posted the matter to 21.07.2025.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:
i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 21.07.2025 at 10.30 a.m. at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 09th day of June, 2025.
(By order of the Court)
Asst Registrar
Debts Recovery Tribunal - II
Hyderabad


# మొదటి రోజు టెట్‌కు 72 శాతం హాజరు

**ప్రశాంతంగా ప్రారంభమైన పరీక్షలు**

**నేడు ఉదయం 52 కేంద్రాల్లో.. మధ్యాహ్నం 50 కేంద్రాల్లో పరీక్షలు**

**30 వరకు కొనసాగనున్న ఎగ్జామ్స్**

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) -2025 పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన పరీక్షలకు 72 శాతం మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్టు పాఠశాల విద్య డైరెక్టర్ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు పేపర్-2లో భాగంగా గణితం, సైన్స్ పరీక్షలను 53 కేంద్రాల్లో నిర్వహించారు. 13,131 మందికి కేటాయించగా.. వారిలో 9513 మంది(72.45శాతం) పరీక్షలకు హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు జరిగిన పరీక్షలను 54 కేంద్రాల్లో నిర్వహించగా.. వాటికి 13,230 మందిని కేటాయించగా వారిలో 9605 మంది(72.60శాతం) పరీక్షలకు హాజరయ్యారు. గురువారం రెండో రోజు పరీక్షల కోసం ఉదయం 52 పరీక్షా కేంద్రాలను, మధ్యాహ్నం 50 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు ఈ నెల 30 వరకు కొనసాగనున్నాయి. పరీక్షలను రాష్ట్రంలోని 15 జిల్లాల్లో 66 కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. పరీక్షలను 9 రోజులపాటు 16 సెషన్‌లలో నిర్వహించనున్నారు. పరీక్షలను ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్ జిల్లాల్లో నిర్వహిస్తున్నారు. టెట్ పరీక్షలకు రాష్ట్రంలో 1,83,653 దరఖాస్తులు వచ్చాయి. అందులో పేపర్-1కి 63,261 మంది, పేపర్-2కి 1,20,392మంది దరఖాస్తు చేసుకోగా.. 2 పేపర్లకు కలిపి 15,000 మంది దరఖాస్తు చేసుకున్నారు.

# 2023 నవంబర్‌లో 600 ఫోన్ల ట్యాపింగ్

**ఫోన్ ట్యాపింగ్‌లో కీలక పరిణామం**

**ట్యాపింగ్‌పై నాటి హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, నిఘా విభాగం అధిపతి అనిల్ కుమార్ వాంగ్మూలం నమోదు**

**నాటి చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, డిజిపి అంజనీ కుమార్‌లను విచారించేందుకు సిట్ సన్నద్ధం**

**ఎస్ఐబి మాజీ డిఎస్‌పి ప్రణీత్ కుమార్ ఎనిమిది గంటల పాటు విచారణ**

**ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే ఈ గోల్‌మాల్ జరిగిందని వెల్లడి**

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలకంగా మా రిన 2023 అసెంబ్లీ ఎన్నికల వేళ నవంబర్ నెలలో నాటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్ రావు తన బృందంతో ఏకంగా 600 ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేసినట్లు గుర్తించిన సిట్ అధికారులు దీనిపై అప్పట్లో ట్యాపింగ్‌కు సంబంధించి రివ్యూ కమిటీలో సభ్యులుగా వున్న నాటి హోం శాఖ ముఖ్య కార్యదర్శి (ప్రస్తుత డిజిపి) జితేందర్, నాటి నిఘా విభాగం అధిపతి (ప్రస్తుత ఎస్‌పిఎఫ్, పర్సనల్ విభాగం బాస్) అనిల్ కుమార్‌ల వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఇటీవలే జితేందర్‌తో పాటు అనిల్ కుమార్‌ల వాంగ్మూలాన్ని నమోదు చేసిన సిట్ అధికారులు ఇదే కేసులో కీలకంగా వున్న నాటి చీఫ్ సెక్రటరీ శాంతి కుమారితో పాటు మాజీ డిజిపి అంజనీ కుమార్‌ల వాంగ్మూలాన్ని కూడా నమోదు చేసేందుకు రెడీ అవుతున్నారు. అప్పట్లో ప్రభాకర్ రావు ట్యాపింగ్ చేసిన ఫోన్లన్నీ ప్రతిపక్ష నేతలతో పాటు బి ఆర్ఎస్‌లో దిక్కార స్వరం వినిపించిన వారు, బ్యూరోక్రాట్లు, బడా వ్యాపారులవిగా తేలగా వీరిని మావోయిస్టులుగానూ నక్సల్స్ సానుభూతిపరులుగానూ చిత్రీ కరించి దీనిపై ట్యాపింగ్‌కు సంబంధించి వున్న రివ్యూ కమిటీకి నివేదిక ఇచ్చినట్లు తేలడం తెలిసిందే. అయితే ఈ నంబర్లు రాజకీయ నేతలు, బ్యూరోక్రాట్లవని తె లిసినా కూడా కావాలనే ట్యాపింగ్ చేశారా...? లేదా రాజకీయ ఒత్తిళ్లతో జరిగిందా...? పొరపాటున చేశారా...? అనే దానిపై సిట్ అధికారులు లోతుగా విచారి స్తున్నారు. మరోవైపు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి నాటి ఎస్ఐబి డిఎస్‌పి ప్రణీత్ రావును సిట్ అధికారులు బుధవారం నాడు మరోసారి సుధీర్ఘంగా విచారిం చారు. అయితే సిట్ విచారణలో ప్రణీత్ రావు అప్పట్లో జరిగిన గోల్‌మాల్ వ్యవహారాలు ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే జరిగిందని కుండబద్దలు కొట్టారని తెలి సింది.

రాష్ట్రంలో రాజకీయంగా ప్రకంపనలు రేపుతో పోలీసు శాఖలో దుమారం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణ వేగం పుంజుకుంది. ఈ కేసులో ఎస్ఐ బి బాస్ ప్రభాకర్ రావు అమెరికా నుంచి వచ్చాక విచారణ ఒక్కసారి ఊపందుకుంది. ఆయన ఇచ్చిన సమాచారం ఆధారంగా ఎస్ఐబి మాజీ డిఎస్‌పి ప్రణీత్ రా వును రెండుసార్లు విచారించగా ఈ కేసులో బాధితులు, సాక్షుల వాంగ్మూలం నమోదు చేయసాగారు. ఇక ఈ కేసులో బుధవారం నాడు కీలక ఘట్టం వెలుగు చూసింది. ఫోన్ ట్యాపింగ్ అంతా తాను ఒక్కడినే చేయలేదని, అప్పట్లో తన పై అధికారుల ఆదేశాల మేరకే ఇదంతా జరిగిందని ప్రభాకర్ రావు చెప్పడంతో ఆ సమయంలో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి వున్న రివ్యూ కమిటీలో ముఖ్యమైన సభ్యులుగా వున్న హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, నిఘా విభాగం అ ధిపతిగా వున్న అనిల్ కుమార్‌ల వాంగ్మూలాన్ని సిట్ అధికారులు నమోదు చేశారు. ఇటీవలే వీరి వాంగ్మూలాన్ని నమోదు చేసిన సిట్ అధికారులు ఈ విషయా న్ని గోప్యంగా వుంచారు. జితేందర్, అనిల్ కుమార్‌ల నుంచి సిట్ అధికారులు లిఖిత పూర్వక వాంగ్మూలాన్ని తీసుకున్నట్లు తెలిసింది. అప్పట్లో ఫోన్ ట్యాపింగ్ జరిగిన తీరుతెన్నుల గురించి వారిద్దరు తమకు తెలిసిన విషయాలను వెల్లడించినట్లు తెలిసింది. అయితే వీరిద్దరు ఏం చెప్పారనేది వెలుగు చూడడం లేదు. అయితే 2023 నవంబర్ నెలలో జరిగిన 600 మంది ఫోన్ల ట్యాపింగ్ చట్టబద్దంగా సాగిందా...? ఈ నంబర్లన్నీ నక్సలైట్లు, మావోయిస్టు సానుభూతిపరులవిగా చె ప్పడం నిజమేనా...? ఈ నంబర్లు రాజకీయ నేతలు, బ్యూరోక్రాట్లు, బడా వ్యాపారులు, సెలబ్రటీలవి అని మీకు తెలియవా...? ఒకవేళ తెలిసినా ఏదైనా రాజ కీయ ఒత్తిళ్ల కారణంగా మిన్నకున్నారా...? అని సిట్ అధికారులు జితేందర్, అనిల్ కుమార్‌ను ప్రశ్నించారని సమాచారం. ఇదే విషయమై ఈ నంబర్లను ట్యాపిం గ్ కోసం టెలికమ్యూనికేషన్స్ శాఖకు పంపిన నాటి చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, ఆ సమయంలో డిజిపిగా వున్న అంజనీ కుమార్‌ల వాంగ్మూలం కూడా తీసు కోవాలని సిట్ అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. కాగా ప్రభాకర్ రావు ఎస్ఐబి బాస్‌గా వున్న సమయంలో ఫోన్ ట్యాపింగ్ జరిగిన వేళ చీఫ్ సెక్రటరీగా వు న్న సోమేష్ కుమార్, డిజిపిగా పనిచేసిన మహేందర్ రెడ్డిల వాంగ్మూలాన్ని కూడా తీసుకోవాలని సిట్ అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

**ప్రణీత్ రావును ఎనిమిది గంటల పాటు విచారించిన సిట్ అధికారులు**

**ప్రభాకర్ రావు చెప్పిందే చేశానని వెల్లడి**

ఇదిలావుండగా ఫోన్ ట్యాపింగ్ కేసులో నాటి ఎస్ఐబి డిఎస్‌పి ప్రణీత్ రావును సిట్ అధికారులు బుధవారం నాడు ఎనిమిది గంటల పాటు విచారించారు. నా లుగు రోజుల ముందు ఒకసారి ఆయనను సుధీర్ఘంగా విచారించడం తెలిసిందే. అయితే దీని తరువా ట్యాపింగ్‌కు సంబంధించి సాక్షులు, బాధితుల వాంగ్మూలం ఆధారంగా సిట్ అధికారులు ప్రణీత్ రావును మళ్లీ విచారించారు. తాజా విచారణలో కూడా ప్రభాకర్ రావు అప్పట్లో జరిగిన గోల్‌మాల్‌కు ప్రభాకర్ రావుదే బా ధ్యగా చెప్పారని సమాచారం. ఎస్ఐబి ఫోన్ ట్యాపింగ్ యూనిట్ అంతా అక్రమాట పుట్టగా ఆయన చెప్పారని తెలిసింది. అప్పట్లో ఎస్ఐబి బాస్‌గా వున్న ప్రభా కర్ రావు ఏం చెబితే అదే చెల్లుబాటయ్యేదని, ఆయన ఎంత అంటే అంత అన్నట్లుగా సాగేదని ప్రణీత్ రావు చెప్పారని సమాచారం. ఫోన్ ట్యాపింగ్ యూనిట్ లో తనతో పాటు వున్న మిగతా వారంతా నిమిత్తమాత్రులేనని ఆయన చెప్పారని తెలిసింది. ఈ కేసులో తాజాగా బాధితులు, సాక్షులు ఇచ్చిన వాంగ్మూలంలో చాలా వరకు నిజాలు వున్నాయని ప్రణీత్ రావు అంగీకరించినట్లు తెలిసింది. దీంతో పాటు అప్పట్లో జరిగిన హార్డ్ డిస్కుల విధ్వంసం, కంప్యూటర్ల నాశనం అం తా ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే జరిగిందని ఆయన చెప్పారని తెలిసింది. కాగా ఈ కేసులో ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు బుధవారం విచారణకు రావ లసి వున్నా దీనిని గురువారానికి పోలీసులు వాయిదా వేశారు.

**కాంగ్రెస్ నాయకుల వాంగ్మూలం నమోదు**

మరోవైపు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి బుధవారం నాడు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జైపాల్ రెడ్డి మరో నాయకుడు సైదులు జూబ్లీహిల్స్ ఎసిపి ఎదు ట వాంగ్మూలం ఇచ్చారు. 2023 అసెంబ్లీ ఎన్నికల వేళ తమ ఫోన్లు కూడా ట్యాపింగ్‌కు గురైందని వారు ఈ సందర్భంగా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల తో పాటు బిఆర్ఎస్‌ను వ్యతిరేకించిన అందరి ఫోన్లను అప్పట్లో ట్యాపింగ్ చేశారని జైపాల్ రెడ్డి, సైదులు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరగాలని, దోషులకు కఠిన శిక్షలు పడాలని వారు డిమాండ్ చేశారు.


తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండెంట్ కార్యాలయం, ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రి: సుల్తాన్ బజార్: హైదరాబాద్
టెండరు ప్రకటన
Rc.No: A2/GMH/SBH/2025/ తేది: 18.06.2025
ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రులు, సుల్తాన్ బజార్, హైదరాబాద్ వారికి 2025 to 2027 (2 సంవత్సరాలు) సంవత్సరం కొరకు క్రింది ఐటమ్‌ల సరఫరా నిమిత్తం పేరొందిన కంపెనీలు/సంస్థలు నుండి సీల్ టెండర్‌లు కోరబడుతున్నవి. టెండర్ ఫారం నియమాలు మరియు నిబంధనలతో నహా హైదరాబాద్, సుల్తాన్ బజార్, ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం నుండి "Hospital Development Society" పేరిట డిడి ద్వారా లేదా నగదు రూ.1000/- చెల్లింపుపై 20.06.2025 నుండి 05.07.2025 ఉ.11.00గం. నుండి సా.4.00గం. మధ్యలో పొందవచ్చును. ప్రతీ టెండర్‌కు జతపరచవలసిన బయానా వివరాలు ఈ క్రింది విధంగా : 1. డ్రగ్ మరియు మెడిసిన్/సర్జికల్ ఐటమ్‌లు/ల్యాబ్ ఐటమ్‌లు: రూ.15,000. టెండర్ షెడ్యూల్ 2. టెండర్ ఫారాల యొక్క విక్రయ తేది : 20.06.2025. 3. టెండర్ ఫారంల విక్రయానికి చివరి తేది : 05.07.2025. 4. టెండర్ ఫారం స్వీకరణ/దాఖలుకు చివరి తేది : 07.07.2025 సా.4.00గం. వరకు. 5. టెండర్‌లు తెరచుట: 08.07.2025 మ.12.30గం. వద్ద. 6. టెండర్ తెరచు ప్రదేశం : ఆసుపత్రి యొక్క సూపరింటెండెంట్ ఛాంబర్. తదుపరి వివరాలు సూపరింటెండెంట్, ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రి, సుల్తాన్‌బజార్, హైదరాబాద్ నుండి పొందవచ్చును.
సం/-. సూపరింటెండెంట్, ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రి, సుల్తాన్ బజార్, హైదరాబాద్.
DIPR.NO. 3765-PP/CL/ADVT/1/2025-26 తేది: 18.06.2025



తెలంగాణ ప్రభుత్వం
డిపిహెచ్ & ఎఫ్ డబ్ల్యూ: స్టేట్ హెల్త్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్: ఎస్.ఆర్.నగర్. హైదరాబాద్.
ప్రకటన
ఆర్.సి.నెం.3719/ఎస్.హెచ్.టి.ఓ/రిజిస్ట్రేషన్ ఆఫ్ ఫర్మ్స్/2025-26 తేది 28.05.2025 (అన్ని రకాల ఆటోమొబైల్ విడి భాగాలు, అపోలిస్ట్రీ, బేరింగ్స్, హార్డ్‌వేర్, కాటన్ వేస్ట్, అద్దములు, వనిముట్లు మరియు ఎక్విప్మెంట్లు యొక్క సరఫరా కొరకు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలలోని పేరొందిన సంస్థలు, పంపిణీదారులు మరియు డీలర్ల నుండి పార్చ్వర్క్, మెషినింగ్ వర్క్ మరియు వెహికల్ రిపేరు వర్క్ వగైరాల రెండింటి వర్క్ షాపుల నుండి స్టేట్ హెల్త్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్, 500038లో రిజిస్ట్రేషన్ నిమిత్తం నిర్ణీత నమూనాలో దరఖాస్తులు కోరబడుతున్నాయి. దిగువ తెలిపిన హెడ్ ఆఫ్ అకౌంట్ క్రింద రూ.500/- (రూపాయలు ఐదు వందలు మాత్రమే) చెల్లించి చలాన్ దాఖలు చేసిన మీదట స్టేట్ హెల్త్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్, 500038 నుండి నియమ నిబంధనలతో కూడిన నిర్ణీత దరఖాస్తు ఫారాలను పొందవచ్చును. 2210-మెడికల్ & పబ్లిక్ హెల్త్, (04)-పబ్లిక్ హెల్త్, 800-అదర్ రిసిప్ట్స్, 81-అదర్ ఐటమ్స్. దరఖాస్తు కొరకు ఫీజు డి.డి.ఓ కోడ్ 25000903090 పూర్తి చేసిన దరఖాస్తు ఫారములు ఎస్.హెచ్.టి.ఓ. వారికి రూ.500/- చలానాతో (చిన్నతరహా కుటుంబ పరిశ్రమ వారికి రూ.250/- మాత్రమే) దరఖాస్తు ఫారాన్ని తేది 30.06.2025లోగా దాఖలు చేయవలెను. పైన తెలిపిన అమౌంట్ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, గన్‌ఫౌండ్రీ బ్రాంచ్ వద్ద చలానా తీసుకోగలరు. మరిన్ని వివరాల కోసం క్రింది సంతకందారును సంప్రదించవచ్చు. జమ చేసిన అమౌంట్ ఎట్టి పరిస్థితిలో వాపసు ఇవ్వబడదు.
సం/- సంచాలకులు, ప్రజారోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, తెలంగాణ, హైదరాబాద్.
DIPR.No.3756-PP/CL/Advt/1/2025-26, తేది: 18.06.2025

వార్త

అన్నీ మన మేలు కోసమే అని తలిస్తే,
ఎలాంటి క్లిష్టపరిస్థితి కూడా మనసును
కలత పెట్టలేదు.

-జెఫర్‌సన్

# అన్నవస్త్రాల కన్నా మిన్నగా!

మూడో ప్రపంచయుద్ధం ముంచుకొస్తున్న ఛాయలు కనపడుతున్నవేళ, ప్రపంచ దేశాలు తమ ఆయుధ సంపత్తిని పెంచుకోవడంలో పరుగులు తీస్తున్నాయి. అణ్వాయుధాలున్న దేశాలే ఇప్పుడు తామే మొనగాళ్లమంటూ కాలరెగరేసే పరిస్థితి ఉంది. గెలుపోటముల దైవాధీనాలైనా ఆయుధాల సంఖ్యలో ఏ మాత్రం వెనుకబడకూడదనే లక్ష్యంతో అగ్రదేశాలు ముందుకు కదులుతున్నాయి. అణ్వాయుధాల్లో అమెరికా,రష్యా తర్వాత చైనా ఏ దేశం వద్ద ఎన్ని అణ్వాయుధాలుంటే అంత గొప్పన్న స్థాయిగా చెప్పుకోగలుగుతున్నాయి. అణ్వస్త్రాలు కావాలా? అన్న వస్త్రాలు కావాలా అన్న దేశీయ నినాదాల నుండి, అన్న వస్త్రాలున్నా లేకున్నా అణ్వాయుధాలు ఉంటే చాలనే స్థాయికి దేశాలు ఆయుధ సంపత్తి కోసం అర్రులు చాస్తున్నాయి. ఇందుకు పాకిస్థాన్ ఓ మంచి ఉదాహరణ. పాక్ గత కొన్నేళ్లుగా కరవు కోరల్లో చిక్కుకొంది. తమ సైన్యానికి నిండా తిండి వనరులు సమాకూరుస్తున్నా లేకున్నా తమకు అణ్వాయుధాలుంటే చాలనే స్థాయికి వెళ్లింది. తమకు అణ్వాయుధాలున్నాయని విర్రవీగినా నిన్నమొన్నటి యుద్ధంలో భారత్ మీద గెలువలేక తోకముడిచింది. సభ్యదేశాల మధ్య నవ్వుల పాలయ్యింది. ఇరాన్, ఇజ్రాయెల్, రష్యా, ఉక్రెయిన్, భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధోన్మాదాన్ని చూస్తున్నాము. తీవ్రంగా క్షిపణిదాడులు చేసుకుంటున్నాయి. తమ దేశంపై ఇజ్రాయెల్ అణ్వస్త్రాలను ప్రయోగిస్తే మా సోదర దేశం పాకిస్థాన్ ఇజ్రాయెల్‌పై అణుబాంబు వేస్తుందని ఇరాన్ సీనియర్ అధికారం జనరల్ మోహసీన్ రరజేయీ ముందుగా ప్రకటించేశారు. పాకిస్థాన్ పెద్దగా స్పందించక పోయినా వారి మధ్య స్నేహసంబంధాల రీత్యా పాకిస్థాన్ అణ్వాయుధాలను ప్రయోగించనూవచ్చు. ప్రయోగించకపోనూవచ్చు. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి) నుంచి వైదొలగేందుకు ఇరాన్ వంటి దేశాలు సిద్ధపడ్డాయి. అంటే అణ్వస్త్రాల వినియోగంలో ఎలాంటి ఒత్తిడిలు ఉండరాదనే అర్థం. అమెరికా, రష్యా, యు.కె, ఫ్రాన్స్, చైనా, ఇండియా, పాకిస్థాన్, ఉత్తరకొరియా, ఇజ్రాయెల్ వంటి తొమ్మిది అణ్వాయుధ దేశాల్లో దాదాపు అన్ని దేశాలు 2024లో తమ ఆయుధ సంపత్తిని పెంచుకునే పనిలో పడ్డాయి. ఈ విషయాన్ని స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి)తప నివేదికలో పేర్కొంది. అనగా ప్రస్తుతమున్న ఆయుధాలను అప్‌గ్రేడ్ చేసి యుద్ధానికి సన్నద్ధంగా ఉండే స్థాయికి చేరుకున్నట్లు అనుకోవాలి. చైనాకు 600 అణ్వాయుధ వార్‌హెడ్స్ ఉండగా 2035 నాటికి చైనా 1500 అణ్వాయుధాలను సమకూర్చుకోవాలని అనుకుంటున్నట్లు 'సిపి' నివేదిక వెల్లడించింది. ప్రస్తుతమున్న ఆయుధ సంపత్తిని పరిశీలించి చూస్తే జనవరి 2025 నాటికి ప్రపంచదేశాల్లో 12,241 అణ్వాయుధాలుండగా మిలిటరీలో సత్వర ప్రయోగానికి సిద్ధంగా ఉంచినవి 9,614 క్షిపణులు, యుద్ధ విమానాలకు బిగించిన అణువార్ హెడ్‌లు 3,912మాత్రమే. 2100 బాలిస్టిక్ క్షిపణలు ప్రయోగానికి సిద్ధంగా ఉన్నాయి. రష్యా (5459), అమెరికా (5177), చైనా (600), ఫ్రాన్స్(290) బ్రిటన్ (225), భారత్ (180), పాక్ (170), ఇజ్రాయెల్ (90) ఉత్తర కొరియా(50) అణ్వాయుధాలున్నాయి. అణ్వాయుధ వ్యాప్తినిరోధానికి రెండు దశాబ్దాల క్రితమే ప్రపంచ దేశాల్లో అణ్వస్త్ర నిరోధక కార్యక్రమం ప్రారంభమైనా అణ్వస్త్ర నియంత్రణ నుంచి అణ్వస్త్ర విరమణకు కృషి చేసినా చాలాదేశాలు తమ దేశ భద్రత కోసం అణ్వాయుధాలను సేకరించుకోకుండా, తయారు చేసుకోకుండా నిరోధించడం అంత సాధ్యమైన పనికాదు. కొన్ని అగ్రదేశాల అణ్వాయుధాల జాబితా తేటతెల్లమే. కాగా అమెరికావంటి అగ్రరాజ్యం తన వద్దమాత్రమే అణ్వాయుధాలుండాలి, ఇరాన్ వంటి దేశాల వద్ద అణ్వాయుధాలుండరాదనే ఆంక్షలు పెడ్తున్నట్లు ఆ నేపథ్యంలో ఇరాన్ మీద ఇజ్రాయెల్ క్షిపణులతో తెగబడినట్లు తెలిసిందే. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిరోధించడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ ఆదేశంపై దాడులు ప్రారంభించి ప్రస్తుతానికి నతాంజ్ యురేనియం శుద్ధి కర్మాగారాన్ని మాత్రమే దెబ్బతీయగలిగింది. ఇరాన్ అణు కార్యక్రమానికి అత్యంత కీలకమైన 'ఫోర్డో' అణు కేంద్రం ఛాయలకైనా వెళ్లలేకపోయింది. అది అణుదుర్భేధ్యంగా ఉంటుందని చెబుతున్నారు. నిజానికి ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు అమెరికా పరోక్ష మద్దతు ఉన్నట్లే అర్థమవుతోంది. ఇరాన్ వద్ద ఎలాంటి అణ్వాయుధం ఉండరాదని ట్రంప్ అభిలషిస్తున్నందునే ఇజ్రాయెల్‌దూకుడు ఎక్కువగా ఉంది. భారీ ఎత్తున అణ్వస్త్రాలు కలిగి ఉన్న అమెరికా మరోచిన్నదేశం ఎలాంటి అణు కార్యక్రమాలు చేపట్టరాదని ఆంక్షలు విధించడం ఏమాత్రం సమర్థనీయంగా లేదు. ఇరాన్ దాడికి రాకుంటే...అనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాటలు వింటుంటే అదొక ప్రమాదకర పెత్తందారీ వ్యవహారమే అనుకోవాలి. ఇరాన్ అణ్వాయుధ తయారీకి అతిచేరువలో ఉందని ట్రంప్ బాగా విశ్వసిస్తున్నారు. అందుకేనేమో ఎలాగైనా ఇరాన్‌ను దారిలోకి తెచ్చుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు. సోమవారం కెనడాలో జరుగుతున్న జి7దేశాల సమావేశం నుంచి అత్యవసరంగా వెనుదిరిగారు. నిజానికి ఇరాన్ మూడేళ్లకు కానీఅణుబాంబు తయారుచేసుకోలేదని ఇప్పటికిప్పుడు అణ్వాయుధాలు తయారు చేసేసామర్థ్యం ఇరాన్‌కు లేదని అమెరికా నిఘా సంస్థ తేటతెల్లం చేసినా ట్రంప్, నెతన్యాహులు కలిసి ఇరాన్ పనిపట్టాలనే చూస్తున్నారు. ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య ఘర్షణలు ఉగ్రరూపందాలిస్తే స్పందించేందుకు వీలుగా అమెరికా యుద్ధనౌకలు, సైనికవిమానాలకు మోహరించింది. దీనికర్థమేమిటో కాలమే నిర్ణయిస్తుంది.

అంతులేని కోరికలుండడమే పెద్ద దోషం, ఇతరుల గురించి చెడుగా చెప్పడమే పెద్ద పాపం. సత్యంగా ప్రవర్తించటమే నిజమైన తపస్సు.



గురజాడ అప్పారావు

అదును తెలిసి వ్యవహరించటమంటే ఎంతో శ్రమను, సమయాన్ని, వ్యయాన్ని ఆదా చేయటమే.



ఆస్కార్‌వైల్డ్

# ప్రజావాక్కు



### వరుస హెలికాప్టర్ ప్రమాదాలు

గతంలో జరిగిన అనేక ఘటనల నుంచి అవసరమైన పాఠాలునేర్చుకోకుండా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరం. వీటికి కారణాలు స్పష్టంగా ఉన్నాయి. పాతదైన హెలికాప్టర్లు, అనుభవ లేని సిబ్బంది, తగిన పర్యవేక్షణ లేకపోవడం, నిర్వహణ ప్రమాణాలకు తూట్లు పడటం, వాతావరణ సూచనలను నిర్లక్ష్యం చేయడం మొదలైనవి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. దేశవ్యాప్తంగా హెలికాప్టర్ రవాణాకు సంబంధించి ఒక సమగ్ర భద్రతా విధానాన్ని రూపొందించాలి. ప్రతి హెలికాప్టర్‌కు నిర్వహణ ఆడిట్లు తప్పనిసరిగా చేయాలి. విమాన నిబంధనలు పాటిస్తున్నాయా?సిబ్బంది శారీరక, మానసిక ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది? వాతావరణ పరిస్థితులపై వారికేంత అవగాహన ఉంది? ఇవన్నీ నిర్ధారించే విధంగా వ్యవస్థను పటిష్ఠం చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పింఛన్లు పెంచండి

బిజెపి ప్రభుత్వం కేంద్రంలో పరిపాలన మొదలుపెట్టినప్పటి నుండి ఇప్పటివరకు ఇ.పి.ఎస్. 95 స్కీము ద్వారా పదవీ విరమణ చేసిన వారికి 2014 నుండి ఈనాటికీ కదలని మెదలని వెయ్యి రూపాయల ఫించన్ను కనీసం 7500కు పెంచమని గతదశాబ్దం పైగానేషనల్ ఏజిటేషన్ కమిటీ ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేసినా ఇంతవరకు చలనం లేదు. పదేళ్ళ క్రితమే అనేక కమిటీలు కనీస ఫించన్నుమూడు వేలకుపెంచాలని సిఫారసులు చేసాయి. ఇంకో నాలుగైదేళ్ళు ఇలానే కాలాయాపన చేస్తూ గడిపేస్తే ఆ తరువాత వికసించినా ఆనంద పడేవారేవరూ మిగిలి ఉండకపోవచ్చు.

- డా.ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### గురుకుల లెక్చరర్స్ మనవి

గత సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలలో లెక్చరర్‌పోస్టులు భర్తీచేయడం జరిగింది. కొన్ని చోట్ల సబ్జెక్టు లెక్చరర్స్ ఉన్నారు కానీ సామాజిక శాస్త్రాలు అయిన ఆర్ట్స్ గ్రూపులు సబ్జెక్టులు కోర్సులు పెట్టడం లేదు. ఈవిధంగా మహిళా లెక్చరర్స్, వికలాంగులైన లెక్చరర్స్, సబ్జెక్టులు లేక ఇబ్బందులు పడుతున్నారు. వీరికి జనరల్‌నాలెడ్జి క్లాసులు బోధించే చూడాలి.

- రాపాక రవీందర్, జనగాం

### నవభారత నిర్మాణం జన గణనతో శ్రీకారం

నూట నలభైఆరు కోట్ల మంది ప్రజలతో,ప్రపంచ జనాభాలో మొదటిస్థానంలో ఉన్న భారతదేశం, జనాభా లెక్కల ప్రక్రియకు శ్రీకారంచుట్టింది. అందుకుగాను కేంద్రం అధికారిక నోటిఫికేషన్ విడుదలచేసింది. దానిప్రకారం దేశంలో రెండు విడతల్లో గణన జరిగి 2027 మార్చి ఒకటవ తారీఖుకి కొత్త అధికారిక లెక్కలు పూర్తవుతాయి. దశాబ్దానికి ఒకసారి జరగాల్సిన గణన ఈసారి కోవిడ్ పరిస్థితుల కారణంగా సమయానికి జరగక, ఏడేళ్ల ఆలస్యంగా జరగబోతోంది. ఈ గణన దేశ రాజకీయ, శాసన,పాలన ముఖచిత్రాల్ని మార్చబోతోంది. కొత్త జనాభా లెక్కల ఆధారంగా పార్లమెంట్ నియోజక వర్గాల పునర్విభజన జరిగి2029ఎన్నికలకు దేశం సిద్ధపడుతుంది. ఈసారి స్వతంత్ర భారత దేశం లో మొదటి సారిగా జనాభా లెక్కల్లో కుల గణన కూడా జరగబోతోంది.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### నీటిపారుదల సౌకర్యాలు కల్పించాలి

రాష్ట్రంలోని పట్టా కలిగిన బీడు భూములను సాగు చేయడానికి ఉపాధి హామీ ద్వారా అవకాశం ఉంది. అయితే భూమి చదును కార్యక్రమాల కింద విస్తృత భూమి సాగులోకి వచ్చే అవకాశం ఉంది. దీనికి ప్రధాన కారణం ఉత్తర తెలంగాణలోనే కాదు దేశంలోనే వ్యవసాయ అవసరాల కోసమే నిర్మించిన శ్రీపాద సాగర్ ఎత్తిపోతల పథకంతో పాటు కరీంనగర్‌లో నిర్మించిన లోయర్ మానేరు డ్యాం ,అప్పర్ మానేరు లాంటి ప్రాజెక్ట్స్‌తో పాటు కాళేశ్వరం ద్వారా నిర్మించిన గొలుసుకట్టు డ్యాంలు తెలంగాణలో నీటి పారుదల సౌకర్యాలు పెరిగినవి. వీటితో పాటు గొలుసు కట్టు చెరువులు అదనం వీటి అన్నింటి మూలంగా భూమి అభివృద్ధి చేయడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. వీటితో పాటు రైతు బంధు లాంటి పథకాల ద్వారా సదరు రైతులు బాగుపడే అవకాశం ఉంది.

-భారత అవినాష్, జనగామ

### పెరిగిపోతున్న పబ్లిక్ న్యూసెన్స్‌లు

మన పురాణకాలంలో ప్రజలను పీడించిన నరకాసురుడనే రాక్షసుని శ్రీకృష్ణుడు వధించిన సందర్భంలో ఆ రాక్షసుని పీడ విరగడై పోయిందనీ, చెడుపై మంచి సాధించిన విజయంగా ప్రజలంతా భావించి దీపావళి పండుగ చేసుకోవటం ఆనవాయితీగా మారిందని పెద్దలు చెబుతారు. ఐతే ఈ రోజుల్లో ఆ దీపావళి టపాసుల వినియోగం నానాటికి పెరిగిపోతూ ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి కూడా ముప్పుగా తయారైంది.

-తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లే కీలకం!

**కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీ బిసివర్గాల్లో ఆశను కలిగించినా, దానిని కార్యరూపం దాల్చాలంటే రాజకీయ ప్రకటనలకన్నా పైగా చట్టబద్ధ ప్రణాళిక అవసరం. ఒకవేళ ప్రభుత్వం శాస్త్రీయంగా బిసి జనాభా గణాంకాలను సేకరించి, హైకోర్టు, సుప్రీంకోర్టుల మార్గదర్శకాలను అనుసరిస్తూ, అవ సరమైతే కేంద్రంతో రాజ్యాంగ సవరణపై చర్చ జరిపితేనే ఈ సమస్యకు సుస్థిర పరిష్కారం కనుగొనగలుగుతుంది. లేదంటే ప్రతి ఎన్నికల నాటికి ఇదే సమస్య రాజకీయం చెంది, బిసిల సామూహిక ఆకాంక్షలు ఒక రాజకీయ నినాదంగా మిగిలిపోతాయన్నది దురదృష్టకరం. బిసి రిజర్వేషన్ల అంశంపై దృష్టి సారించే సమయం ఇది. ఇది కేవలం ఓట్ల కోసం తాత్కాలిక పథకంగా కాక, శాశ్వత సామాజికన్యాయ సాధనగా మారేందుకు పాలకుల చిత్తశుద్ధి అవసరం. ప్రజాస్వామ్యంలో నమ్మకం నిలబెట్టాలంటే, హామీల అమలు తప్పనిసరి. హామీలను కార్యరూపం దాల్చే విధంగా చట్టం, కార్యాచరణ రూపొందించి, సామాజిక న్యాయ సాధనలో సమగ్రమైన నైతికత ప్రధానం.**



రామ కిష్టయ్య సంగన భట్ల

తెలంగాణలో స్థానిక సంస్థలఎన్నికలు సమీపిస్తున్న వేళ, బిసి రిజర్వేషన్ల అంశం రాజకీయ, న్యాయ, సామాజిక వేదికలన్నింటినీ కలకలం రేపుతోంది. ముఖ్యంగా 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తానంది. ఇప్పుడు కార్యరూపం దాల్చే దశకు వచ్చినపుడు అనేక ప్రశ్నలు, సందేహాలు, అడ్డంకులు ఆ హామీ విషయంలో తలెత్తడంతో ప్రశ్నార్థకంగా మారింది. బిసి రిజర్వేషన్ల అంశం మరోసారి సమగ్ర చర్చకు దారి తీసింది. ఈ హామీ సామాజిక న్యాయ పరిరక్షణలో కొత్త ఒరవడి తీసుకురాగలదా? లేక మరొకసారి రాజకీయ వాగ్దానంగా మిగిలిపోతుందా? అన్న ప్రశ్నలు ప్రజాస్వామ్య పరిరక్షక వర్గాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. భారత రాజ్యాంగం 73వ, 74వ సవరణల ద్వారా దేశంలో ప్రజాపాలన వికేంద్రీకరణ దిశగా పదునెక్కింది. గ్రామపంచాయతీ నుండి మహానగర పాలక సంస్థల వరకు ఎన్నికల ద్వారా ఏర్పడే స్థానిక సంస్థలకు సముచితంగా ప్రజాప్రతినిధులను ఎంపిక చేసుకోవడంలో సామాజిక న్యాయం కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో వెనుకబడిన వర్గాలైన ఎస్సీ,ఎస్టీ, బిసి, మహిళలకు రిజర్వేషన్లు కల్పించి వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని పటిష్ఠపరచాలన్న ఆవశ్యకతను రాజ్యాంగమే గుర్తించింది. అయితే ఈ రిజర్వేషన్ల అమలులో అనేక అనిర్దిష్ట పరిణామాలు, న్యాయ సవాళ్లు, రాజకీయ ప్రయత్నాలు ఎదురవుతున్నాయి. ఇందులో ముఖ్యంగా బిసి రిజర్వేషన్ల అంశం అత్యంత సంక్లిష్టంగా మారింది. రాష్ట్రానికీ రాష్ట్రానికి బిసి వర్గీకరణలో భిన్నత ఉంటుంది. బిసిలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎటువంటి స్థితిలో ఉన్నారన్నదానిపై సమగ్ర అధ్యయనం చేయకుండానే వాటికి కోటాల ఖరారు ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమిస్తోంది. సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక తీర్పుల్లో బిసిలకు రిజర్వేషన్ అమలులో మూడు ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఒకటి శాస్త్రీయంగా సేకరించిన డేటా ఆధారంగా బిసిల వెనుకబడిన స్థితిని నిర్ధారించాలి. రెండు రిజర్వేషన్ల ప్రభావం ప్రజాస్వామ్య సమతుల్యతపై ఎలా ఉంటుందో పరిశీలించాలి. మూడవది మొత్తం రిజర్వేషన్లు 50శాతం మించకూడదు. ఈ నిబంధనలమధ్య కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 42శాతం బిసి రిజర్వేషన్ హామీ రాజ్యాంగ బద్ధతకు అనుగుణమా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో బిసిల సంఖ్య సుమారు 50శాతం వరకు ఉన్నదని కొన్ని సర్వేలు సూచించినా,రాష్ట్ర స్థాయిలో శాస్త్రీయంగా ధృవీకరించిన డేటా ఇప్పటికీ అందుబాటులో లేదు. 2010లో సుప్రీంకోర్టు మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంలో ఇచ్చిన తీర్పులో, లెక్కించ తగిన డాటా లేకుండా రిజర్వేషన్లు ఇవ్వడం సబబు కాదని స్పష్టం చేసింది. ఈ తీర్పు ఆధారంగా ఇటీవలే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బిసి రిజర్వేషన్లపై ఎన్నికల ప్రక్రియ నిలిపివేయబడ్డ సందర్భాలు ఉన్నాయి. అదే





బాటలో 2022లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బిసి రిజర్వేషన్ల గడిచిన అనుసరణల్లో సైతం వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బిసి రిజర్వేషన్ల అమలుకు ముందు ఆయా న్యాయ మార్గదర్శకాలను గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటు బిసివర్గాలు మాత్రం 42 శాతం హామీ అమలుపై స్పష్టత కోరుతున్నాయి. దశాబ్దాలుగా స్థానిక సంస్థల రాజకీయాల్లో బిసి వర్గాల అధికార ప్రాతినిధ్యం పెరిగినప్పటికీ, వాటిలోనూ కొన్ని వర్గాలకే పదేపదే అవకాశాలు లభిస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. బిసిల్లోని వివిధ ఉపవర్గాలకు న్యాయం జరగాలంటే, రిజర్వేషన్లలో శ్రేణీకరణ అవసరమని పలువురు నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన రోహిణీ కమిషన్ నివేదిక ప్రకారం, బిసిల్లో 15 శాతం వర్గాలే దాదాపు 80శాతం రిజర్వేషన్‌ను వినియోగిస్తున్నాయని తేలింది. ఈ వాస్తవాల నేపథ్యంలో బిసి రిజర్వేషన్ పెంపునే కాకుండా, ఆ రిజర్వేషన్ పంపిణీ పద్ధతి పట్ల కూడా స్పష్టత అవసరమైంది. ఇంకా మరో సమస్య ఏమిటంటే, బిసి రిజర్వేషన్ల అమలును స్థానిక రాజకీయ నాయకులు, పార్టీలు నియంత్రిస్తున్న విధానం. వాస్తవంగా సామాజికంగా వెనుకబడిన వారికి అవకాశం రావాల్సిన చోట, పార్టీ అధినేతల బంధువులు, అనుచరులు, అదే వర్గానికి చెందినవారే పదే పదే పదవులను అధిష్ఠిస్తున్నారు. దీనివలన అసలు రిజర్వేషన్ ఉద్దేశానికి విరుద్ధంగా సామాజిక సమతుల్యత దెబ్బ తింటోంది. ఇక కాంగ్రెస్ హామీపై వస్తున్న విమర్శల్లో ఒకటి ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి స్పష్టమైన అమలుయోచన లేకపోవడమే. బిసి రిజర్వేషన్ 42శాతం చట్టంగా అమలవ్వాలంటే అసెంబ్లీలో చట్టం చేయడమే కాకుండా, ప్రస్తుతం ఉన్న మహిళా, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లతో కలిపి మొత్తంగా 50 శాతం మించకుండా ఉండాలన్న రాజ్యాంగ పరిమితిని దృష్టిలో ఉంచుకోవాలి. వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ మించలేము. అటువంటి పరిస్థితిలో బిసిలకు అదనంగా రిజర్వేషన్ ఇవ్వాలంటే, కేంద్ర రాజ్యాంగ సవరణల సహకారం కూడా అవసరమవుతుంది. బిసి రిజర్వేషన్ల అంశం కేవలం అంకెలగారడీ కాదనే విషయాన్ని గుర్తించాలి. ఇది శతాబ్దాల నాటి అసమానతల పరిహారయత్నం. ప్రజాస్వామ్యంలో ప్రాతినిధ్యం కేవలం ఓట్ల మీద ఆధారపడి ఉండకూడదు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నదే రిజర్వేషన్ లక్ష్యం. కానీ ఆ లక్ష్యాన్ని ఆచరణలో అమలు చేయాలంటే, సమగ్ర డేటా, శాస్త్రీయ పద్ధతులు, పారదర్శక విధానాలు, రాజకీయ సంకల్పం అవసరం. కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీ బిసివర్గాల్లో ఆశను కలిగించినా, దానిని కార్యరూపం దాల్చాలంటే రాజకీయ ప్రకటనలకన్నా పైగా చట్టబద్ధ ప్రణాళిక అవసరం. ఒకవేళ ప్రభుత్వం శాస్త్రీయంగా బిసి జనాభా గణాంకాలను సేకరించి, హైకోర్టు, సుప్రీంకోర్టుల మార్గదర్శకాలను అనుసరిస్తూ, అవసరమైతే కేంద్రంతో రాజ్యాంగ సవరణపై చర్చ జరిపితేనే ఈ సమస్యకు సుస్థిర పరిష్కారం కనుగొన గలుగుతుంది. లేదంటే ప్రతి ఎన్నికల నాటికి ఇదే సమస్య రాజకీయం చెంది, బిసిల సామూహిక ఆకాంక్షలు ఒక రాజకీయ నినాదంగా మిగిలిపోతాయన్నది దురదృష్టకరం. బిసి రిజర్వేషన్ల అంశంపై దృష్టి సారించే సమయం ఇది. ఇది కేవలం ఓట్ల కోసం తాత్కాలిక పథకంగా కాక, శాశ్వత సామాజికన్యాయ సాధనగా మారేందుకు పాలకుల చిత్తశుద్ధి అవసరం. ప్రజాస్వామ్యంలో నమ్మకం నిలబెట్టాలంటే, హామీల అమలు తప్పనిసరి. హామీలను కార్యరూపం దాల్చే విధంగా చట్టం, కార్యాచరణ రూపొందించి, సామాజిక న్యాయ సాధనలో సమగ్రమైన నైతికత ప్రధానం. •

# నేల తల్లిని కాపాడుకోవడం ఎలా?

డి. మోహన రావు

దాదాపు 800 కోట్ల మంది ప్రజల ఆకలి తీర్చి, భద్రత కల్పించి, ఆరోగ్యాన్ని కాపాడి, జీవనోపాధిని ప్రసాదించే శక్తి సారవంతమైన నేలలకే ఉంది. మనకు జీవనాధారమైన ఈ నేల తల్లికి ఇప్పుడు ప్రమాదం పొంచి ఉంది. ప్రకృతి వైపరీత్యాలతో పాటు, మన స్వయం కృతాపరాధం వల్ల ఈ నేలల్లో తీవ్ర మార్పులు చోటు చేసుకొని నేలలు ఎడారిగా మారి, కరువులు విలయతాండవం చేసే అవకాశాలున్నాయి. ఎడారీకరణ, కరువులు నేడు మనం ఎదుర్కొంటున్న అతి పెద్ద పర్యావరణ సవాళ్లు. ఐక్యరాజ్యసమితి సమాచారం ప్రకారం, గత దశాబ్దంలో ఎడారీకరణ తీవ్రత 35 రెట్లు పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సెకనుకు సుమారు నాలుగు ఫుట్‌బాల్ మైదానాల విస్తీర్ణంలో సారవంతమైన భూమి క్షీణిస్తోంది. 2040 నాటికి 25శాతం మంది పిల్లలు నీటి కొరతను ఎదుర్కోవాల్సి వస్తుందని, 2050 నాటికి ప్రపంచ జనాభాలో 75 శాతం మంది కరవులకు గురవుతా రని నివేదికలు చెబుతున్నాయి. మన దేశ భూభాగంలో దాదాపు 32శాతం క్షీణించింది, 25శాతం ఎడారీకరణకు గురవుతోంది. 2015 నుండి 2019 మధ్యలో మనదేశంలో 30.51 మిలియన్ హెక్టార్ల నేల క్షీణించింది. 2019 నాటికి 9.45 శాతానికి పెరిగింది. యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ టు కాంబాట్ డెసర్టిఫికేషన్ నివేదిక ప్రకారం, మనదేశ భూభా గంలో 36.8శాతం కరువు ప్రభావిత ప్రాంతంగాఉంది. 85.44 కోట్లు (83.85శాతం) భారత జనాభా కరువు పరిస్థితులకు గురయ్యారని ఈ నివేదిక పేర్కొంది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, ప్రతీ సంవత్సరం 12మిలియన్ హెక్టార్ల విస్తీర్ణం కరవులు, ఎడారీకరణ కారణంగా నష్టపోతోంది. దీనివల్ల నిమిషానికి ఇరవై మిలియన్ టన్నుల ధాన్యం కోల్పోయినట్లే నని అంచనా. రాష్ట్రాల వారీగా చూస్తే, ఆంధ్రప్రదేశ్‌లో 14.35 శాతం, తెలంగాణలో 31.40 శాతం భూములు నిరుపయోగంగా మారాయి. రాజస్థాన్‌లో 21.23 మిలియన్ హెక్టార్లభూమి ఎడారిగా మారింది. అహ్మదాబాద్‌లోనిభారత స్పేస్ అప్లికేషన్ సెంటర్ రూపొందించిన 'ఎడారీకరణ, భూసార క్షీణత అట్లాస్' ప్రకారం దేశంలో భూసార క్షీణత, ఎడారీకరణ సుమారు 97.84 మిలియన్ హెక్టార్లుగా తేలింది. దేశంలోని మొత్తం 29రాష్ట్రాలకు గాను 26 రాష్ట్రాల్లో గత పదేళ్లలో ఎడారి ప్రాంతం గణనీయంగా పెరిగింది. మిజోరాంలో ఎడారీకరణ వేగంగా పెరుగుతోంది. నేల కోత లేదా క్షీణత ముఖ్యంగా వర్షపు తుఫానుల వల్ల సంభవిస్తుంది. వర్షపాతం రిల్ కోత, గల్లీ కోత, షీట్ కోత, స్ప్లాష్ కోత వంటి అనేక రకాల నేల కోతలకు దారితీస్తుంది. మానవ కార్యకలాపాలు మరొక ప్రధాన కారణం. ముఖ్యంగా సహజ వృక్షసంపదను తొలగించడం, సున్నితమైన భూముల్లో నిరంతరం సాగు చేయడం, నీటిని సమర్థవంతంగా వినియోగించుకోకపోవడం,పశువులు పచ్చిక బయళ్లను పూర్తిగా మేసివేయడం వల్ల నేల బహిర్గతమైకోతకు గురవుతుంది. అటవీనిర్మూలన, పట్టణ విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వెలికితీత పరిశ్రమలు, రసాయనిక ఎరువుల అధిక వినియోగం, అక్రమ మైనింగ్, పారిశ్రామిక కాలుష్యం నేలక్షీణతకు దోహదపడుతున్నాయి. 2050నాటికి ప్రపంచ జనాభాలో మూడొంతుల మంది కరవులకు లోనవుతారు. కరువు కారణంగా 2050 నాటికి 21.6కోట్లమంది ప్రజలు వలస వెళ్లవలసి వస్తుంది. ఇది కేవలం నీటికొరత, ఆహార అభద్రతకే దారితీయదు, అనారోగ్యాలతో పాటు పేదరికం, నిరుద్యోగానికి కూడా దారి తీస్తుంది. ఈ ప్రమాదాన్ని గుర్తించి భారతదేశం తనజాతీయ లక్ష్యాన్ని సాధించే దిశగా వేగంగాఅడుగులు వేస్తోంది. 2030 నాటికి భూసారం క్షీణించిన 26మిలియన్ హెక్టార్ల భూమిని పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గుజరాత్‌లోనిబన్నీ ప్రాంతంలోగల 'రాన్ ఆఫ్ కచ్'లో చేపట్టిన భూమి పునరుద్ధరణ విజయవంతమైన ఉదాహరణగా నిలుస్తుంది. సాధారణ అడవులతో పాటు మడఅడవులను కూడా కాపాడాలి. కొత్తగా మొక్కలను పెంచాలి. వర్షపునీరు నదులు, సముద్రాలలో వృధాకాకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు చేపట్టాలి. నీటి వనరులను సంరక్షించాలి. భూసారపరిరక్షణ, జీవ వైవిధ్యం పెంపుతోపాటుగా వ్యవసాయ భూములలో నిర్మాణాలుచేపట్టరాదు. పట్టణాలలో అధిక అంతస్తులగృహాలను నివారించాలి. ఈ సమస్యను మనం తీవ్రంగా పరిగణించాలి. •

# పాఠశాల విద్యావ్యవస్థే జాతీయ సమైక్యతకు పునాది

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దేశంలో మానవజాతిని కలవరపెడుతున్న హింసాత్మక సంఘటనలు అనాలోచిత మూర్ఖపు అనాగరిక దుశ్చర్యలు, మానవీయ సంబంధాల మధ్య పెరిగిపోతున్న అగాధం, మంచులా కరిగిపోతున్న ఆత్మీయతలు, మితిమీరిన హింస ప్రవృత్తి, అంతర్గతంగా దేశభద్రతకు విఘాతం కలిగించే స్వార్థపూరిత దేశద్రోహులు ఇలా చెప్పుకుంటూ పోతుంటే అనేకం. ఇటీవల కాశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాం పర్యాటక ప్రదేశంలో జరిగిన నీచమైన మతోన్మాద ఉగ్రవాదం దేశాన్ని కలవర పెట్టింది. హింసాత్మక సంఘటనకు పాల్పడేపరాయి దేశ ఉగ్రవాదులకు సహకరించేటువంటి స్వదేశీయ దుర్మార్గులు కొందరు స్థానికులై దేశభక్తి, మానవీయ విలువలు కోల్పోయి, ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడం అహేతుకమైన చర్యగా అభివర్ణించవచ్చు. భారతదేశంలో పుట్టి పెరిగి దేశ అభివృద్ధిని కాంక్షించే ఆలోచనలు వీడి పరాయి దేశపు చెప్పుచేతల్లో దేశ రహస్యాలను తీసుకెళుతున్న వ్యక్తులు చదువుకున్నవాళ్లే కావడం శోచనీయం. ఈ క్రమంలో భారత దేశంలో దేశభక్తి జాతీయ సమైక్యత వాదం ఆవశ్యకత ఏమైపోతున్నట్టు అనే సందేహాలు కలగకమానవు. తరం మారుతున్నా భారతజాతి స్వరం ఐక్యతరాగం స్వదేశం మీదఉన్న మమకారం ఎన్నటికీ వీడొద్దనే భావన కలిగిన ఆశావాదులు లేకపోలేదు. నేటి బాలలు రేపటి భారత పౌరులుగా భారత సమాజ నవనిర్మాణానికి పునాదులుగా, మానవతా విలువలను మానవీయ కోణాలను విద్యతోపాటు దేశభక్తిని సమాంతరంగా నేర్పించాల్సిన ఆవశ్యకత ఈ తరం విద్యాబోధకుల మీదనే ఆధారపడి ఉంది అనడంలో అతిశక్తి లేదు. భారత జాతీయ సమైక్యత వాదాన్ని దేశభక్తిని విద్యార్థి దశ నుండే విద్యార్థుల మనసు అంచుల్లోకి చొచ్చుకుపోయేలా సమాజంలో ఆదర్శవంతమైన భావి పౌరులుగా తీర్చిదిద్దడంలో నిపుణులుగా నేర్పులుగా బోధకులే కీలకపాత్ర పోషిస్తారనే వాదనలు బలంగా వినిపిస్తుంటాయి. పాఠశాలల్లో విద్యార్థుల్లో నైతిక విలువలతో కూడిన దేశభక్తి సమైక్యతవాదం లౌకికవాదానికి లోబడి భారత సమాజంలో చట్టాలు సమాజంపై బాధ్యత విలువలను గుర్తించే విధంగా, జీవన విధానాలను విద్యార్థి దశ నుండే అనుసరించే విధంగా ఉపాధ్యాయులు తర్ఫీదూ ఇవ్వడానికి పాఠశాలలు కేంద్ర బిందువుగా ఉండి తీరాల్సిందే. దేశ భవిష్యత్తు భారత నవ నిర్మాణంకు పటిష్టమైన పునాదులుగా నేటి విద్యార్థులను తిరుగులేని భావి పౌరులుగా తీర్చిదిద్దాల్సిందే. అందుకే దేశం పట్ల బాధ్యత కలిగిన వ్యక్తులుగా దేశ భద్రతకు నిబద్ధత కలిగిన దేశభక్తులుగా తయారు చేయడానికి సమైక్యతవాద భావానికి బీజం పడేది పాఠశాల స్థాయిలోనే. కాబట్టి విద్యా వ్యవస్థలు దేశ సమాజ నవనిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తాయనే వాదనలు బలంగా వినిపిస్తుంటాయి. పహల్గాం ఉగ్రవాద దాడి అనంతరం తీగ లాగితే డొంకంతా కదిలినట్లు ఉగ్రముఖలకు సహకరించిన కొందరు వ్యక్తులు స్వదేశంలోని పుట్టి పెరిగిన వారు కావడం గమనార్హం. దేశ ద్రోహానికి పాల్పడుతున్న



ఇలాంటి వారి జాబితా చూస్తే అసహ్యం వేస్తుంది. జాతీయ భద్రతను పణంగా పెట్టి ఉగ్రవాదులకు సహకరిస్తున్న వ్యక్తులు బాల్య దశ నుండి సరైన దిశ నిర్దేశం లేక మానవీయ కోణంలో ఆలోచించే ధోరణి తగ్గిపోవడం, హానికరమైన కనికరం లేని కఠినత్వ మనస్తత్వాలతో కొందరు క్రూరంగామారి దేశభక్తి జాతీయ సమైక్యత వాదాన్ని మరిచి క్షమించరాని దోషులుగా మిగిలిపోతున్నారు. జరిగే నష్టం జరిగిన తర్వాత ఏమి తమకు సంబంధం లేదన్నట్లుగా సమాజంలో చలామణి కావడానికి ప్రయత్నిస్తుండడం క్షమించరాని నేరమేఅవుతుందని విశ్లేషకులలో అభిప్రాయం లేకపోలేదు. తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులు విద్యార్థుల జీవనగమనంలో విద్యతోపాటు భవిష్యత్తు సమాజ నిర్దేశికత ఆలోచన విధానాలను ప్రతిబింబించేలా ప్రేరణగా నిలుస్తారు. ప్రాథమిక పాఠశాల బాల్యదశలో విద్యార్థుల ఆలోచన విధానానికి బీజం పడుతుంది. పరిసరాల్లో జరుగుతున్న విషయాలపై ఆసక్తి ఈ దశలోనే పెరుగుతుంది. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఆవశ్యకత ఉపాధ్యాయులపై ఎంతైనా ఉంటుంది. ఈ దశలోనే విద్యతోపాటు విద్యార్థుల మనసులో మానవతా విలువలు మానవతాకోణంలో ఆలోచన విధానాలు దేశభక్తి జాతీయ సమైక్యత నైతిక విలువలతో కూడిన జీవన విధా నాలపై అవగాహన కల్పించవలసిందే. నేర ప్రవృత్తిని నిరోధించే విధంగా హింసకు తావులేని ఆదర్శవంతమైన జీవన విధానాలను జీవనగమ్యాన్ని నేర్పించాల్సిన బాధ్యత బోధకులపై ఉంటుందన్న భిన్న వాదన లేకపోలేదు. విద్యావ్యవస్థలో నేర్చుకున్నటువంటి సభ్యత సంస్కారం సరైన భావనతో ఉండే ఆలోచనలకు ఆస్కారం ఉంటుంది. సమాజంలో సరైన దిశా నిర్దేశం లేక కొన్నిసార్లు అనాలోచిత నిర్ణయాలతో కొందరు ప్రభావితం అవుతుంటారనే భిన్నవాదనలు సమాజంలో లేకపోలేదు. ఇలాంటి ధోరణి అరికట్టడానికి కేంద్ర బిందువుగా పాఠశాల విద్యావ్యవస్థ ప్రత్యేకత సంతరించుకోవాలి. విద్యావ్యవస్థలో నాణ్యమైన విద్యతోపాటు మానవీయ కోణంలో విలువైన జీవన విధానాలను విద్యార్థుల మనసులో నింపవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. బాల్యంనుండి మంచి దేశ పౌరులుగా తయారు చేయడానికి వీలైతే ఉపాధ్యాయులు పోలీసు వ్యవస్థలు సమన్వయంగా, పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన జీవన విధానాలను ప్రతిబింబించేలా పూర్తిస్థాయిలో మనసులో పదిలపరిచే సన్నివేశాలతో తరచుగా సమావేశాల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేసుకుంటూపోతే, దేశ భావిభారత పౌరులుగా హింసకు తావులేని ఆదర్శవంతమైన జీవన ప్రమాణాలు కలిగిన ఆలోచన ధోరణి ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులు అందుకోడానికి ఆస్కారం ఉంటుందేమో. మంచి ఆదర్శవంతమైన వ్యక్తిత్వానికి పదునుపెట్టే విధంగా పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించే విధానానికి ఉపాధ్యాయులు ప్రేరణగా నిలుస్తారనే భావన సమాజంలో దృఢంగా వినిపిస్తుంటుంది. బోధకులు విద్యార్థుల్లో బాల్య దశనుండే నేర ప్రవృత్తి కలిగిన ఆలోచనలను పూర్తిగా తొలగించేందుకు ప్రయత్నించాలి. అవసరమైతే విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి వాటి అనర్థాలను తెలియజేయాలి. అందుకు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు సరైన దిశ నిర్దేశాన్ని విద్యార్థులకు చేయాలి. ఏదేమైనప్పటికీ ఉపాధ్యాయులు విషయ బోధనతో సమాంతరంగా విద్యార్థులకు పటిష్టమైన దేశభక్తి దేశ సమగ్రత జాతీయ సమైక్యత భావనలపై తిరుగులేని మనస్తత్వం విద్యార్థులకు కలిగించేలా, నేర ప్రవృత్తి చెడల వాట్లకు బానిసలు కాకుండా సమగ్రమైన జీవన విధానాన్ని కొనసాగించడానికి విద్యార్థులకు మంచి సంధానకర్తలుగా వ్యవహరిస్తూ, సమాజంలో బాధ్యతగల భారతదేశ బావి పౌరులుగా తీర్చిదిద్దడానికి కేంద్ర బిందువుగా ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారు అనడంలో సంశయం లేదు. •

# ఎవరి మధ్యవర్తిత్వం అక్కర్లేదు..



## అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు స్పష్టంచేసిన ప్రధాని మోడీ

### జి-7 సదస్సు నేపథ్యంలో ఫోన్‌లో మాట్లాడుకున్న ఇరువురు నేతలు

**న్యూఢిల్లీ, జూన్ 18:** జమ్మూ కాశ్మీర్ అంశంపై పాకిస్థాన్‌తో జరిపే చర్చల్లో మూడో పక్షం మధ్యవర్తిత్వం అవసరం లేదని.. అలా జరగాలని తాము కోరుకోవడం లేదని భారత్ కుండ బద్దలుకొట్టింది. ఈ విషయాన్ని యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ప్రధాని నరేంద్రమోడీ స్పష్టం చేశారు. ఈ మేరకు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బుధవారం న్యూఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జి-7 సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోడీ కెనడా వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా యుఎస్ అధ్యక్షుడు ట్రంప్‌నకు జమ్మూ కాశ్మీర్ అంశంపై ఫోన్ ద్వారా ప్రధాని మోడీ స్పష్టం చేశారని ఆయన వివరించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని తొలుత తెరపైకి పాకిస్థాన్ తీసుకువచ్చిందని ట్రంప్‌నకు ప్రధాని మోడీ గుర్తు చేశారు. మంగళవారం రాత్రి ప్రధాని మోడీతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారని చెప్పారు.

ఆ క్రమంలో ఆపరేషన్ సిందూర్‌పై ట్రంప్ వివరాలు అడిగినప్పుడు.. అందుకు సంబంధించిన అంశాలను ఆయనకు ప్రధాని మోడీ సోదాహరణగా వివరించారని పేర్కొన్నారు. ఆ క్రమంలో జమ్మూకాశ్మీర్ విషయంలో మూడో పక్షం, మధ్యవర్తిత్వాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని ట్రంప్‌నకు మోడీ స్పష్టం చేశారన్నారు. తద్వారా భారత్, పాకిస్థాన్‌మధ్య పలు దఫాలుగా చర్చలుజరిపి.. ఇరుదేశాలమధ్య యుద్ధాన్ని తానే నిలువరించానంటూ ట్రంప్ చేస్తున్న ప్రకటనలకు ప్రధాని మోడీ బలమైన సమాధానం ఇచ్చినట్లు అయిందని విక్రమ్ మిస్రీ వివరించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రధాని మోడీ తొలిసారి జాతిని ఉద్దేశించి మాట్లాడుతూ.. పాకిస్థాన్‌తో చర్చలు జరిపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను నాశనంచేసి.. ఆ ప్రాంతాన్ని భారత్‌కు తిరిగి ఇవ్వాలని ఆయన స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 22వ తేదీ జమ్మూ కాశ్మీర్ అనంతనాగ్ జిల్లాలోని పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు మరణించారు. ఈ ఘటనకు తామే బాధ్యులమంటూ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌పై భారత్ తీవ్ర ఆంక్షలు విధించింది. అదే తరహాలో పాకిస్థాన్ సైతం భారత్‌కు వ్యతిరేకంగా కీలకనిర్ణయాలు తీసుకుంది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ క్రమంలో పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను ఆపరేషన్ సిందూర్‌పేరిట భారత్‌సైన్యం దాడులు నిర్వహించి.. ధ్వంసం చేసింది. ఈ దాడుల్లో 100 మందికిపైగా ఉగ్రవాదులు మరణించారు. తర్వాత పాక్‌సైతం భారత్ భూభాగంలోకి క్షిపణులు, డ్రోన్లతో దాడులకు దిగింది. వీటిని భారత్ అడ్డుకున్న సంగతి తెలిసిందే.



# స్కూళ్లలో హిందీ తప్పనిసరి కాదు

## మహారాష్ట్ర సర్కారు వెనకడుగు

**ముంబై, జూన్ 18:** ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి చదివే పిల్లలందరికీ హిందీ విధిగా బోధించాలని ఇటీవల మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. తప్పనిసరి అనే పదాన్ని నోటిఫికేషన్ నుంచి తొలగించింది. ప్రభుత్వ నిర్ణయంపై వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

బుధవారం మహారాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. అందులో 'తప్పనిసరి' అనే పదాన్ని తొలగించింది. హిందీకి బదులు మరో భాషను ఎంచుకునే అవకాశం విద్యార్థులకు కల్పించింది. అయితే, ఆ భాష నేర్చుకోవాలనే తరగతిలో కనీసం 20 మంది విద్యార్థులు తప్పనిసరిగా ఉండాలని పేర్కొంది. అప్పుడే ఆ సబ్జెక్టు పాఠశాలలో అందుబాటులో ఉంటుందని స్పష్టం చేసింది. ఆ భాషకు సంబంధించిన ఉపాధ్యాయుడి నియామకం కుదరకపోతే ఆన్‌లైన్ ద్వారా తరగతులు జరుగుతాయని వెల్లడించింది.

జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి)లో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. ఈ విధానాన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ద్విభాషా సూత్రానికి కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డిఎంకె స్పష్టం చేసింది.

ఈ క్రమంలోనే హిందీని తప్పనిసరి చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీనిపై 'మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన' (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్‌ఠాక్రేతోపాటు ఉద్ధవ్‌ఠాక్రే నుంచి కూడా తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలో దీనిపై పోరాడేందుకు ఠాక్రేలు ఏకం కానున్నారనే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

# డ్రగ్స్ విక్రయిస్తున్న 8 మంది అరెస్టు

**హైదరాబాద్ జూన్ 18 ప్రభాతవార్త:** బెంగూళూరు నుంచి తక్కువ ధరలకు డ్రగ్స్ తీసుక రావడం ఎక్కువ ధరలకు ఎండిఎంఎ డ్రగ్స్‌ను అమ్మకాలు జరుపుతున్న ముఠా సభ్యులతోపాటు కొనుగోలు దారులను ఎస్‌టిఎఫ్‌బి టీమ్ సిబ్బంది పట్టుకున్నారు. వరాల దీక్షిత్, కొండబోయిన వరణ్ తేజ్ ఇద్దరు కలిసి బెంగూళూరు నుంచి తక్కువ ధరలకు ఎండిఎంఐ డ్రగ్స్‌ను తీసుకు వచ్చి, ఎక్కువ ధరలకు అమ్మకాలు జరుపుతుండగా ఎస్‌టిఎఫ్‌బి టీం సిఐ భిక్షా రెడ్డి, ఎస్ఐ బాలరాజు, సంధ్య సిబ్బంది కలిసి 6.34 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్‌ను పట్టుకున్నారు. డ్రగ్స్‌ను కొనుగోలు చేయడానికి వచ్చిన భాషాపాగ ప్రవీణ్‌రాజ్, ఎండి అస్లామ్ హుస్సెన్, సంగ ప్రేమ్ సాయిలు కొనుగోలు సమయంలో పట్టుకున్నారు.వీరి వద్ద ఉన్న రెండు బైక్‌లను, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న డ్రగ్స్‌ను, నిందితులను అమీర్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

**1.248 కేజీల గంజాయి పట్టివేత**

ధూల్‌పేట్ బలరామ్ గల్లీలో గంజాయి అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారం మేరనకు ఎస్‌టి ఎఫ్ఎ టీమ్ సిబ్బంది 1.248 కేజీల గంజా యిని పట్టుకున్నారు.ధూల్‌పేట్‌కు చెందిన నలుగురుపై కేసు నమోదు చేసినట్లు టీమ్ నంద్యాల అంజి రెడ్డి తెలిపారు. దుర్గేష్ సింగ్, గూలాబ్‌సింగ్, కాళీబాయిలను అరెస్టు చేశారు. రాజుసింగ్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

# ట్రంప్‌తో ఏం మాట్లాడారో మోడీ అఖిలపక్షానికి చెప్పాలి

## కాంగ్రెస్ ఎంపి జైరాం రమేష్



**న్యూఢిల్లీ, జూన్ 18:** అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఏం మాట్లాడారో ప్రధానమంత్రి నరేంద్రమోడీ వివరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. మూడు దేశాల పర్యటలన ముగించుకుని తిరిగి రాగానే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యలు చేశారు. 'పాకిస్థాన్ సైనికాధిపతి అసిమ్ మునీర్‌కు ట్రంప్ ఆతిథ్యం ఇవ్వడం భారత్ దౌత్య వ్యూహానికి పెద్ద దెబ్బ. పహల్గాం దాడికి ముందు రెచ్చగొట్టేలా ప్రకటనలు చేసిన మునీర్‌కు ట్రంప్ ఆతిథ్యంపై భారత్ అసంతృప్తిని టెలిఫోన్ సంభాషణలో మోడీ చెప్పి ఉండాల్సింది. కార్గిల్ యుద్ధం తర్వాత రివ్యూ కమిటీ ఏర్పాటు చేసినట్లే పహల్గాంపై కూడా రివ్యూ కమిటీ ఏర్పాటు చేయాలి. అప్పట్లో కార్గిల్ యుద్ధం ముగిశాక ఏర్పాటు చేసిన రివ్యూ కమిటీకి ప్రస్తుత విదేశాంగ మంత్రి జైశంకర్ తండ్రి కె.సుబ్రమణ్యమ్ నేతృత్వం వహించారు. వాణిజ్య ఒప్పందం పేరుతో భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చినట్లు అమెరికా అధ్యక్షుడు చేస్తున్న వ్యాఖ్యలను పార్లమెంట్‌లో ఖండించాలి' అని రమేశ్ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

'ట్రంప్‌తో పాక్ సైన్యాధిపతి మునీర్ భోజనం చేయడం, అమెరికా పాకిస్థాన్‌ను భాగస్వామిగా పేర్కొనడం భారత్‌కు ఎదురుదెబ్బ. అలాగే కాల్పుల విరమణ కోసం ట్రంప్ మధ్యవర్తిత్వం వహించడంపై మే 10 నుంచి ప్రధాని మోడీ ఎందుకు మాట్లాడలేదు. ట్రంప్ 14సార్లు చేసిన కామెంట్స్‌పై ప్రధాని మోడీకి మౌనం వీడటానికి 37 రోజులు పట్టింది. ప్రధాని మోడీ తిరిగి వచ్చిన వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి ట్రంప్‌తో 35 నిమిషాలు మాట్లాడిన విషయాలు అన్ని వివరించాలి. అలాగే ట్రంప్‌తో మోడీ చర్చించిన అన్ని విషయాలను చెప్పడానికి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహించాలని మేం డిమాండ్ చేస్తున్నాం' అని జైరామ్ రమేశ్ అన్నారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోడీ ఫోన్ కాల్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్, పాక్ మధ్య ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదని ట్రంప్‌నకు స్పష్టం చేశారు. ఇప్పటివరకు మధ్యవర్తిత్వాన్ని అనుమతించలేదని, ఇక ముందు కూడా అలా జరగదని చెప్పారు. మరోవైపు ట్రంప్‌ను భారత్‌కు రావాలని మోడీ ఆహ్వానించారు. ఈ విషయాన్ని కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు.



# అమర్‌నాథ్ యాత్రకు లైన్‌క్లియర్..

## యాత్రికుల భద్రతకు 'ఆపరేషన్ శివ'

### జూలై 1 నుంచి ఆగస్టు 10 వరకు 'నో ఫ్లయింగ్ జోన్'

### 50 వేల మంది బలగాలతో భారీ భద్రత

**శ్రీనగర్, జూన్ 18:** పవిత్ర అమర్‌నాథ్ యాత్రకు హాజరయ్యే యాత్రికుల భద్రత దృష్ట్యా జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అమర్‌నాథ్ పుణ్యక్షేత్రానికి వెళ్లే అన్ని మార్గాలను జూలై 1 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు 'నో ఫ్లయింగ్ జోన్'గా ప్రకటిస్తూ కేంద్ర పాలిత ప్రాంత హోం శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ కాలంలో డ్రోన్లు, బెలూన్లు, ఇతర విమానయాన సాధనాల వినియోగంపై పూర్తి నిషేధం విధించింది. ఈ యేడాది అమర్‌నాథ్ యాత్ర జూలై 3న ప్రారంభమై ఆగస్టు 8న ముగియనుంది. భద్రతాపరంగా అత్యంత సున్నితమైన ఈ యాత్ర నేపథ్యంలో ఇంటెలిజెన్స్ ఏజెన్సీల నుంచి తీవ్రవాద ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికలు అందాయి. ముఖ్యంగా ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ మైదానంలో జరిగిన ఉగ్రదాడి, మే నెలలో భారత్-పాకిస్థాన్ మధ్య తలెత్తిన నాలుగు రోజుల సాయుధ ఘర్షణ తర్వాత ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. యాత్రికుల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు భద్రతా దళాలు 'ఆపరేషన్ శివ'ను ప్రారంభించాయి. పహల్గాం, బర్తాల్ మార్గాల్లో యాత్రికులకు రక్షణ కల్పించడమే ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా సుమారు 50,000మంది పారామిలిటరీ సిబ్బంది, జమ్మూ కాశ్మీర్ పోలీసులతో కలిసి యాత్ర మార్గాల్లో ప్రతిరోజూ రోడ్ ఓపెనింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తారు. మార్గమధ్యంలో పేలుడు పదార్థాలు, ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌లు (ఐఇడిలు) ఏమైనా ఉంటే గుర్తించి నిర్వీర్యం చేస్తారు.

ఈ యేడాది తొలిసారిగా యాత్రికుల కాన్వాయ్ కదలికల సమయంలో రక్షణగా జామర్లను కూడా మోహరించనున్నారు. ఇప్పటికే భద్రతా దళాలు నిర్దేశిత యాత్రా మార్గాలను తమ అధీనంలోకి తీసుకున్నాయి. కేంద్రపాలిత ప్రాంతం అంతటా అదనపు బలగాలను కూడా మోహరించారు. బహుళ అంచెల భద్రతా వ్యూహం, జామర్లు, మానవరహిత విమానాలపై ఆంక్షలు వంటి సాంకేతిక చర్యలతో ప్రతి యేటా హిమాలయ పుణ్యక్షేత్రానికి తరలివచ్చే వేలాది మంది యాత్రికుల భద్రత మరింత పటిష్టమవు తుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# అహ్మదాబాద్ మృతదేహాలు 163 గుర్తింపు

**అహ్మదాబాద్, జూన్ 18:** ఎయిరిండియా బోయింగ్ విమానానికి అహ్మదాబాద్‌లో ప్రమాదం వాటిల్లిన అయిదురోజుల తర్వాత 163 మృతదేహాల గుర్తింపు ప్రక్రియ పూర్తయింది. దీనికోసం డిఎన్ఎ పరీక్షలపై ఆధారపడిన విషయం తెలిసిందే. 124 భౌతిక కాయాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. విమానంలో ఉన్న 242 మందిలో ఒక్కరు మినహా అందరూ, బయట మరో 29 మంది ఈ ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నెల 12న బిజె వైద్య కళాశాల హాస్టల్ భవనంపై విమానం కుప్పకూలి, మంటలు చెలరేగడంతో అందులోని విద్యార్థులు భయాందోళనకు గురికావడంపై మరో వీడియోలో వెలుగులోకి వచ్చింది. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు విద్యార్థులు రెండు, మూడు అంతస్తుల్లోని బాల్కనీల నుంచి బెడ్‌షీట్లు, తాళ్లసాయంతో కిందకి దూకడం అందులో కనిపించింది. భవనానికి ఒకవైపు భారీగా మంటలు చెలరేగగా మరోవైపు నుంచి వీరు కిందకి దూకుతున్నట్లు వీడియోలో ఉంది. ప్రమాద బాధితులకు అవసరమైన న్యాయ సాయం అందించడానికి గుజరాత్ రాష్ట్ర న్యాయ సేవల సంస్థ ముందుకు వచ్చింది. మానసిక చికిత్స అవసరమైనా తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపింది. సభర్వాల్ సేవల్ని గుర్తుచేసుకున్న సహచరులు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఎయిరిండియా పైలట్ సుమీత్ సభర్వాల్‌కు ముంబయిలో అంత్యక్రియలు నిర్వహించారు. 35 ఏళ్లుగా పనిచేస్తూ ఎంతోమందిని ఆయన తీర్చిదిద్దారని సహచరులు చెమర్చిన కళ్లతో గుర్తు చేసుకున్నారు.

మృతిచెందిన సిబ్బందిలో మరికొందరి అంత్యక్రియలు కూడా పూర్తయ్యాయి. ప్రమాదంపై విచారణ చేపట్టిన బృందం మూడు నెలల్లో నివేదిక సమర్పించనుందని పౌరవిమానయాన శాఖ సహాయమంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. ఎయిరిండియా వద్దనున్న 34 బోయింగ్ - 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో 12 వాటికి తనిఖీలు పూర్తయ్యాయని, వాటిలో ఎలాంటి లోపాలు బయటపడలేదని పుణెలో విలేకరుల సమావేశంలో తెలిపారు.

# ఆ నాలుగు సబ్ వేరియంట్లవల్లే కరోనా వ్యాప్తి

**పుణే, జూన్ 18:** దేశవ్యాప్తంగా ఇటీవల మళ్లీ కరోనా వైరస్ కేసులు పెరుగుతున్న విషయం తెలిసిందే. తాజా పెరుగుదలకు ఒమిక్రాన్‌కు చెందిన నాలుగు ఉపరకాలే కారణమని పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవి) వెల్లడించింది. జీనోమ్ సీక్వెన్సింగ్‌లో ఈ కొత్త ఉపరకాలను గుర్తించినట్లు పేర్కొంది. వ్యాక్సిన్ సామర్థ్యాలను అంచనా వేయడంలో తాజా ఫలితాలు దోహదం చేస్తాయని తెలిపింది. 'దేశవ్యాప్తంగా నమోదవుతున్న కేసుల నమూనాలకు జన్యుపదార్థ విశ్లేషణ నిర్వహించగా ఒమిక్రాన్‌కు సంబంధించి నాలుగు ఉప రకాలు వెలుగు చూశాయి. ఎల్ఎఫ్ 7, ఎక్స్ఎఫ్‌జి, జెఎన్ 1.16, ఎన్‌బి 1.8.1 వేరియంట్లుగా గుర్తించాం. తొలుత జెఎన్ 1.16 కారణంగా కేసులు పెరిగినప్పటికీ.. మే నుంచి ఎక్స్ఎఫ్‌జి వేరియంట్ ప్రభావం ఎక్కువగా ఉంది. ఎల్ఎఫ్ 7, ఎల్‌పి 81.2లు కలిసి ఎక్స్ఎఫ్‌జిగా రూపాంతరం చెందాయి' అని ఎన్ఐవి పుణే డైరెక్టర్ డాక్టర్ నవీన్‌కుమార్ వెల్లడించారు. కొత్త వేరియంట్లను ఎప్పటికప్పుడు వేరుచేస్తూ జీనోమ్ సీక్వెన్సింగ్ చేపడుతున్నామని చెప్పారు. ఏప్రిల్ రెండోవారం నుంచి దేశంలో కరోనా వైరస్ కేసులు వెలుగు చూడడం మొదలైంది. కేంద్ర ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 6,486 కొవిడ్ -19 క్రియాశీల కేసులు ఉన్నాయి. జనవరి 1 నుంచి ఇప్పటివరకు 113మంది ప్రాణాలుకోల్పోయారు.

# సోదరుడి అంత్యక్రియల్లో పాల్గొన్న రమేష్ విశ్వాస్!



**అహ్మదాబాద్, జూన్18:** అహ్మదాబాద్ ఘోర విమాన ప్రమాదం ఘటనలో మృత్యుంజయుడిగా నిలిచిన ఏకైక వ్యక్తి రమేశ్ విశ్వాస్ కుమార్ స్వల్పగాయాలతో ఆసుపత్రిలో చేరిన అతడు డిశ్చార్జ్ అయ్యాడు. ఆ వెంటనే అతడు తన సోదరుడి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. ఈ దృశ్యం నెట్టింట ఎమోషనల్‌గా మారింది. ఇదే విమానంలో అతడితో పాటు ప్రయాణించిన అతడి సోదరుడు అజయ్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. విశ్వాస్ కుమార్ మంగళవారంరాత్రి ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు. డిఎన్ఎ పరీక్షలు పూర్తయిన తరువాత అతడి సోదరుడి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అధికారులు అందించారు. యుకె నుంచి ఇప్పటికే అతడి బంధువులు ఇక్కడికి చేరుకున్నారు. డయ్యూకు చెందిన విశ్వాస్, అజయ్ తమ కుటుంబసభ్యులతో గడిపిన అనంతరం లండన్‌కు వెళుతుండగా ఈ విమాన ప్రమాదం చోటుచేసుకుంది. బుధవారం డయ్యూలో అజయ్ అంత్యక్రియలు నిర్వహించారు. అతడు సోదరుడి పాడె మోస్తున్న వీడియోలు పలువురిని కంటతడి పెట్టించాయి. ఈ విమాన ప్రమాదంలో బతికి బయటపడ్డ రమేష్ విశ్వాస్‌ను ఆసుపత్రిలో ప్రధాని మోడీ పరామర్శించిన విషయం తెలిసిందే.





# పాకిస్థాన్‌లో బాంబు పేలుడు

## పట్టాలు తప్పిన జాఫర్ ఎక్స్‌ప్రెస్

**ఇస్లామాబాద్, జూన్ 18:** పాకిస్థాన్‌లో రైల్వే ట్రాక్‌పై బాంబు పేలుడు సంభవించింది. దీంతో అటుగా వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. స్థానిక మీడియా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. బుధవారం సింధ్ ప్రావిన్స్‌లోని జకోబాబాద్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. దీని కారణంగా మూడు అడుగుల గుంత పడిందని పోలీసులు తెలిపారు. రైలు మార్గంలో ఐఇడి బాంబు అమర్చడం వల్ల పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది. పేలుడు నేపథ్యంలో క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌లోని ఆరు బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదానికి సంబంధించిన మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

కాగా.. ఇదే రైలు మార్చిలో హైజాక్‌కు గురైన సంగతి తెలిసిందే. పాక్‌లోని వేర్పాటువాద బలోచ్ మిలిటెంట్లు ఈ రైలును హైజాక్ చేశారు. అందులోని వందలాది మందిని బందీలుగా తీసుకొన్నారు. ఈ క్రమంలో వారిని రక్షించడానికి వెళ్లిన పాక్ భద్రతాధికారిని కూడా హతమార్చారు. ఆ తర్వాత పాక్ అధికారులు ఆపరేషన్ చేపట్టి బందీలను విడిపించారు.

# భారత్ వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర మళ్లీ వాయిదా!



**న్యూఢిల్లీ, జూన్18:** భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర మరోసారి వాయిదా పడింది. జూన్ 19న రోదసి యాత్ర ఉంటుందని తొలుత ఇస్రో తెలిపినప్పటికీ అది 22కు వాయిదా పడింది. ఇప్పటికే సాంకేతిక కారణాలతో యాక్సియం-4 ప్రయోగం పలుమార్లు వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈ మిషన్ కోసం ఉపయోగిస్తున్న ఫాల్కన్ - 9 రాకెట్‌లో ద్రవ ఆక్సిజన్ లీక్ అవుతున్నట్లు అధికారులు గుర్తించడంతో ఈ నెల 11న జరగాల్సిన ప్రయోగాన్ని వాయిదా వేశారు. ఆ సమస్య పరిష్కారమైనట్లు తెలిపిన ఇస్రో 19న రోదసి యాత్ర ఉంటుందని వెల్లడించింది. అయితే తాజాగా మరోసారి వాయిదా పడినట్లు ఇస్రో తెలిపింది. ప్రయోగ తేదీపై ఇస్రో బృందం యాక్సియం స్పేస్‌తో సుదీర్ఘ చర్చలు జరిపింది. ప్రయోగ సంసిద్ధతపై నాసా, స్పేస్ ఎక్స్‌తో యాక్సియం స్పేస్ సంప్రదింపులు జరిపింది. ఇటీవల చేపట్టిన మరమ్మతులు, వాతావరణ పరిస్థితులు, సిబ్బంది ఆరోగ్యపరిస్థితిని పరిగణనలోకి తీసుకుని జూన్22ను తదుపరి ప్రయోగ తేదీగా యాక్సియం స్పేస్ వెల్లడించింది అని ఇస్రో తెలిపింది. యాక్సియం - 4 కింద మరో ముగ్గురు ఆస్ట్రోనాట్లతో కలిసి శుభాంశు రోదసియాత్ర చేపట్టనున్నారు. అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ యాక్సియం స్పేస్ ఈ మిషన్‌ను నిర్వహిస్తోంది. ఇస్రో, అమెరికా అంతరిక్ష సంస్థ, ఐరోపా అంతరిక్ష సంస్థలు ఇందులో భాగస్వామ్యం వహిస్తున్నాయి. ఈ స్పేస్ కాప్సూల్‌ను ఫాల్కన్ -9 రాకెట్ నింగిలోకి మోసుకెళుతోంది. ఇందులో శుభాంశు మిషన్ పైలట్ బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ ప్రయోగం తొలుత మే 29న జరగాల్సి ఉంది.

అయితే వాతావరణం అనుకూలించకపోవడం, సాంకేతిక సమస్య తలెత్తడం వంటి కారణాలతో పలుమార్లు వాయిదా పడుతోంది. ఇక, భూమి నుంచి బయల్దేరిన 28 గంటల తర్వాత ఈ వ్యోమనౌక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానమవుతుంది. శుభాంశు బృందం అక్కడే 14 రోజుల పాటు ఉంటుంది. భారరహిత స్థితిలో పలు ప్రయోగాలు నిర్వహించడంతో పాటు ప్రధాని మోడీ, పాఠశాల విద్యార్థులు ఇతరులతో ముచ్చటిస్తారు.

# బీహార్‌లో పిడుగుల బీభత్సం 14 మంది మృతి

**పాట్నా, జూన్ 18:** బీహార్‌లో వరుసగా పిడుగులు పడటం అక్కడి ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన పిడుగులు భయపెడుతున్నాయి. గత 24గంటల్లో 6 జిల్లాల్లో 14 మంది పిడుగుల కారణంగా మరణించినట్లు బీహార్ సిఎం నితీశ్‌కుమార్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 4 లక్షల పరిహారం ప్రకటించారు. బక్సర్‌లో నలుగురు, వెస్ట్ చంపారన్‌లో ముగ్గురు, కటహర్‌లో ఇద్దరు, కైమూర్‌లో ఒకరు, లక్ష్మీసరాయ్‌లో ఇద్దరు, సీతామర్హిలో ఒకరు పిడుగులు కారణంగా మరణించారు. మృతుల కుటుంబాలకు సిఎం సానుభూత తెలిపారు.

# జమ్మూకాశ్మీర్‌లో తిరిగి ప్రారంభమైన పర్యాటకం!

**శ్రీనగర్, జూన్18:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత జమ్మూకాశ్మీర్‌లో మూతబడిన పలు పర్యాటక ప్రదేశాలు, ఉద్యానవనాల్లో తిరిగి కోలాహలం నెలకొంది. పర్యాటకులు, స్థానికులు వీటిని సందర్శించి ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్‌లో మొత్తం 16 పార్కులను తిరిగి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ఉద్యాన వనాలను సంరక్షించేందుకు, భద్రతను పెంపొందించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. మొదటి విడతలో పహల్గాంలోని బేతాబ్ లోయ సహా ఎనిమిది పార్కులు, రెండో విడతగా జమ్మూలోని ఎనిమిది ఉద్యానవనాలను తిరిగి ప్రారంభించినట్లు చెప్పారు.





బుధవారం సచివాలయంల కార్మిక, మైనింగ్, ఉపాధి, కర్మాగారాలు, భూగర్భ శాఖల మంత్రిగా బాధ్యతల స్వీకరిస్తున్న వివేక్ వెంకటస్వామి

# ఇసుక మాఫియాపై ఉక్కుపాదం

## మంత్రి వివేక్ వెంకట స్వామి

**హైదరాబాద్, జూన్ 18 ప్రభాతవార్త:** ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపనున్నట్లు మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. చెన్నూరులో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్ట వేశామని, దానినే రాష్ట్ర మంతా వర్తింపజేస్తామని చెప్పారు. బుధవారం సచివాలయంలో కార్మిక, మైనింగ్, ఉపాధి, కర్మాగారాలు, భూగర్భశాఖల మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రాష్ట్రంలో రూ.2,600 కోట్లతో ఏర్పాటు చేయబోయే 46 ఏటిసి(అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్స్)లపై తొలి సంతకం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇసుక మాఫియా కారణంగా రాష్ట్ర ఆదాయానికి గండిపడుతుందని, అదే సమయంలో ప్రజలకు ఎక్కువ రేటుకు ఇసుక లభిస్తుందని తెలిపారు. దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేస్తామని, రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాన్ని పెంచడంతోపాటు ప్రజలకు తక్కువ ధరకు ఇసుక అందేలా చూస్తామని అన్నారు. రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు గిగ్ వర్కర్లతో భేటీ అయ్యారని, వారి సంక్షేమం కోసం కొత్త పాలసీని తెస్తామని మాట ఇచ్చారని, దానిని నెరవేరుస్తామని అన్నారు. ఇందుకోసం నిపుణులతో సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. కార్మిక లోకానికి కాకా ఎన్నో సేవలు చేశారని, ఆయన బాటలోనే కార్మికులసంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తామనితెలిపారు. కార్మికులకు సేవచేసే అవకాశం రావడాన్ని అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు.

**చాంబర్లో మంత్రి పూజలు:** మంత్రి వివేక్ దంపతులు సచివాలయానికి చేరుకొని తన చాంబర్‌లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య చెన్నూరు నియోజకవర్గానికి చెందిన ముఖ్యనేతలు, కార్యకర్తలు వివేక్ వెంకటస్వామిని అభినందించారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బుధవారంగాంధీభవన్‌లో ప్రజల నుంచివిన్నపాలను స్వీకరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

# ప్రతి విన్నపానికి పరిష్కారం చూపండి

## వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూన్ 18,ప్రభాతవార్త:** ప్రతి విన్నపానికి పరిష్కారం చూపేందుకు అధికారులు చొరవ చూపాలని ఒక వేళ ఏదైనా జటిలమైన సమస్య ఉంటే అది ఎందుకు పరిష్కరించబడదో కూడా వివరించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అధికారులను ఆదేశించారు. గాంధీభవన్‌లో బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు మంత్రుల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజా వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్లు సహా పలువురు ఉన్నతాధికారులతో మాట్లాడి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేలా సూచనలు ఇచ్చారు. తుమ్మల ఈ సందర్భంగా మాట్లాడుతూ దీర్ఘకాలంగా నడుస్తున్న సమస్యలు త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజలనుండి సుమారు 50కి పైగా వినతిపత్రాలు అందాయని తెలిపారు. అందిన వినతుల్లో మెజారిటీ పేద ప్రజల నుంచే రావడం జరిగిందని అన్నారు. గాంధీ భవన్‌కు వచ్చే ప్రతి వినతిని శ్రద్ధగా పరిశీలించి సాధ్యమైన మేరలో పరిష్కరించాలని ఆదేశాలు ఆయన ఇచ్చారు.

# జంపన్నవాగు అభివృద్ధికి రూ. 5కోట్లు

## ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సీతక్క

**హైదరాబాద్ జూన్ 18 ప్రభాతవార్త:** మంత్రి సీతక్క విజ్ఞప్తి మేరకు ములుగు జిల్లా జంపన్న వాగు రివర్ ఫ్రంట్ అభివృద్ధికి బుధవారం ప్రభుత్వం రూ. 5కోట్లు మంజూరు చేసింది. మేడారం సమక్క-సారలమ్మ జాతరలో జంపన్న వాగుకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ప్రతి రోజూ వేలాది పర్యాటకుల పవిత్ర స్నానాలు చేస్తారు. ఈ నేపథ్యంలో జంపన్నవాగు అభివృద్ధికి రూ. 5కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వానికి మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు.

# మంచినీటి సమస్య ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1916

**హైదరాబాద్, జూన్ 18 ప్రభాతవార్త:** మిషన్ భగీరథ శాఖలో ప్రజల గ్రామీణ తాగునీటి సమస్య ఫిర్యాదులను పరిష్కరించడానికి 18005994007 (11అంకెల) టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంది. మిషన్ భగీరథ ఈ టోల్ ఫ్రీ నంబర్ సేవలు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఉపయోగించుకుంటున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు, పైన చూపిన 11అంకెల టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయడంలో ఇబ్బందిని ఎదుర్కొవడంతో, మిషన్ భగీరథ విభాగం గ్రామీణ ప్రజల తాగునీటి సమస్య ఫిర్యాదులను నమోదు చేసుకునేందుకు ప్రస్తుతం ఉన్న 18005994007 (11అంకెల) టోల్ ఫ్రీ నంబర్ కు బదులుగా 4 అంకెల 1916 (4అంకెల) నంబర్ తో ఫిర్యాదులను నమోదు చేసుకునే సౌకర్యం అధికారులు కల్పించారు.

ఈ నాలుగు అంకెల 1916 (4అంకెల) టోల్ ఫ్రీ నంబర్ తో ప్రజలు రాష్ట్రం లో ఎక్కడి నుండైనా తమ తాగునీటి సమస్య ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చు.

# సిఎం రేవంత్, టిపిసిసి చీఫ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

**హైదరాబాద్,జూన్ 18,ప్రభాతవార్త:** విద్యార్థుల పుస్తకాల ధరలు తగ్గించి, ఇంటిగ్రేడ్ రెసిడెన్షియల్‌తో నాణ్యత కలిగిన విద్యాబోధన చేపడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో మానవ వనరుల అభివృద్ధికి కృషిచేస్తున్నారని ఎన్ఎస్‌యుఐ హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం గాంధీభవన్‌లో ముఖ్యమంత్రి ఫోటోకు క్షీరాభిషేకం చేసింది. ఎన్ఎస్‌యు ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో సంబరాలు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ ల చిత్రపతాలకు పాలాభిషేకం చేశారు. విద్యార్థుల పుస్తకాల ధరలు తగ్గించడం, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలపై హర్షం వ్యక్తం చేశారు.

# వాసాలమర్రిలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

## నేడు మంజూరు పత్రాలు అందజేయనున్న మంత్రి పొంగులేటి

**హైదరాబాద్ జూన్ 18 ప్రభాతవార్త:** భువనగిరి జిల్లా వాసాలమర్రి గ్రామంలో ఇండ్ల నిర్మాణం పేరుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతిలో మోసపోయిన ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ. హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. వాసాలమర్రి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు 2020 నవంబర్ 1న ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ ఆనాడు ప్రకటించారు. 2021 జూన్ 22న గ్రామసభ నిర్వహించి స్థానికులతో సహపంక్తి భోజనం చేశారు. బంగారు వాసాలమర్రిగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి కుటుంబానికి డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కట్టించి ఇస్తాననిహామీ ఇచ్చారు. కానీ వాస్తవంగా ఆరోజు నుంచి సిఎం పదవి నుంచి దిగిపోయే 2023 డిసెంబర్ 7వ తేదీ వరకు వాసాలమర్రి వైపు కన్నెత్తి చూడలేదని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వాసాలమర్రి గ్రామంలో సర్వే నిర్వహించి 205 మందికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామన్నారు. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాలను గురువారం అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం రెండు జిల్లాల్లో పర్యటించనున్నారు. యాదాద్రి భువనగిరిజిల్లా బండ సోమారం, సూర్యాపేటజిల్లా మోతే మండలంలోని విభలాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించనున్నారు.

# హీలియం గ్యాస్ పెట్టుకుని వ్యక్తి ఆత్మహత్య

## ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సూసైడ్ లేఖ

**సైబరాబాద్ ప్రతినిధి, జూన్ 18 ప్రభాతవార్త:** తలకు ప్లాస్టిక్ కవర్ చుట్టుకుని, హీలియం గ్యాస్ పెట్టుకుని చార్టెడ్ అకౌంటెంట్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్‌జిల్లా వాడి మండలం ఫరీద్ పేట్ గ్రామానికి చెందిన నిమ్మల సురేష్ రెడ్డి (28) గత కొంతకాలంగా చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తూ తన అన్నతో కలిసి మణికొండలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 16న అక్క దగ్గరకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటిలో నుండి బయటకు వెళ్లాడు. అదేరోజు గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలోని కొండాపూర్ రాజరాజేశ్వరి కాలనీకి వచ్చిన సురేష్ రెడ్డి ఓ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో గదిని అద్దెకు తీసుకున్నాడు. ఒక్కరోజుకే గదిని అద్దెకు తీసుకున్న అతను రెండవ రోజు కూడా ఉండేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో బయటకు వెళ్లిన అతను హీలియం గ్యాస్ సిలిండర్ తీసుకుని గదికి వెళ్లాడు. గత కొంతకాలంగా మానసిక ఒత్తిడితో బాధపడుతున్న సురేష్ ఆ ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సూసైడ్ నోట్ రాసి తలకు ప్లాస్టిక్ కవర్ చుట్టుకుని అందులో హీలియం గ్యాస్ పెట్టుకుని సురేష్ రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులుసూసైడ్ లేఖను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



సురేష్ రెడ్డి (ఫైల్ )



హీలియం గ్యాస్

# ఫోన్ ట్యాపింగ్ చేయకపోతే కాంగ్రెస్‌కు 90 సీట్లు వచ్చేవి

## ఫిషరీస్ కార్పొరేషన్ మెట్టు సాయి

**హైదరాబాద్,జూన్ 18,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ అధికారంలో ఉండి ఫోన్ ట్యాపింగ్ చేయకపోతే కాంగ్రెస్ 90 సీట్లు వచ్చేవని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి అన్నారు. బుధవారం విలేఖరులతో మాట్లాడతూ కెటిఆర్ ప్రతిపక్షంలో కూర్చొని నీతి వ్యాఖ్యలు మాట్లాడుతున్నా రని అరోపించారు. భార్య భర్తల ఫోన్లు ఎలా వింటాడని కేటీఆర్ ను 65 ఏండ్ల ముసలి వాళ్ళు తిడుతున్నారని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజల పరువు బజారున పడేసినందుకు కల్వకుంట్ల కుటుంబానికి నోటీసులు ఇవ్వాలని సాయి అన్నారు. కెటిఆర్ నోరు తెరిస్తే అబద్దమే మాట్లాడుతాడని విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ అనేది గతం అని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి అరగంట బిఆర్ఎస్ గురించి ఆలోచిస్తే ఆ పార్టీలో నలుగురు తప్పా ఎవరూ ఉండరు అని ఆయన జోస్యం చెప్పారు. కెటిఆర్‌కి ఇంగ్లీష్ ఫుల్ ..సబ్జెక్ట్ నిల్ అన్నారు. కల్వకుంట్ల కుటుంబం రేవంత్ పేరును కోటి సార్లు పలికిఉంటారని అన్నారు. కల్వకుంట్ల కుటుంబం కల్వ కుట్రల కుటుంబం అని ఎద్దేవాచేశారు.

# ఐఎల్ఎన్‌సితో ఉన్నత విద్యా మండలి ఎంఒయు

## విద్యా, పరిశోధక అంశాలపై దృష్టి

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో నాణ్యమైన విద్యతోపాటు, పరిశోధక అంశాలను పెంపొందించుకోవడం కోసం గుజరాత్‌లోని ఇన్ఫర్మేషన్ అండ్ లైబ్రరీ నెట్‌వర్క్ సెంటర్(ఐఎల్ఎన్‌సి)తో తెలంగాణ ఉన్నత విద్యా మండలి అవగాహన ఒప్పందం చేసుకుంది. ఐఎల్ఎన్‌సి డైరక్టర్ ప్రొఫెసర్ దేవిక పి మదాలి బుధవారం ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాల కిష్టారెడ్డితో ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ ఎంఓయూ మూలంగా విద్యా, పరిశోధన మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా అడుగులు వేయ డానికి ఎంఓయూని చేసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో ఐఎల్ఎన్ సెంటర్‌ని అభివృద్ధి చేసిన వివిధ జాతీయ స్థాయి విద్యా, పరిశోధన మద్దతు సేవలను సజావుగా అమలు చేయడానికి ఎంఓయు ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి విశ్వవిద్యాలయం ఈ అధునాతన డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, సాధనాల నుండి ప్రయోజనం పొందేలా చూసుకోవడం దీని లక్ష్యమన్నారు.



# బనకచర్లపై బిజెపి ఎంపిల మౌనం తగదు

## భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్,జూన్18,ప్రభాతవార్త:** ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీ తెలుగుదేశం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి నీళ్ళను అక్రమంగా తరలించుకుపోయేందుకు నిర్మిస్తున్న పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణలోని బిజెపి మంత్రులు, ఎంపిలు మౌనంగా ఉండటం తగదని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణకు రావాల్సిన గోదావరి జలాలు రావాల్సిందే అని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు పై జనవరి 22న 2025న జలశక్తి మంత్రికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేక రాశారని ఆయన వివరించారు. జూన్ 3న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో జలశక్తి మంత్రిని కలిసి ప్రాజెక్టు కడుతున్నారని చెప్పారని ఐనా కేంద్రం నిర్లక్ష్యం చేస్తున్నదని ఆరోపించారు. 13జూన్ న కూడా మరొక సారి సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో కలిశారని, బనకచర్ల పై కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి బాధ్యతగా వ్యవహరించట్లేదని దుయ్యబట్టారు. 1980 గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఆ సమస్యలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అల్ పార్టీ ఎంపీల మీటింగ్ పెట్టారని అందరూ రావాలని కోరారు.

# తుల్జా భవాని అమ్మవారిని దర్శించుకున్న పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్,జూన్ 18,ప్రభాతవార్త:** మహారాష్ట్రలోని తుల్జాపూర్‌లోని తుల్జా భవాని అమ్మవారి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దర్శించుకున్నారు. ఈమేరకు బుధవారం టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్‌తో కలిసి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తుల్జా భవాని అమ్మవారు హిందూ దేవాలయం ప్రసిద్ధి చెందిందని తెలిపారు. 51 శక్తి పీఠాలలో ఒకటిగా తుల్జా భవాని దేవాలయం ఉందన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ కులదేవతగా తుల్జా భవాని అమ్మవారి పూజించే వారని, యుద్ధాల్లో విజయం సాధించడానికి అమ్మవారి ఆశీస్సులు పొందేవారని వివరించారు. తుల్జా భవాని అమ్మవారి ఆశీస్సులు తెలంగాణ రాష్ట్రానికి ఉండాలని ఆకాంక్షించినట్లు మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

# పూర్తిస్థాయిలో అందుబాటులోకి విఎస్‌కె

## కసరత్తు చేస్తున్న పాఠశాల విద్యాశాఖ

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకి సంబంధించిన పూర్తి సమాచారాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి పాఠశాల విద్యా శాఖ ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే కేంద్ర విద్యాశాఖ సమగ్రశిక్షలో ప్రారంభించిన విద్య సమీక్ష కేంద్ర(విఎస్‌కె)ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన సమాచారాన్ని అధికారులు సేకరించినప్పటికీ వాటిని విఎస్‌కె ఫోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అయితే దానిని కాస్త ఇకపై అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేలా చూడాలని పాఠశాల విద్య శాఖ భావిస్తోంది. విఎస్‌కెలో రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వ పాఠ శాలలు ఉన్నాయి, వాటిలో మౌలిక వసతులు ఎలా ఉన్నాయనే విషయాలను పొందుపరచనున్నారు. అలాగే రాష్ట్రంలోని గవర్నమెంట్ స్కూల్స్‌లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు, వారికి బోధించడానికి ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారనే విషయాలను పొందుపరచనున్నారు. దాంతోపాటు విద్యార్థులకి సంబంధించిన మధ్యాహ్న భోజనం పథకం వివరాలను ఎంత మంది మధ్యాహ్న భోజనం వినియోగించుకుంటున్నారు.. ఎన్ని స్కూల్స్ లో ఎంత మంది ఎన్‌రోల్ అయ్యారనే పూర్తి వివరాలను విఎస్‌కెలో పొందుపరిచి దానిని కాస్త అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని పాఠశాల విద్య డైరక్టర్‌గా బాధ్యతలుతీసుకున్న నవీన్ నికోలస్ భావిస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను అడిగినట్టు తెలిసింది. పూర్తి వివరాలను సేకరించి వాటిని అందరికీ అందుబాటులో ఉంచేలా చూడాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

# విశ్రాంత ఉద్యోగిని హనీట్రాప్ చేసిన సైబర్‌నేరగాళ్లు

## కుటుంబ సమస్యలంటూ ఫేస్‌బుక్‌లో చాటింగ్

## బాధితుడి నుంచి 38.73లక్షలు వసూలు

**హైదరాబాద్,జూన్ 18,ప్రభాతవార్త:** నగరానికి చెందిన విశ్రాంత ఉద్యోగి(70)ని సైబర్ నేరగాళ్లు హనీ ట్రాప్ చేసి రూ.38.73 లక్షలు కాజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వృద్ధుడికి ఫేస్‌బుక్‌లో ఓమహిళ పేరుతో ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టారు. తండ్రి తమను వదిలేసి వెళ్లిపోయాడని, తల్లి టైలర్ వృత్తి చేస్తోందని పరిచయం చేసుకున్నారు. చాటింగ్ చేసేందుకు ఇంటర్నెట్ సదుపాయం ఏర్పాటు చేయాలని కేబుల్ ఆపరేటర్ నంబర్ ఇచ్చారు. దీంతో ఆమె ఇచ్చిన నంబర్‌కు ఫోన్ చేసి మాట్లాడిన బాధితుడు రూ.10వేలు పంపించాడు. అనంతరం మహిళ నుంచి ఫేస్ బుక్ స్పందన లేకపోవడంతో కేబుల్ ఆపరేటర్‌తో బాధితుడు చాటింగ్ చేశాడు. సదరు మహిళ జబ్బు పడిందని, ఆస్పత్రిలో ఉందని చెప్పడంతో రూ.10లక్షలు పంపిచాడు. ఆతర్వాత క్రెడిట్ ద్వారా రూ.2.65 లక్షలు చెల్లించాడు. కొన్ని రోజుల తర్వాత మహిళ దుబాయి వెళ్లిపోయిందని, ఆమె కాంటాక్ట్స్ ఏమీ లేవని కేబుల్ ఆపరేటర్ బాధితుడికి చెప్పాడు. తన తల్లి, సోదరి మీతో మాట్లాడాలని అనుకుంటున్నారని కేబుల్ ఆపరేటర్ చెప్పగా సరే అన్న బాధితుడు వారితో చాటింగ్ చేశాడు. అనంతరం తల్లి, మైనర్ చెల్లితో చాటింగ్ చేశావని పోలీసులకు ఫిర్యాదు చేస్తానని కేబుల్ ఆపరేటర్ బెదిరించాడు. ఈ విషయాన్ని సెటిల్ చేసుకోవాలని పోలీస్ కానిస్టేబుల్ పేరుతో ఓ సందేశం బాధితుడికి వచ్చింది. బాలిక చదువు, తల్లి ద్వాక్రా రుణం చెల్లింపు నిమిత్తం రూ.12.5లక్షలు బాధితుడు చెల్లించాడు. సెటిల్ చేసిన కానిస్టేబుల్, ఎస్సైకి రూ. లక్ష ఇచ్చాడు. కొత్త ఎస్సైని వచ్చానని కేసు అవ్వకుండా ఉండాలంటే రూ.10లక్షలు ఇవ్వాలని మరో వ్యక్తి డిమాండ్ చేశాడు. దీంతో భయపడిన బాధితుడు రూ. 7లక్షలు పంపించాడు. ఇలా మొత్తం రూ.38.73 లక్షలు బాధితుడి నుంచి సైబర్ నేరగాళ్ల కాజేశారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# కొమ్మిడి సుగుణ మృతికి మంత్రి సీతక్క సంతాపం

**హైదరాబాద్ జూన్ 18 ప్రభాతవార్త:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీర వనిత కొమ్మిడి సుగుణ మృతి పట్ల పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంతాపం ప్రకటించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సుగుణ మహిళా చైతన్యం, సమానహక్కుల కోసం అహర్నిశలు పోరాడిన గొప్ప త్యాగశీలి అని మంత్రి ఆమె సేవలను గుర్తు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్రాహ్మణపల్లిలో జన్మించిన సుగుణ చిన్న వయసులోనే భువనగిరి ఆంధ్ర మహాసభలో వాలంటీర్‌గా పని చేశారన్నారు. సిపిఐ అనుబంధ మహిళా సమాఖ్య కార్యదర్శిగా ఉమ్మడి రాష్ట్రంలో విశేష సేవలందించారు. నిజాం వ్యతిరేక పోరాటంలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించిన సుగుణ గారి మరణం సమాజానికి తీరని లోటన్నారు.

# బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి: ఆర్.కృష్ణయ్య

## కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సెన్సెక్స్ జీవోను తక్షణమే మార్చాలి: విహెచ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 18, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎర్ర సత్య నారాయణ ఆధ్వర్యంలో 42శాతం రిజర్వేషన్ల హామీల అమలుకై మహా దీక్షలు చేపట్టారు. ఈ దీక్షా కార్యక్రమంకు ముఖ్య అతిథులుగా ఆర్.కృష్ణయ్యతో పాటు కాంగ్రెస్ సీనియర్‌నేత వి.హనుమంతరావు, సీపీఐ నాయకులు నారాయణ, మాజీ స్పీకర్ మధు సూదనాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలలో 42శాతం రిజర్వేషన్ల అమలులో అయోమయానికి గురిచేస్తోందని ఆరోపించారు. కేంద్రానికి పంపామని రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకోవటం సమంజసం కాదని, రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థల రిజర్వేషన్లు అమలు చేయటంలో రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి అధికారం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి, ఆదర్శంగా నిలవాలని సూచించారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు అమలుచేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిలు అగ్రవర్ణాలు అయినప్పటికీ బీసీల గురించి ఆలోచన చేస్తున్నారని, ప్రధాని మోదీ బీసీ అయినప్పటికీ బీసీల సంక్షేమం గురించి పట్టించుకోవటం లేదని ఆరోపించారు. నిన్న కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీవో ప్రకారం క్యాస్ట్‌వైజ్ సెన్సెక్స్ కాకుండా కేవలం సెన్సెక్స్ అంటే బీసీలకు న్యాయం జరగదని, తక్షణమే ఆ జీవోను మార్చాలని కుల జన గణన జరిగే విధంగా జీవో చేయాలని డిమాండ్ చేశారు.





బుధవారం జరిగిన మహాదీక్షలో నినాదాలు చేస్తున్న వివిధ పార్టీల నేతలు

# అమెరికా కాన్సస్ స్టేట్ వర్సిటీతో వ్యవసాయ వర్సిటీ అవగాహన

## ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

**అత్తాపూర్ జూన్18,ప్రభాతవార్త:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అమెరికాలోని కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీతో ఎంతో కాలంగా ఉన్న సత్సంబంధాలను 12 ఏళ్ల విరామం తరవాత పునరుద్ధరించుకొంది. బుధవారం పిజెటిఏయు పరిపాలన భవనంలో జరిగిన ఓ కార్యక్రమంలో కాన్సస్ విశ్వవిద్యాలయం ప్రముఖ ప్రొఫెసర్, పంటల పరిశోధనా సంస్థ సంచాలకులు ప్రొఫెసర్ వి.వరప్రసాద్, పిజెటిఏయు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా అల్దాస్ జానయ్య మాట్లాడుతూ 1964లో ప్రస్తుత వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటైన సమయంలో కాన్సస్ విశ్వవిద్యాలయం సహకరించిందని వివరించారు. అదేవిధంగా 70 ఏళ్ల క్రితం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాల, వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని 17 మంది ప్రొఫెసర్లకు పీహెచ్ డి చేసే అవకాశం కల్పించి మానవ వనరుల అభివృద్ధికి సాయం చేసిందని జానయ్య తెలిపారు. పునరుద్ధరించుకున్న ఒప్పందం ప్రకారం ఇటీవల పిజెటిఏయులో ఏర్పాటుచేసిన డిజిటల్ వ్యవసాయ కేంద్రం, సహజ వనరులు, పర్యావరణ కేంద్రానికి సంబంధించిన పరిశోధనాంశాలకు కాన్సస్ విశ్వవిద్యాలయం పూర్తి సహకారం అందిస్తుందని జానయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.సీహెచ్ విద్యాసాగర్, అధికారులు, పూర్వ ఉపకులపతి డాక్టర్ ఎస్. రఘువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఉపకులపతి అల్దాస్ జానయ్య, ప్రొ.వరప్రసాద్

# ఖనిజ సరఫరా వ్యవస్థ పటిష్టం

## కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** ఖనిజాల సరఫరా వ్యవస్థను బలపరచడం, వినియోగ ప్రక్రియలను మెరుగుపరచడం ద్వారా దేశాన్ని ఆత్మనిర్భరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలో విలక్షణ, కీలక ఖనిజాల సరఫరా భద్రతపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మైనింగ్ నుంచి రిఫైనింగ్ వరకు వివిధ దశలపై కీలకంగా చర్చించినట్లు తెలిపారు. ప్రధానంగా ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక శక్తి (ఎనర్జీ), జాతీయ భద్రతకు కీలకమైన ఖనిజాల సరఫరాను నిరంతరం కొనసాగించేందుకు అనుసరించాల్సిన మార్గాలను అన్వేషించాలన్నారు. మైనింగ్ నుంచి రిఫైనింగ్ వరకు, అలాగే ఆఖరి వినియోగ దశ వరకు మొత్తం వ్యవస్థను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రం ప్రారంభించిన జాతీయ కీలక ఖనిజ మిషన్ అమలు ప్రణాళికలను పగడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఖనిజ రంగంలో స్వయం సమృద్ధిని సాధించడంపై ప్రభుత్వం ఆత్మనిర్భర్ దృష్టితో వ్యవహరిస్తోందని వెల్లడించారు. విలక్షణ, కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సి ఉందన్నారు. అలాగే వాటి వినియోగ ప్రక్రియలను సైతం మెరుగుపరచడం మన ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు.

# మూడో రోజు రూ.1,313.53 కోట్లు జమ

## వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** రైతు భరోసా కింద మూడో రోజు 1,313.53 కోట్ల రూపాయలను విడుదల చేసినట్టు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి బుధవారం 4 ఎకరాలకు వరకు నిధులు జమ చేసినట్టు వెల్లడించారు. ఈ మేరకు ఒక ప్రకటనలో దీంతో 21.89 లక్షల ఎకరాలకు సంబంధించి 6.33 లక్షల మంది రైతులు లబ్ధిపొందినట్లు చెప్పారు. ఇక రైతు భరోసా కింద ఇప్పటి వరకు మొత్తం 5215.26 కోట్ల రూపాయలు విడుదల చేసి, 58.04 మంది రైతులకు సహాయం అందించినట్టు వివరించారు. 9 రోజుల్లో 9 వేల కోట్లను రైతుల ఖాతాలలో జమ చేయడంలో భాగంగా మూడో రోజు రైతు భరోసా నిధులు విడుదల చేసినట్టు తెలిపారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకు రైతు భరోసా సహాయాన్ని అందిస్తామని చెప్పారు. రైతు భరోసాపై బిఆర్ఎస్ నాయకులకు ప్రశ్నించే హక్కు లేదన్నారు. గత ప్రభుత్వం ఒక సందర్భంలో మినహా, వానాకాలం రైతుబంధు సహాయం ఎప్పుడు సాగు కాలానికి ముందుగా ఇవ్వలేక పోయిందని విమర్శించారు. ప్రతిసారి ఆలస్యంగానే రైతుబంధు నిధులు రైతుల ఖాతాలలోకి జమ చేసారని, అదికూడా 10వ నెల వరకు కొనసాగేదని చెప్పారు.

అంతేకాకుండా ఏ సం దర్భంలో కూడా 3 రోజుల్లోనే 5వేల కోట్ల రూపాయలకు పైగా రైతుబంధు కోసం ఖర్చు పెట్టిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. అలాగే ఇచ్చిన మాట ప్రకారం దేశానికే ఆదర్శంగా 2 లక్షల లోపు రైతు రుణమాఫి పథకాన్ని పూర్తిచేసి చూపించా మన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు 6 వేల రూపాయలకు పెంచి, అందచేస్తున్నా మన్నారు. ఏడాదిన్నర కాలంలోనే దాదాపు 77 వేల కోట్ల రూపాయలు రైతు సంక్షేమం కోసం ఖర్చు పెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొ న్నారు. రాష్ట్ర రైతాంగం కోసం తమ ప్రభుత్వం నిలబడు తుందని, వారి సంక్షేమమే మా ప్రభుత్వం తొలి ప్రాధాన్యతని స్పష్టం చేశారు.

# ఖరీఫ్‌లో 89.29 లక్షల హెక్టార్లలో సాగైన పంటలు

## గత యేడాది కంటే పెరిగిన 1.48 లక్షల హెక్టార్లు

## 4.53 లక్షల హెక్టార్లలో పడిన వరి నాట్లు

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** ప్రస్తుత ఖరీఫ్ సీజనులో వివిధ పంటల సాగు వేగం అందుకున్నాయి. దేశ వ్యాప్తంగా ఇప్పటి వరకూ 89.29 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. ఇదే సమయానికి గత ఏడాది కంటే ఈ సారి అధిక విస్తీర్ణంలో పంటలను వేవారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఖరీఫ్ నివేదికను విడుదల చేసింది. గత ఏడాది ఇదే సమయంలో 87.81 లక్షల హెక్టార్లలో జరిగిన ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం, ప్రస్తుత సీజన్‌లో 89.29 లక్షల హెక్టార్లకు పెరిగింది. ఈ సీజన్ ప్రారంభంలోనే గతం కంటే 1.48 లక్షల హెక్టార్లలో పంటల సాగు పెరగడం వల్ల ఉత్పత్తి పెరగడం ద్వారా రైతుల ఆదాయాలు కూడా పెరిగే అవకాశం ఉందని అంచానా వేసింది. ఆహార ధరలను స్థిరీకరించడానికి ఇది దోహదపడుతుందని పేర్కొంది. దేశంలో వరి సాగు నిమిత్తం విత్తనాలు నాటడాన్ని రైతులు ప్రారంభించాడు. దీంతో ఇప్పటి వరకూ 4.53 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో వరి నాట్లు వేశారు. గత సంవత్సరం ఇదే కాలంలో ఇది 4 లక్షల హెక్టార్లుగా నమోదైంది. అలాగే పప్పుధాన్యాలకు సంబంధించి మినుములు, పెసర్లు వంటి పప్పుధాన్యాల విస్తీర్ణం దేశ వ్యాప్తంగా గత ఏడాది ఇదే సమయానికి 2.6 లక్షల హెక్టార్లలో సాగు చేయగా, ఈసారి అది 3.07 లక్షల హెక్టార్ల వృద్ధి సాధించింది. ఇది గత ఖరీఫ్ కంటే ఈ సారి 0.49 లక్షల హెక్టార్ల పెరుగుదలను సూచిస్తోంది. ఇందువల్ల అధిక పప్పుధాన్యాల ఉత్పత్తి ద్వారా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి కీలకంగా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ భావిస్తోంది. ఇక దేశ వ్యాప్తంగా ఇంత వరకూ నూనెగింజల విస్తీర్ణం గత ఏడాది 1.5 లక్షల హెక్టార్లలో సాగు కాగా, ఈ ఖరీఫ్‌లో అది 2.05 లక్షల హెక్టార్లకు పెరిగింది.

ఇది సీజన్ ప్రారంభంలో సానుకూల ధోరణిని సూచిస్తుందని పేర్కొంది. అలాగే ముతక తృణధాన్యాలు,, విస్తీర్ణం జోవర్, బజ్రా మరియు రాగి వంటి మిల్లెట్ల పంటల సాగు ఇప్పటివరకు 5.89 లక్షల హెక్టార్లకు చేరుకుంది. కాగా దేశ వ్యాప్తంగా ముందస్తు, మెరుగైన రుతుపవనాల ప్రవేశంతో వర్షాలు కురియడం ఫలితంగా నీటిపారుదల లేని భూములలో విత్తనాలు నాటడానికి దోహదపడ్డాయని భావిస్తోంది. అనుకూలమైన వాతావరణ పరిస్థితుల్లో విత్తే ప్రాంతాలలో ఈ పెరుగుదల బలమైన ఉత్పత్తి సీజన్‌కు తోడ్పడుతుందని భావిస్తున్నారు.

# వివిఐపి అతిథి గృహం నిర్మాణంపై నిపుణుల కమిటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్18:** వివిఐపి అతిథి గృహాలు నిర్మించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధులతో సమావేశాలు, వారి వసతి కోసం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీ ఆర్‌హెచ్‌ఆర్‌డీఐ) ప్రాంగణంలో చేపడుతున్న వీవీఐపీ గెస్ట్ హౌస్ నిర్మాణంలో భాగంగా చేపడుతున్న నిర్మాణాలపై నిపుణుల కమిటీ నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) బుధవారం సూచించింది. వీవీఐపీ గెస్ట్ హౌస్ నిర్మాణంలో భాగంగా చేపడుతున్న నిర్మాణాలఅవసరం, వాటికి చేస్తున్న వ్యయంపై మదింపునకు నిర్మాణరంగనిపుణులతో కమిటీ నియమించాలని సీఎంవో పేర్కొంది. నిపుణుల కమిటీ ఆ నిర్మాణాలను పరిశీలించి తమ సిఫార్సులతో నివేదిక సమర్పించాలని సీఎంవో కోరింది.



# పేదరిక నిర్మూలనకు జీవనోపాధి కార్యక్రమం: మంత్రి సీతక్క

**హైదరాబాద్ జూన్ 18 ప్రభాతవార్త:** పేదరిక నిర్మూలనకు తెలంగాణ సమ్మిళత జీవనోపాధి కార్యక్రమాన్ని ప్రారంబించనున్నట్లు పంచాయితీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క తెలిపారు. బుధవారం సచివాలయంలో తెలంగాణ జీవనోపాధి కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అత్యంత వెనకబడిన 6 వేల కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వం ద్వారా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అభాగ్యులు, నిర్భాగ్యులకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదం చేస్తోందని, ప్రభుత్వం తరుపున ఆయా కుటుంబాలకు అన్నిరకాలుగా అండగా ఉంటామన్నారు. అత్యంత వెనకబడిన కుటుంబాలను, వర్గాలకు ఆర్థిక పథంలో నిలిపే విధంగా ఈ కార్యక్రమం కృషి చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో2 సంత్సరాల పాటు ఆయా కుటుంబాలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆదిమ జాతులు అంతరిస్తున్నాయని, వాటి పరిరక్షణ కోసం బ్రాక్ సంస్థతో కలిసి పనిచేస్తామని, ఆదిమ జాతుల ఆర్థిక ప్రగతిపై ప్రధానంగా దృష్టి సారిస్తామన్నారు. సమగ్ర ఉపాధి అవకాశాల ద్వారా పేదల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారి సుస్థిరాభివృద్ధికి ఈ కార్యక్రమం దోహదపడనుందన్నారు. తెలంగాణ సమ్మిళిత జీవనోపాధి పథకంలో భాగస్వాములుగా ఉన్నా బ్రాక్ ఇంటర్నేషల్, ఆఘా ఖాన్ పౌండేషన్, సెంటర్ ఫర్ రిసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్, ప్రధాన్, ట్రికిల్ అప్ సంస్థలకు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ స్మ్రితి శరణ్, సెర్ప్ సిఇవో దివ్యా దేవరాజన్, బ్రాక్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులునాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని చెంచుపేటలో పర్యటించి చెంచుల జీవన స్థితిగతులను తెలుసుకున్న స్మ్రితి శరణ్‌ను మంత్రి సీతక్క శాలువాతో సన్మానించారు.

# 'సాగర్' స్పిల్‌వే శాశ్వత మరమ్మతుకు కసరత్తు

## 20న మరో నాలుగు గేట్ల ట్రయల్ రన్

**హైదరాబాద్,జూన్18,ప్రభాతవార్త:** నాగార్జునసాగర్ జలాశయ స్పిల్ వే ప్రాంతం వద్ద తరచూ ఏర్పడుతున్న గుంతలను శాశ్వత ప్రాతిపదికన పూడ్చడం కోసం రూర్కీ ఐఐటి నిపుణులు, ఎంవైకే, ఫాస్టాక్ నిపుణుల సౌజన్యంతో అధునాతన పద్ధతిలో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నాగార్జునసాగర్‌లో 2014కు పూర్వం కురిసిన భారీ వర్షాల కారణంగా ఆరున్నరమీటర్ల లోతు కంటే ఎక్కువ గోతులు స్పిల్‌వేపై ఏర్పడినాయి. ఆనాటి నుంచి ప్రతియేడు గుంతలు పడటం రివాజుగా మారింది. గుంతల మరమ్మతు చేస్తూ ఉన్నా ప్రస్తుతం మీటరుకు లోతుకు మించి గోతులు స్పిల్‌వేపైలేవు. గుంతల పరిశీలనకు ప్రత్యేక క్రేన్లను ఏర్పాటు చేసుకోవాలని కెఆర్ఎంబి అనుమతితో తెలంగాణ ప్రభుత్వం నీటిపారుదలశాఖకు అనుమతి ఇచ్చింది నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద ఎంవైకే, ఫాస్టాక్ నిపుణుల కమిటీ బృందం బుధవారం పరిశీలించారు. వీరి నివేదికలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకునేందుకు నీటిపారుదల శాఖ నిపుణులు కార్యచరణ చేపట్టనున్నారు.



నాగార్జునసాగర్‌లోకి గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా అదనంగా వచ్చిన నీటిని ఆనకట్ట క్రస్టుగేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తారు. ఆ నీరు వెళ్లడం కోసమే స్పిల్వేను నిర్మించారు. 585 అడుగుల వరకు నిల్వ చేస్తూ అదనంగా వస్తున్న నీటిని ఆధారంగా చేసుకొని దీనిద్వారా వదులుతారు. సుమారు 600 అడుగుల ఎత్తు నుంచి ఒత్తిడితో వస్తున్న నీటి ఉధృతి కారణంగా గుంతలు పడుతుంటాయి. ఆరువదుల చరిత్ర కలిగిన ఆనకట్టులో అత్యంత కీలకమైన స్పిల్‌వే మరమ్మతుల నిర్వహణ ప్రతి యేడు గోతులుపడి ఉభయరాష్ట్రాలకు అనిశ్చితి కలిగిస్తున్నది. 2014 కంటే ముందు వచ్చిన భారీ వరదనీటి కారణంగా పెద్ద గుంతలు పడడంతో ప్రభుత్వం రూ.40 కోట్లతో మరమ్మతులు చేశారు. కొంతకాలం బాగానే ఉన్నా మళ్లీ అధిక వరదల వల్ల 6 మీటర్ల లోతు వరకు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో 2023-24లో రూ.19 కోట్లతో మరమ్మతులు చేయగా 2024లో జలాశయంలో నీరు గరిష్ఠ స్థాయికి చేరడంతో నీటిని విడుదల చేయడంతో మళ్లీ గోతులు పడ్డాయి. ప్రస్తుతం మీటరులోతులోపే గోతులు స్పిల్‌వేపై ఉన్నాయి ఇలాగే వదిలేస్తే మరల వరదనీరు అధికమై స్పిల్వే దెబ్బతినే ప్రమాదం ఉందని నీటిపారుదలశాఖ అధికారులు అనిశ్చితికి గురవతున్నారు. ఎంవైకే, ఫాస్టాక్ నిపుణుల కమిటీ బృందం అధ్యయనం చేసే కంటే ముందు కూడా గతంలో అనేక ఏజన్సీలు అధ్యయనం చేశాయి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా విభజనతరువాత ఎన్ఎస్‌పి నిర్వహణ బాధ్యత తెలంగాణకు ఇచ్చారు. కెఆర్ఎంబి బోర్డు ప్రాజెక్టు మరమ్మ తులను తెలంగాణకు అప్పగించడంతో క్రస్ట్ గేట్లకు రూ.10లక్షల నిధులు వెచ్చించి ఇప్పటికే పనులు చేస్తున్నారు. 26 గేట్లలో 22 గేట్లకు సంబంధించిన పనులు పూర్తికాగా జూన్ 12న మొదటిసారి ట్రయల్ రన్ నిర్వహించారు. ఇంకా నాలుగు క్రస్ట్ గేట్లకు మరమ్మతులు చేసి జూన్ 20లోగా మరోసారి ట్రయల్ రన్ చేయను న్నారు. ప్రాజెక్టులో కీలకమైన స్పిల్వే గుంతలపై రూర్కీ ఐఐటీ నిపుణులతో అధ్యయనం చేయిం చాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాల అనుగుణంగా నీటిపారు దలశాఖ అధ్యయనం చేయించారు. మార్చిలో రూర్కీ నిపుణులు ప్రాథమిక నివేదిక రూపొం దించారు. జూన్ మొదటి వారంలోనూ వీరు తాత్కాలికంగా మార్పులు చేర్పులు చేసి స్పిల్వేకు మరమ్మతులు ఎలా చేయాలో సూచనలు జారీ చేశారు. అయితే నీటిపారుదల శాఖ అధికారులు మాత్రం మరమ్మతు పనులు తాత్కాలిక ప్రాతి పదికన కాకుండా శాశ్వతంగా నిలిచేలా నివేదికలు రూపొందించాలని చెప్పడంతో వీరి అధ్యయనం ఇంకా కొనసాగుతోంది.



ఇటిక్యాల పోలీసుల అదుపులో ప్రజాసంఘాల నాయకులు

# ఎర్రవల్లిలో ప్రజా సంఘాల నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

## రైతులపై కేసులను ఎత్తివేయాలని నాయకుల డిమాండ్


**ఇటిక్యాల ,జూన్ 18 ప్రభాతవార్త :** అల్లంపూర్ నియోజకవర్గం రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామ సమీపంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయరాదని పంట భూములు నాశనం ఇక్కడ ఏర్పాటు చేయరాదని పోరాడుతున్న రైతులపై కొన్ని రోజుల క్రితం పోలీసులు దాడి చేయగా పలువురికి గాయాలు తగిలిన ఘటనలు ఉన్నాయి. ఈ ఘటనపై నిజనిర్ధారణ కమిటీగా పెద్ద ధన్వాడ గ్రామానికి బుధవారం పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు ఉమ్మడి జిల్లా నాయకులు ప్రొ॥లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షులు ఎన్.నారాయణరావు. ప్రధాన కార్యదర్శి ఉమ్మడి జిల్లా మహబూబ్‌నగర్‌జిల్లా అధ్యక్షులు సుభాన్, ప్రధాన కార్యదర్శి జక్కా బాలయ్య, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, వెంకటేష్‌లను బుధవారం ఉదయం 11 గంటల సమయంలో మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో అల్లంపూర్ సిఐ రవిబాబు ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులతో కలిసి వారిని అదుపులోకి తీసుకొని ఇటిక్యాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకు లు మాట్లాడుతూ కంపెనీ పెట్టవద్దని వ్యతిరేకంగా పోరాడిన రైతులను అరెస్టు చేసి జైలుకు పంపడాన్ని మేధావులు ప్రజాసంఘాల నాయకులు తీవ్రంగా ఖండించాలన్నారు.

# కాంగ్రెస్ హాయంలో సెటిల్‌మెంట్‌లకు అడ్డాగా పోలీస్ స్టేషన్లు

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**సిరిసిల్ల బ్యూరో, జూన్ 18, ప్రభాతవార్త:** కాంగ్రెస్ హాయంలో సెటిల్ మెంట్‌లకు అడ్డాగా పోలీస్ స్టేషన్‌లు మారాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు ఆరోపించారు. తన భూమిని కాంగ్రెస్ నేత కబ్జా చేశాడని ఫిర్యాదు చేస్తే ఉల్టా తమ పార్టీ నాయకుడు కర్కబోయిన కుంటయ్యపైనే కేసు బనాయించి వేధించడంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. సివిల్ మ్యాటర్‌లో దూరి పోలీసులు సెటిల్మెంట్‌లు, అరాచకాలు చేయడం సమాజానికి ఎంత మాత్రం మంచిది కాదన్నారు. కాంగ్రెస్ నేత భూమిని కబ్జా చేయడంతో ఆత్మహత్య చేసుకున్న బిఆర్ఎస్ మాజీ ఎంపిటిసి కర్కబోయిన కుంటయ్య కుటుంబ సభ్యులను రాజన్న సిరిసిల్ల జిల్లా ఆసుపత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఏం చేస్తే అది చేయడాన్నే ద్యూటిగా



కుంటయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న కెటిఆర్

భావించి పోలీసులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. కుంటయ్య చావుకు కారణమైన పోలీసులపై చర్యలు తీసుకునే వరకు న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. మొన్న ఏసిబి విచారణ జరుగుతున్నపుడు తన కోసం హైద రాబాద్ దాకా వచ్చి ధైర్యం చెప్పిన కుంటయ్య అదే రోజు రాత్రి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసి మనసు కకావికలమైందన్నారు. రాజకీయ నాయకులు అంటే అందరు ఏదేదో ఊహించు కుంటున్నారని బయటకి గంభీరంగా కనిపించినా లోపల దుఃఖాన్ని దాచుకుని ఓ వైపు ప్రజల కోసం పని చేస్తూ మరోవైపు కుటుంబాన్ని కాపాడుకునే క్రమంలో తీవ్ర ఒత్తిడి గురవుతారన్నారు. పార్టీలో నిబద్ధత కల నాయకుడు, నిఖార్సైన గులాబి సైనికుడు కుంటయ్య ఇద్దరు పిల్లల చదువులు వారి పెళ్లిళ్ల ఇతర సమస్యలను అన్నింటికి తానే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. కుంటయ్య కుటుంబానికి పార్టీ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని కెటిఆర్ భరోసా ఇచ్చారు.

# ఆగస్టు 15న మహిళా శక్తి చీరల పంపిణి

## ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు

**హైదరాబాద్ జూన్ 18 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు 15న ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేయనుంది. ఈ మేరకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే సిరిసిల్ల నేతన్నలు జూన్ నెలాఖరుకు 50 శాతం ఉత్పత్తి పూర్తి చేయాలని శైలజారామయ్యర్ ఆదేశించారు. చేనేత కార్మికులకు ఏడాది పొడవునా ఉపాధి లభించేలా ఈ పథకం ఉద్దేశించబడింది. ప్రభుత్వం 9 కోట్ల మీటర్ల బట్టకు ఆర్డర్ ఇచ్చింది. గత బతుకమ్మ చీరల రూ.280 కోట్ల బకాయిలు చెల్లించారు. రూ.50 కోట్లతో యారన్ బ్యాంక్ ఏర్పాటు చేశారు. పాఠశాల, అంగన్‌వాడీ యూనిఫాం ఆర్డర్లు కూడా అందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ ఆగస్టు 15 నాటికి పూర్తి చేసేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ బృహత్తర కార్యక్రమానికి కేంద్రంగా నిలుస్తున్న సిరిసిల్ల నేతన్నలకు కీలక ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించారు. జూన్ నెలాఖరు నాటికి 50 శాతం చీరల ఉత్పత్తిని పూర్తి చేయాలని చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ ఆదేశించారు. ఈ పథకం రాష్ట్రంలోని మహిళా సంఘాల సభ్యులకు గౌరవాన్ని. చేనేత కార్మికులకు ఏడాది పొడవునా స్థిరమైన ఉపాధిని కల్పించే మహత్తర లక్ష్యంతోరూపొందించబడింది. చేనేత కార్మికులకు సంవత్సరం పొడవునా పని భద్రత కల్పించాలనే సమున్నత ఉద్దేశంతో ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు రెండు చీరలను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందిరా మహిళా శక్తిఖి కింద ప్రభుత్వం ఇచ్చిన ఈ ఆర్డర్ తెలంగాణ చేనేత రంగానికి ఒక గొప్ప వరం. ఏడాదికి ఏకంగా 9 కోట్ల మీటర్ల వస్త్ర ఉత్పత్తిని సాధించాల్సి ఉంది. ఇది సిరిసిల్ల, ఇతర చేనేత కేంద్రాలకు అపారమైన పని అవకాశాలను సృష్టిస్తుంది. ఈ ఆర్డర్‌ను వేగవంతం చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ స్పష్టం చేశారు. ప్రతి సొసైటీకి కేటాయించిన లక్ష్యంలో 50 శాతాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని, లేనిపక్షంలో సంబంధిత సొసైటీకి కేటాయించిన ఆర్డర్‌ను రద్దు చేయాల్సి వస్తుందని ఆమె గట్టి హెచ్చరిక జారీ చేశారు. గత ప్రభుత్వం నుంచి రావాల్సిన బతుకమ్మ చీరలకు సంబంధించిన రూ.280 కోట్ల బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికే చెల్లించింది. నేతన్నలకు నిరంతరం పని కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. చేనేత కార్మికులకు అవసరమైన ముడిసరుకును సకాలంలో అందించేందుకు రూ.50 కోట్లతో యారన్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ తెలియజేశారు. ఇది నేరుగా నేతన్నలకు ప్రయోజనం చేకూరుస్తుంది. మధ్యవర్తుల దోపిడీని తగ్గిస్తుంది. అంతేకా కుండా పాఠశాల, అంగన్‌వాడీలకు సంబంధించిన యూనిఫాం వస్త్రాల ఆర్డర్‌లను కూడా చేనేత రంగానికి అప్పగించారు. భవిష్యత్తులో దేవాదాయ శాఖ నుంచి కూడా మరో పెద్ద ఆర్డర్ వస్తుందని ఆమె ప్రకటించారు. ఈ బహుముఖ విధానం చేనేత రంగాన్ని దీర్ఘకాలికంగా బలోపేతం చేస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది..

# త్వరలో ల్యాండ్ ట్రిబ్యునల్స్

## సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్ జూన్ 18 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం భూ వివాదాల పరిష్కారానికి ల్యాండ్ ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయనుంది. కలెక్టర్ స్థాయిలో న్యాయం జరగని వారు ట్రిబ్యునళ్లను ఆశ్రయించవచ్చు. రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే భూభారతి చట్టంలో అప్పీళ్ల వ్యవస్థను పటిష్టం చేశారు. తహసీల్దార్ ఉత్తర్వులపై ఆర్డీవోకు, ఆర్డీవో ఆర్డర్‌పై కలెక్టర్‌కు, కలెక్టర్ అప్పీల్‌పై ల్యాండ్ ట్రిబ్యునల్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. కోర్టుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా సమస్యలు పరిష్కరించబడతాయి. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో భూ వివాదాల పరిష్కారం కోసం ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయాలని భావిస్తుంది. త్వరలోనే వీటిని ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తుంది. ప్రస్తుతం తెలంగాణ సర్కార్.. భూ సమస్యలన్నింటిని.. కలెక్టర్ స్థాయిలోనే పరిష్కరించేలా చర్యలు ప్రారంభించింది. అయితే కలెక్టర్ స్థాయిలో తమకు న్యాయం జరగలేదని భావిస్తే.. అలాంటి వారు ల్యాండ్ ట్రిబ్యునళ్లను ఆశ్రయించే వెసులుబాటు ఉంది. ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలిస్తే రాష్ట్రంలో భూ సమస్యలు పెద్ద ఎత్తున పెండింగ్‌లో ఉన్నాయనే విషయం అర్థం అవుతుంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ల్యాండ్ ట్రిబ్యునళ్ల ఏర్పాటుపై ఆలోచన చేస్తుంది. అయితే రాష్ట్రంలో ఎన్ని ల్యాండ్ ట్రిబ్యునళ్ల అవసరం ఉంది.. ప్రతి జిల్లాకు ఒక ట్రిబ్యునల్ ఉండాలా.. లేక 3, 4 జిల్లాలకు కలిపి ఒకటి ఏర్పాటు చేయాలా అనే అంశాలపై అధికారులతో చర్చించి.. దీనిపై అంతిమ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ అంశంపై ఇప్పటికే అధికారులతో చర్చలు జరుపుతున్న ప్రభుత్వం.. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన చేయనుంది. ఇదిలా ఉంటే.. ఆర్వోఆర్2020లో అప్పీళ్ల వ్యవస్థ లేదు. దీని వల్ల సామాన్యులుతీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భూమికి సంబంధించి ఎంత చిన్న సమస్య రిజెక్ట్ అయినా.. తప్పక సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండేది. భూసమస్యల పరిష్కారం కోసం సామాన్యులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగలేక.. లాయర్లకు వేలల్లో ఫీజులు చెల్లించలేక తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. దీనికి పరిష్కారంగా రేవంత్ సర్కార్.. భూభారతి చట్టంలో అప్పీళ్ల వ్యవస్థను తీసుకువచ్చింది. ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో అప్పీళ్లు ఏర్పాటుచేసింది. దీని వల్ల సామాన్యులకు ఏదో ఒక స్థాయిలో వారి సమస్య పరిష్కారం అయ్యే అవకాశం కల్పించింది. అంతేకాక భూభారతి చట్టం మార్గదర్శకాల్లోనే ల్యాండ్ ట్రిబ్యునళ్ల ఏర్పాటును పొందు పరిచారు. రెవెన్యూ సదస్సులో పెద్ద ఎత్తున భూ వివాదాలు నమోదు కావడంతో త్వరలోనే ట్రిబునల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక భూభారతిలో ఉన్న అప్పీళ్ల వ్యవస్థ ద్వారా ప్రజలు తమ భూమి సమస్యలపై తహసీల్దార్ జారీ చేసిన ఉత్తర్వుల మీద రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో)కు 30 రోజుల్లో అప్పీల్ చేసుకోవచ్చు. అలాగే, ఆర్డీవో ఆర్డర్‌పై జిల్లా కలెక్టర్‌కు 60 రోజుల్లో అప్పీల్ చేసుకోవచ్చు. చివరకు మూడో దశలో.. కలెక్టర్ అప్పీల్‌పై 30 రోజుల్లో ల్యాండ్ ట్రిబ్యునల్‌కు అప్పీల్ చేసుకోవచ్చు. కోర్టుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా భూమి సమస్యలను ఈ ల్యాండ్ ట్రిబ్యునల్స్‌లోనే పరిష్కరించుకోవచ్చు. దీని వల్ల సమయం, డబ్బు వృథా కాదని భావిస్తున్నారు.

# వ్యయ నియంత్రణలో సింగరేణికి జాతీయ పురస్కారం

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** సింగరేణి అవలంబిస్తున్న వ్యయ నియంత్రణ చర్యలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ మేరకు ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఎంఏఐ) ఏటా ప్రదానం చేసే జాతీయ స్థాయి పురస్కారానికి సింగరేణి ఎంపికైంది. సింగరేణి అనుసరిస్తున్న వ్యయ నియంత్రణను ప్రశంసిస్తూ మెగా పరిశ్రమల విభాగంలో ఐసీఎంఏఐ తృతీయ బహుమతికి ఎంపిక చేసినట్లు ఐసీఎంఏఐ పేర్కొంది. కాగా స్పేర్ పార్టులు కచ్చితంగా ఎన్ని అవసరమో వాటిని మాత్రమే కొనడం వల్ల భారీ వ్యయ నియంత్రణ సాధించగలిగినట్లు సింగరేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.


ఇవే కాకుండా ప్రతీ విభాగంలో వృథాను అరికట్టడం, గనుల వారీగా వ్యయ నియంత్రణ చర్యలు చేపట్టడం వంటి చర్యలు మంచి ఫలితాలను ఇచ్చాయని వివరిం చింది. వీటన్నిటి కన్నా ముఖ్యంగా సంస్థలోని అన్ని రకాల ఆర్థిక వ్యవహారాలను సిస్టమ్స్, అప్లికేషన్స్ అండ్ ప్రొడక్ట్స్ ఇన్ డేటా ప్రాసెసింగ్ ద్వారా నిర్వహించడం వల్ల దుబారాకు అవకాశం లేకుండా, అన్ని వ్యవహారాలు పారదర్శకంగా నిర్వహించబడుతున్నాయని వెల్లడించింది.

# 'ఆపరేషన్ సింధు' మొదలైంది..: భారత్ విదేశాంగ శాఖ ప్రకటన

**న్యూఢిల్లీ, జూన్ 18:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తీవ్రతరమవుతుండటంతో ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయుల్ని తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించింది. దీనికి 'ఆపరేషన్ సింధు' అని నామకరణం చేసినట్లు కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపిస్తున్న వేళ ఉత్తర ఇరాన్ నుంచి జూన్ 17న ఆర్మేనియాకు చేరుకున్న 110 మంది విద్యార్థులను భారత్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేసింది. వీరంతా ఆర్మేనియా రాజధాని యెరవాన్ నుంచి ప్రత్యేక విమానంలో భారత్‌కు బయల్దేరారు. జూన్ 19న (గురువారం) తెల్లవారుజామున న్యూఢిల్లీకి చేరుకోనున్నారు. విదేశాల్లో ఉన్న తన పౌరుల భద్రతకు భారత్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని కేంద్ర విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. ఇజ్రాయెల్ దాడులతో టెహ్రాన్ నగరం దద్దరిల్లుతోంది. ఈ నేపథ్యంలో భారత ఎంబసీ ఇప్పటికే ప్రత్యేక అడ్వైజరీని జారీ చేసింది. తక్షణమే ఆ నగరాన్ని వీడాలని కోరింది. టెహ్రాన్ వెలుపల సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని భారతీయులకు సూచించింది. ఇప్పటి వరకు భారత ఎంబసీని సంప్రదించని భారతీయులు వెంటనే దౌత్యాధికారులతో కాంటాక్ట్ అవ్వాలని కోరిన విషయం తెలిసిందే.

**ఢిల్లీ తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్**

ఇరాన్-ఇజ్రాయెల్ పరస్పర దాడుల నేపథ్యంలో ఆ రెండు దేశాలు, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉంటున్న తెలంగాణ వాసులకు సాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ ప్రారంభించింది.



ఇప్పటివరకూ రాష్ట్ర వాసులు ఎవరూ ప్రభావితం అయినట్లు సమాచారం లేకపోయినా భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ముందుజాగ్రత్తగా ఈ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా తాము ఉంటున్న దేశాల్లో గానీ, ప్రయాణాల్లో గానీ ఇబ్బంది పడుతున్న తెలంగాణ వాసులు కింద పేర్కొన్న నంబర్లను సంప్రదించవచ్చని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయం వెల్లడించింది. వందన - రెసిడెంట్‌కమిషనర్ పిఎస్-+91 9871999044, జి.రక్షిత్‌నాయక్, లైజన్ ఆఫీసర్ - +91 9643723157, జావేద్ హుస్సేన్, లైజన్ ఆఫీసర్- +91 9910014749 , సిహెచ్ చక్రవర్తి, పౌరసంబంధాల అధికారి- +91 9949351270.

# ఎన్టీఆర్ యూనివర్స్ సక్సెస్ సెలబ్రేషన్స్




తెలుగు నట దిగ్గజం ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలను దేశ విదేశాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలన్నీ దిగ్విజయంగా సాగాయి. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ యూనివర్స్ సక్సెస్ సెలబ్రేషన్స్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్, టీడీపీ పొలిటికల్ సెక్రటరీ టీజీ జనార్ధన్, టీఎఫ్ పీసీ సెక్రటరీ, ప్రొడ్యూసర్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నందమూరిరామకృష్ణ మాట్లాడుతూ, తెలుగు వారి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన మహానుభావుడు ఎన్టీఆర్. సినీ రంగంతో పాటు రాజకీయాల్లోనూ తన ప్రత్యేకత చూపించారు. ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాలు ఉన్నాయని నిరూపించారు. ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకల్ని దేశ దేశాల్లో ఘనంగా నిర్వహించుకున్నాం. ఆ సక్సెస్‌ను పురస్కరించుకుని ఎన్టీఆర్ యూనివర్స్ సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించుకుంటున్నాం. ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్న మా టీడీ జనార్ధన్‌కి ఇతరులకు నా అభినందనలు తెలియజేస్తున్నా. మేము విదేశాలకు వెళ్లినప్పుడు అక్కడి తెలుగు వారు ఎన్టీఆర్ పట్ల చూపించిన అభిమానం మాటల్లో చెప్పలేనంత సంతోషాన్ని కలిగించింది. ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ ఉన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను, ఆయన స్ఫూర్తిని ఇలాంటి కార్యక్రమాల ద్వారా మరింతగా తెలుగు ప్రజలకు చేరువచేయాలి అన్నారు.

ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ టీడీ జనార్ధన్ మాట్లాడుతూ, ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం కార్యక్రమాన్ని విజయవాడలో ప్రారంభించాం. మొదటి కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో పాటు ఏఎన్నార్, కృష్ణ, చిరంజీవి, దగ్గుబాటి వారి కుటుంబాల నుంచి అతిథులుగా పాల్గొన్నారు. ఆ తర్వాత అమెరికాలో కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం గురించి తెలిసి దేశ విదేశాల్లోని అన్న అభిమానులు మా దేశంలో నిర్వహిస్తాం అంటూ ముందుకొచ్చారు. అలా దుబాయ్, సింగపూర్, బహ్రెయిన్, కువైట్, సౌదీ అరేబియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి 8 దేశాల్లోని 13 నగరాల్లో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం జరిపారు. ఇటీవల ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో జరిగిన కార్యక్రమాల్లో రామకృష్ణ గారు, చంద్రమోహన్ రెడ్డి, నర్సిరెడ్డి, నారా రోహిత్, బోడె ప్రసాద్ పాల్గొన్నారు. ప్రపంచ సినీ చరిత్రలో ఎన్టీఆర్ వంటి గొప్ప నటుడు లేరు. ఆయన గొప్పదనం ఈతరం వారికి తెలిసేలా మొదట్లో ఒక వెబ్ సైట్ లాంచ్ చేశాం. ఏపీలో చంద్రబాబు ఎన్టీఆర్ జయంతి రోజైన మే 28ని సెలవు దినంగా ప్రకటించారు.

టీఎఫ్ పీసీ సెక్రటరీ, ప్రొడ్యూసర్ ప్రసన్నకుమార్ ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం దేశ దేశాల్లో ఘనంగా జరగడం సంతోషకరం. నటుడిగా, ప్రజా నాయకుడిగా ఎన్టీఆర్ గురించి ఎన్నేళ్లయినా చెప్పుకోవచ్చు. సినీ రంగంలో హీరోగా వెలుగుతు న్నప్పుడు బాలీవుడ్, హాలీవుడ్ నుంచి ఆఫర్స్ వచ్చినా మన తెలుగు సినీ రంగం, తెలుగు ప్రేక్షకులకే నా నటన అంకితమని చెప్పి ఆ అవకాశాలు తిరస్కరించిన ఏకైక నటుడు ఎన్టీఆర్. ఇప్పుడు

# 'మెగా157' ముస్సోరి షూటింగ్‌లో నయనతార

మెగాస్టార్ చిరంజీవి, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి మోస్ట్ అవైటెడ్ మెగా157 చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముస్సోరీలో జరుగుతోంది. చిరంజీవి సరసన కథానాయికగా నటిస్తున్న నయనతార ముస్సోరీలో షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. కథా పరంగా, తన పాత్రపై ఎంతో ఆనందంగా వున్న నయనతార, సినిమా ప్రమోషన్‌ల్లో చురుకుగా పాల్గొనాలని నిశ్చయించుకున్నారు. ఇటీవలే ఆమె ఒక ప్రత్యేక ప్రమోషనల్ వీడియో చేశారు. దీనికి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. రాబోయే ప్రచార కార్యక్రమాల్లో నయనతార అదరగొట్టబోతున్నారు. కమర్షియల్ ఫార్మాట్లలో హిలేరియస్ ఎంటర్ టైనర్స్ చిత్రాలను రూపొందించడంలో మాస్టర్ అయిన అనిల్ రావిపూడి ప్రమోషనల్ కంటెంట్‌ను రూపొందించడంలో స్పెషలిస్ట్. ఇప్పటివరకు ప్రతి ప్రమోషనల్ వీడియో మంచి ముద్ర వేసింది. ఇటివలే రిలీజ్ చేసిన వీడియోలో చిరంజీవి వింటేజ్ అవతార్‌లో కనిపించారు. ఈ చిత్రానికి సమీర్ రెడ్డి సినిమాటోగ్రాఫర్. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్. ఎస్. కృష్ణ, జి. ఆది నారాయణ కో రైటర్స్. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. మెగా157 మూవీ 2026 సంక్రాంతికి విడుదల కానుంది. నటీనటులు: మెగాస్టార్ చిరంజీవి, నయనతార, వీటీవీ గణేష్

సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం అనిల్ రావిపూడి, నిర్మాతలు: సాహు గారపాటి సుస్మిత కొణిదెల, బ్యానర్లు: షైన్ స్క్రీన్స్: గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ సమర్పణ: శ్రీమతి అర్చన సంగీతం: భీమ్స్ సిసిరోలియో డీవోపీ: సమీర్ రెడ్డి ప్రొడక్షన్ డిజైనర్: ఎ.ఎస్.ప్రకాష్ ఎడిటర్: తమ్మిరాజు, రచయితలు: ఎస్ కృష్ణ, జి ఆది నారాయణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ కృష్ణ, లైన్ ప్రొడ్యూసర్ నవీన్ గారపాటి అడిషినల్ డైలాగ్స్: అజ్జు మహంకాళి, తిరుమల నాగ్ చీఫ్ కో డైరెక్టర్: సత్యం బెల్లంకొండ, పీఆర్వో: వంశీ శేఖర్, మార్కెటింగ్: హాష్‌ట్యాగ్ మీడియా.



# నేడే 'కాంబో క్రేజీ' టైటిల్ గ్లింప్స్ విడుదల

నువ్విలా, జీనియస్, రామ్ లీలా, సెవెన్ వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ టాలెంటెడ్ హీరో హవీష్, సినిమా చూపిస్త మావ, నేను లోకల్, ధమాకా, మజాక వంటి సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు నక్కిన త్రినాథరావు కాంబోలో ఓ క్రేజీ మూవీ రూపొందుతోంది. ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ ను ఈ నెల 19న రిలీజ్ చేయబోతున్నారు. ఈ మూవీకి నిఖిల కోనేరు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.ఓ డిఫరెంట్



ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా హవీష్, నక్కిన త్రినాథరావు మూవీ తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతాన్ని అందిస్తుండగా, నిజార్ షఫీ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవలే ఫస్ట్ షెడ్యూల్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో మేకర్స్ వెల్లడించనున్నారు. నటీనటులు హవీష్, తదితరులు. టెక్నికల్ టీమ్: నిర్మాణం: హార్నిక్స్ ఇండియా ఎల్ ఎల్ పి, ఫైట్స్: రామకృష్ణ, ఎడిటర్: ప్రవీణ్ పూడి, డీవోపీ: నిజార్ షఫీ, సంగీతం: మిక్కీ జే మేయర్, స్టోరీ, డైలాగ్స్: విక్రాంత్ శ్రీనివాస్,మార్కెటింగ్: క్రేజీ షాట్.




# పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా 'సంయుక్త'

డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి నటిస్తున్న తన అత్యంత ప్రతిష్టాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్ షూటింగ్‌ను ప్రారంభించనున్నారు. హై ఆక్టేన్ కథలకు పాపులరైన పూరి, తన సిగ్నేచర్ మాస్, కమర్షియల్ స్టైల్‌ని విజయ్ సేతుపతి మాగ్నెటిక్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో బ్లెండ్ చేసి ఒక యూనిక్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతున్నారు. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ నిర్మిస్తారు. అన్ని ప్రీప్రొడక్షన్ ఫార్మాలిటీలు పూర్తయ్యాయి. ఈ సినిమాలోని కీలక నటీనటులను నిర్మాతలు ఒకరి తర్వాత ఒకరిని అనౌన్స్ చేస్తున్నారు. టబు, దునియా విజయ్ కుమార్ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పుడు, టాలీవుడ్ లక్కీ చార్మ్‌గా సంయుక్త ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఇది రెగ్యులర్ హీరోయిన్ పాత్ర కాదు. సంయుక్త పాత్ర కథనంలో కీలకంగా ఉంటుంది. ఎమోషనల్ డెప్త్, పెర్ఫార్మెన్స్‌కి స్కోప్ వుండే పాత్రలో కనిపించబోతున్నారు. కథ, ఆమె పాత్రతో సంయుక్త చాలా థ్రిల్ అయ్యింది. షూటింగ్ స్టార్ట్ చేయడానికి ఆసక్తిగా వుంది. ఫస్ట్ షెడ్యూల్ కోసం లొకేషన్లను ఖరారు చేయడానికి టీం ఇటీవల హైదరాబాద్, చెన్నైలలో రెక్కీని పూర్తి చేసింది. జూన్ చివరి వారంలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించే ఈ పాన్‌ఇండియా ప్రాజెక్ట్ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో విడుదలకానుంది. తారాగణం: విజయ్ సేతుపతి, సంయుక్త, టబు, విజయ్ కుమార్. సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: పూరి జగన్నాథ్ నిర్మాతలు: పూరి జగన్నాథ్, చార్మి కౌర్.

# 'తమ్ముడు' నుంచి 'భూ అంటూ భూతం' సాంగ్

ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రెస్టీజియస్ మూవీ తమ్ముడు. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న తమ్ముడు సినిమా వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ భూ అంటూ భూతం.. రిలీజ్ చేశారు. మేనకోడలు బేబి దిత్యకు మేనమామ నితిన్ ధైర్యం చెప్పే సందర్భంలో ఈ పాటను చిత్రీకరించారు. భూ అంటూ భూతం.. పాటను అజనీష్ లోకనాథ్ బ్యూటిఫుల్‌గా కంపోజ్ చేయగా, అనురాగ్ కులకర్ణి, అక్షిత పోల ఆకట్టుకునేలా పాడారు. సింహాచలం మన్నేలా లిరిక్స్ రాశారు. భూ అంటూ భూతం.. పాట ఎలా ఉందో చూస్తే భూ అంటూ భూతం వస్తే ఆగకే అమ్మాడీ, ఛూమంత్రం వేసి దాంతో బొమ్మలాటలాడాలి. భూ అంటూ భూతం వస్తే ఆగకే అమ్మాడీ, ఛూ మంత్రం వేసి దాంతో బొమ్మలాటలాడాలి..పుట్టగానే నేరుగా నువు పరుగెత్తలే, పట్టుకుంటూ పడుతూ నడకేనేర్చావే, భయపడి అడుగు ఆపకే..అంటూ సాగుతుందీ పాట. నటీనటులు నితిన్, లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, స్వసిక విజయన్, బేబీ శ్రీరామ్ దిత్య, తదితరులు. టెక్నికల్ టీమ్: సినిమాటోగ్రఫీ కేవీ గుహన్ ఎడిటింగ్: ప్రవీణ్ పూడి, మ్యూజిక్: అజనీష్ లోకనాథ్, పీఆర్వో: వంశీ కాకా, జీఎస్ కే మీడియా, బ్యానర్: శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్.





మిర్నా మీనన్ నయా లుక్

# '8 వసంతాలు' ప్రి రిలీజ్ ఈవెంట్

పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన 8 వసంతాలు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమోతోంది. ఈ చిత్రానికి ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించారు.అనంతిక సునీల్‌కుమార్ లీడ్ రోల్ పోషించారు. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన 8 వసంతాలు సోల్‌ఫుల్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతోంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం జూన్ 20న వరల్డ్ వైడ్ విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రిరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రిరిలీజ్ ఈవెంట్‌లో డైరెక్టర్ ఫణీంద్ర నర్సెట్టి మాట్లాడుతూ, అందరికి నమస్కారం. మైత్రి మూవీ మేకర్స్ నవీన్ గారు, రవి చాలా అద్భుతమైన వ్యక్తులు. చిన్న సినిమా పెద్ద సినిమాని కాదు... గొప్ప విషయం. ఈ సందర్భంగా మా టీం తరఫున వారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. మంచి కథ ఉంటే మైత్రిలోకి ఎలాగోలా రావచ్చు. సినిమాకి పని చేసిన నటీనటులకు టెక్నీషియన్స్‌కి అందరికీ పేరుపేరు నా ధన్యవాదాలు. అనంతిక ఈ సినిమా చేయడానికి డబ్బు కూడా అక్కర్లేదని చెప్పింది. టాలెంట్ కంటే ఇలాంటి పాషన్ ఉండడం చాలా గొప్ప విషయం. ఒక 17 ఏళ్ల అమ్మాయికి డబ్బు సంపాదించుకోవడం తెలుసు, వద్దు అనుకోవడం తెలుసు. ఇది చాలా గొప్ప విషయం. తను చాలా గొప్ప పెర్ఫార్మర్ అవుతుంది. శుద్ధి అయోధ్య పాత్రలో అద్భుతంగా నటించింది. ఈ సినిమా ఓపెన్ సీక్వెన్స్ మిస్ అవ్వొద్దు. సినిమా అంతా రివర్స్‌లో వెళ్తుంది. అందుకే ఓపెనింగ్ సీక్వెన్స్ ఎవరు మిస్ అవ్వద్దు అని కోరుతున్నాను. చాలా మంది కమర్షియల్ సినిమా తీయొచ్చు కదా అంటున్నారు. పెన్ ఓ పదినిమిషాలు పక్కన పెట్టి ఈ ప్రేమ, మనసుకు సంబంధించిన విషయాలు ఎందుకని ఆలోచిస్తే ఎలా ఉంటుందో వారణాసిలో ఫైట్ చూస్తారు. ఇంత బలంగా చెప్పడానికి కారణం ఆలోచన, టీం వర్క్. కమర్షియల్ సినిమా తీయలేక కాదు తీయాలని లేక. నాకు ఆడియన్స్‌పై ఎప్పుడూ నమ్మకం వుంది. తప్పకుండా ఈ ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారు. సినిమా చూసిన తర్వాత ప్రేమ తత్వం బోధపడుతుంది. ప్రేక్షకుడిగా థియేటర్‌కి వెళ్ళిన ప్రేక్షకులు ప్రేమికులిగా తిరిగివస్తారు. జూన్ 20న తప్పకుండా సినిమా థియేటర్స్‌లో చూడాలని కోరుతున్నాను అన్నారు. హీరోయిన్




అనంతిక మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. అయోధ్య లాంటి గొప్ప పాత్రలో నన్ను నమ్మిన ఫణింద్రకి ధన్యవాదాలు. ఇప్పటి వరకు నాలుగైదు సినిమాలు చేశాను. కానీ ఇలాంటి ఎక్స్పీరియన్స్ నా జీవితంలో ఎప్పుడూ లేదు. ఇదంతా ఒక డ్రీమ్ లాగా ఉంది. శుద్ధి లాంటి స్ట్రాంగ్ క్యారెక్టర్ చేస్తానని అని ఎప్పుడూ అనుకోలేదు. ఫణి వల్లే సాధ్యమైయింది. యాక్షన్ ఎమోషన్ లవ్ అన్ని ఎలిమెంట్స్ ఉన్న సినిమా ఇది. అయోధ్య పాత్రకు చాలా డీప్‌గా కనెక్ట్అయ్యాను. ఆడియన్స్ కూడా అలా డీప్‌గా కనెక్ట్ అవుతారని నమ్ముతున్నాను. చాలా స్పెషల్ మూవీ ఇది. మైత్రి లాంటి బిగ్గెస్ట్ ప్రొడక్షన్ హౌస్‌లో పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. ఎంతోమంది హీరోయిన్స్ ఉన్నప్పటికీ ఈ క్యారెక్టర్‌లో నన్ను బిలీవ్‌చేసిన మైత్రి మూవీ మేకర్స్‌కి థాంక్యూ. మీ జర్నీలో చాలా సపోర్ట్ చేశారు. విశ్వ చాలా విజువల్స్ ఇచ్చారు. ప్రతి ఫ్రేం ఒక పెయింటింగ్ లాగా ఉంటుంది. ఈ సినిమాలో పని చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమా తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది.

మంచి సినిమానా కాదా అనేది చూస్తారు. ఒక మంచి సినిమా వస్తే చేస్తారనే దానికి నేనే నిదర్శనం. మనిషిని మనిషిగా చూడటం చాలా కష్టం. మైత్రి మూవీ మేకర్స్ మనిషిని మనిషిలాగా చూస్తారు. అందుకే ఇండియాలో బిగ్గెస్ట్ ప్రొడక్షన్ హౌస్‌గా వున్నారు. ఈ సినిమాతో ఒక మంచి నిర్మించారనే పేరు వారికి వస్తుందని ఖచ్చితంగా చెప్పగలను. చాలా మంది కొత్తవారికి ఉనికిని ఇచ్చారు. ఇది డబ్బు కంటే చాలా

# 'కుబేర' లాంటి కథ చెప్పడం ఆనందంగా ఉంది

సూపర్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున, రష్మిక మందన్న, హైలీ యాంటిసిపేటెడ్ పాన్‌ఇండియా మూవీ శేఖర్ కమ్ముల కుబేర. అద్భుతమైన తారాగణంతో కుబేర ఇండియన్ సినిమాలో గేమ్‌ఛేంజర్‌గా నిలవబోతోంది. ఇప్పటికే విడుదలైన కుబేర ప్రమోషనల్ కంటెంట్‌కి ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. పోయిరా మామ, ట్రాన్స్ ఆఫ్ కుబేర, పీపీ డమ్ డమ్ సాంగ్స్ చార్ట్ బస్టర్ రెస్పాన్స్‌తో మ్యూజిక్ చార్ట్స్‌లో టాప్ ట్రెండింగ్‌లోవున్నాయి. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి శీజుదిలిలిశపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని హై బడ్జెట్ హై ప్రొడక్షన్ వాల్యూస్ తో నిర్మిస్తున్నారు. కుబేర తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషలలో జూన్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ శేఖర్ కమ్ముల విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

**కుబేర తీయడానికి మోటివేషన్ ఏమిటి?** మోటివేషన్ అంటూ ఏం లేదు కానీ ఇది ఒక ఇంట్రెస్టింగ్ లైన్ అనిపించింది. ఒక సూపర్ రిచ్ ప్రపంచం, ఇంకొకటి అట్టడుగున ఉండే ప్రపంచం.. బిలినియర్ వర్సెస్ బెగ్గర్.. అది ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. నిజానికి ఇది కథగా చెప్పడం చాలా కష్టం. చాలా పెద్ద పాయింట్. అది మెల్లగా ఇవాల్వ్ అయిన ఒక ఎమోషనల్ థ్రిల్లర్ తయారయింది. అక్కడ నుంచి డెవలప్ చేయడం జరిగింది. ఈమధ్యకాలంలో చాలా సినిమాలు కథలు వస్తున్నాయి కానీ ఇలాంటి ఒక కథ నేను చెప్పినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి కథ డెఫినెట్‌గా చెప్పబడాలి. ఈ కథ అవేర్నెస్‌ని తీసుకొస్తుంది. మంచి థ్రిల్లింగ్ పాయింట్.

**ఈ కథకు నాగర్జున గారే కావాలి మీరు పట్టుపట్టారని తెలిసింది?** కొన్ని షేడ్స్ ఉన్న క్యారెక్టర్స్ నాగార్జున చేస్తే బాగుంటుంది. ఈ క్యారెక్టర్‌కి ఆయన పర్ఫెక్ట్ యాప్ట్. ఆయనని స్క్రీన్ మీద చూసినప్పుడు ఒక వావ్ ఫ్యాక్టర్ ఉంటుంది. అయితే ఇందులో ఆయన్ని ఒక వేరే విధమైన యాక్టింగ్, మేనేజర్స్‌తో క్యారెక్టర్‌కి తగ్గట్టుగా చూపించడం జరిగింది.

**కుబేర పాత్ర కోసం ధనుష్‌ని ఎంపిక చేయడానికి కారణం?** ఈ క్యారెక్టర్‌ని ఆయన తప్పితే ఎవరూ చేయలేరు. సినిమా చూసిన తర్వాత ఆడియన్స్ ఇదే మాట చెబుతారు. అంతా అద్భుతంగా పెర్ఫాం చేశారు. అవుట్ స్టాండింగ్ పర్ఫామెన్స్ అనేది చిన్న మాట. ఆ క్యారెక్టర్‌లో ఇంకా ఎవరిని ఊహించలేరు.



డైరెక్టర్ శేఖర్ కమ్ముల

# ఒంటరి మహిళలకు ఉపాధి

**ఒక పక్క భర్త చనిపోయిన ... మరో పక్క కుటుంబ పోషణ ఇలాంటి పరిస్థితుల్లో ఎవరిపై ఆధారపడాలో తెలియక ఎంతోమంది మహిళలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటారు. వాళ్లను చూసి చలించిపోయారు ఉమాకార్తీక్ వాళ్లకు తనవంతు సహాయం చేస్తున్నారు. ఎలాగంటే.**



తన పుట్టిపెరిగింది హైదరాబాద్ తండ్రి ప్రైవేటు ఉద్యోగి, నలుగురు సంతానం. దాంతో ఆమె ఇంటర్ నుంచే చదువుకుంటూ ఉద్యోగం చేసేవారు. డబ్బుల్లేక ఫీజు కట్టలేని పరిస్థితుల్లో తెలిసిన వాళ్ల సాయం కోరేవారట. అలా డిగ్రీ పూర్తిచేసి బ్యాంక్‌లో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం తెచ్చుకున్నారు తన సంపాదనలో కొంత మొత్తం అవసరమైన వాళ్లకి ఇచ్చేవారట. పెళ్లి, పిల్లలు పుట్టడంలో ఉద్యోగం మానేశారు కుటుంబ బాధ్యతల్లో పడిపోయిన ఆమెనీ కొవిడ్ మళ్లీ సామాజిక సేవవైపు నడిపించింది. 'మా బంధువుల్లో ఒక అమ్మాయికి పెళ్లై రెండేళ్లే కొవిడ్‌లో భర్త చనిపోయారు. ఆమె ఇద్దరు పిల్లలు చదువు లేదు అత్తింటి వాళ్లు ఆదుకోలేదు. తల్లిదండ్రులు



చనిపోవడంతో పుట్టింటికి వెళ్లలేకపోయింది. ఫోన్ చేసి ఎలా ఉన్నావని అడిగితే తన బాధ చెప్పుకొని ఏడ్చింది తెలిసిన వాళ్ళు ఇంకొకరిదీ ఇదే పరిస్థితి తల్లీ, తండ్రీ ఇద్దరూ కొవిడ్ వల్ల చనిపోయారు. పిల్లలు అనాధల య్యారు. ఎవ్వరూ పట్టించుకోలేదు. అనాధశ్రమంలో చేర్చారు. ఇలాంటి ఘటనలు చాలానే చూశా నంటారు ఉమ. అప్పుడే భర్త చనిపోయి, కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్న మహిళల్ని అదుకోవాలను కున్నారు. ఫీజు కట్టలేక చదువు ఆపేసిన పిల్లలని ఎంపిక చేసుకున్నారు. తను పొదుపు చేసిన వాళ్ల చదువులకు ఖర్చుబెట్టడం మొదలుపెట్టారు. అయితే మొదట సాయం చేస్తే చాలసుకున్నారట. ఆ ఇద్దరు ముగ్గురై నలుగురై ఇప్పటి వరకు 100 మందికి ఫీజులు కట్టారు. ఆ ఒంటరి మహిళలకు ఉపాధి కూడా చూపిస్తున్నారు. ఆమె చేస్తున్న పని నచ్చి సాయం చేయడం మొదలుపెట్టారు ఒక టీమ్‌గా ఏర్పాటై 'ఆర్‌జె ఇన్‌స్పిరేషన్ హ్యాండ్' ఎన్జీవోనూ ఏర్పాటు చేశారు. బంధువులు, మిత్రుల నుంచి డొనేషన్లు సేకరించి అవసరమైననవాళ్లకి అందిస్తున్నారు. 'సాయం చేయడం ఎంత ముఖ్యమో .. అది నిజం చేయడం ఎంత ముఖ్యమో.. అది నిజంగా అవసరమున్న వాళ్లకి అందిస్తున్నారు. వాళ్ళకే చేరుతోందా అన్నది చూడటమూ అంతే ముఖ్యం అంటారామె. అందుకే తనని ఆశ్రయించిన వారింటికి వెళ్లి, పరిస్థితులు తెలుసుకుని సహకరిస్తున్నారు. వారంలో రెండు రోజులు దానికి కేటాయిస్తున్నారట. అలు ఇల్లాలిగా, ఇటు సమాజ సేవకురాలిగా ఒంటరి మహిళల్ని ఆదుకుంటోన్న ఉమ ప్రయత్నం అభినందించదగినదే కదూ. ▫

# ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెన

**ఎత్తైన పర్వతాలు, సూదుల్లా గుచ్చే చలిగాలులు... అత్యంత క్లిష్టమైన వాతావరణం. కానీ అవేమీ లెక్కచేయలేదు. ఉక్కు సంకల్పంతో బృందంతో కలిసి 17 ఏళ్లు అహోరాత్రులు శ్రమించారు. చేపట్టిన ప్రాజెక్టును పూర్తిచేశారు... దానికి కన్సల్టెంట్‌గా వ్యవహరించిన గాలి మాధవీలత. కష్టతరమైన ఆ ప్రాజెక్టే చినాబ్... కాశ్మీర్‌ను దేశంలోని ఇతర ప్రాంతాలతో కలిపే ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెన. భారతీయ ఇంజినీరింగ్‌లోనే గొప్ప మైలురాయి. ఆ అద్భుత నిర్మాణం గురించి తెలుసుకుందాం..**



జమ్మూశ్రీనగర్ రైల్వే లైన్‌ను అనుసంధానించాలనేది 130 ఏళ్ల నాటి కల. ఎట్టకేలకు సాకారమైంది. భారతీయ రైల్వే 2004లో ఉధంపూర్ బారాముల్లాల్ని కలిపే రైలు మార్గంలో చినాబ్ పైన వంతెన నిర్మించాలనుకుంది. అలాంటి ప్రతిష్టాత్మక నిర్మాణంలో నేనూ భాగమవడం గర్వంగా ఉంది. ఈ వంతెన చినాబ్ నదికి 359 మీటర్లఎత్తులో ఉంది. అంటే, ఐఫల్ టవర్ కన్నా 35 మీటర్ల ఎత్తు ఎక్కువ అయితే ఈ వంతెన నిర్మాణం అంత తేలికగా సాధ్యం కాలేదు. 2005లో ఆ స్థలాన్ని సర్వే చేయడానికి కొంతదూరం పడవలోనూ పర్వతాల దగ్గరకు కాలినడకనా వెళ్లాల్సి వచ్చింది. అక్కడికి చేరుకోవడమే దుసాహసం అనిపించింది. పాకిస్థాన్‌కి సమీపంలోని అత్యంత సున్నితమైన ప్రదేశం. అప్పుడే అర్థమైంది. ఇది అనుకున్నంత సులభం కాదని, వీటికితోడు విదేశాల్లో ఈ ప్రాజెక్టు గురించి వివరించేందుకు వెళ్లినప్పుడు అసాధ్యం అనేవారంతా. కానీ సాధ్యం చేసి చూపించాం. అదీ పూర్తిగా ఇండియన్ టెక్నాలజీతోనే.



**అడుగడుగునా సవాళ్లు...** ఎత్తైన రెండు కొండలు. కింద నది. వాటి మధ్యలో వంతెన నిర్మించాలి. కొండల్ని చెక్కేటప్పుడు రాళ్ల రహస్యాలెన్నో బయటపడేవి. రాళ్ల మధ్య పెద్ద పెద్ద కుహరాలు కనిపించేవి. వాటిని సవరించకపోతే కొండ చరియలు విరిగిపోతాయి. సిమెంట్‌తో గ్రౌటింగ్ చేసి ఖాళీల్ని పూరించాం రాళ్లు పడిపోకుండా ఊతంకోసం స్టీల్ యాంకర్లను అమర్చాం. ఆ రాళ్లతీరు అర్థంగాక స్టీల్ మాంకర్ల పొడవూ అమరికా.. ఝుల్లీ మళ్లీ లెక్కించాల్సి వచ్చేంది. ఎప్పటికప్పుడు ప్లాన్ మార్చుకోవాల్సి వచ్చేది. దాంతో 'డిజైన్ యాజ్ యూ గో' పద్ధతినే అనుసరించాం. పైగా భూకంపాలు ఎక్కవగా వచ్చే ప్రాంతం. దాంతో పునాదుల్ని లోతుగా వేయాల్సి వచ్చింది. వంతెన పై భాగంలో గంటకు 260 కి.మీ. వేగంతో వీచే గాలులు.. వాటినీ దృష్టిలో పెట్టుకుని 120 ఏళ్ల వరకూ ఎలాంటి సమస్యా రాకుండా నిర్మించాం.

**కుటుంబంతో కశ్మీర్‌కి...**.మాది ప్రకాశంజిల్లా ఏరుగుండ్లపాడు. ఇంటర్ వరకూ ప్రభుత్వ స్కూలు, కాలేజీల్లోనే చదివా.. ఇంజినీరింగ్ జేఎన్టీయూ కాకినాడలో చేశాను. వరంగల్ నిట్‌లో ఎంటెక్ చేశా. మద్రాస్ ఐఐటీలో పీహెచ్‌పీ చేసి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)లో రాక్ మెకానిక్స్‌లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ చేశాను.




గువాహటి ఇంటిలో ఏడాదిపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేశా. ఆ తరవాత బెంగళూరు ఐఐఎస్‌లో చేరా. ప్రస్తుతం హెచ్‌పీజీ ప్రొఫెసర్‌గా ఉన్నా అక్కడే సెంటర్ కొండ సస్టెయినబుల్ టెక్నాల్యూయాషన్ ఛైర్‌పర్సన్‌గా అనేక ప్రాజెక్టులకు నాయకత్వం వహించారు. బయట ఈ వంతెన నిర్మాణ బాధ్యతను నార్త్ రైల్వే ఆఫ్కాన్స్ సంస్థకు ఇచ్చింది. ఆ సంస్థకు జియో కలిపి టెక్నికల్ కన్సల్టెంట్‌గా ఉండటంతో ప్రాజెక్టులో పనిచేసే అవకాశం వచ్చింది. రాక్ మెకానిక్స్‌లో ఉన్న బారిగా అనుభవం వల్లే రివాబ్ ప్రాజెస్ట్ బాధ్యతల్ని విజయవంతంగా నిర్వర్తించా. 2022లో నిర్మాణం పూరి పూర్తయింది. దాదాపు 17 సంవత్సరాల తరువాత ట్రయల్ రన్లు జరిగాయి. ప్రతిష్టాత్మక ఈ ప్రాజెక్టు కోసం ఎన్నో త్యాగాలు చేశా. ఎప్పుడంటే అప్పుడు వెళ్లాల్సి వచ్చేది. నాకు మొదటిసారి 2006లో బాబు పుట్టాడు. అలాగే వెళ్లేదాన్ని ఈ ప్రయాణంలో మావారు హరిప్రసాద్ రెడ్డి, పిల్లలు శౌర్య అభిజ్ఞ ఎంతో సహకరించారు. మొదట్లో అక్కడకు వెళ్లడానికి రోడ్డు మార్గం కూడా లేదు. జమ్మూ వరకూ వెళ్లి అక్కడి నుంచి కాత్రాకి మరో వాహనంలో చినబ్ దగ్గరకు వెళ్లాల్సి వచ్చింది. ప్రాజెక్టు ప్రారంభమయ్యాకే రోడ్డు వేశారు. కొండగాలి ఈడ్చి కొట్టేది కొన్ని రోజుల వరసగా నాలుగైదు రోజులు నిద్ర ఉండేది కాదు అయితేనేం వ్యూహాత్మక ప్రణాళికలతో ప్రారంభం నుంచి తుది వరకూ ప్రాజెక్టులో కోలగా ఉండటం ఆనందాన్ని మిగిల్చింది. నిర్మాణ సమయంలో ఎన్నోసార్లు ఆ బ్రిడ్జి మీదకు వెళ్లా. అంతెత్తులో చల్లగాలినీ ఆస్వాదిచం. ఇప్పుడూ వంతెన మీదుగా అందిరిలానే నేనూ కుటుంబంతో కలిసిరైల్లో కశ్మీర్‌ను దర్శించాలనుకుంటున్నా.




# జిగేల్ జిలేబీ నెక్లెస్



పెళ్ళో, పేరంటమో మెడ నిండుగా నగలు వేసుకుంటే ఆ అందమే వేరు. అలాగని ఒకటికి మించి మరొకటి పెట్టుకోవడాన్ని ఇష్టపడటం లేదు. మీరూ అంతేనా! అయితే, మిమ్మల్ని ఈ జిలేబీ నెక్లెస్ కచ్చితంగా మెప్పిస్తుంది. జిలేబీ ఏంటి, నెక్లెస్ ఏంటి అనుకుంటున్నారా? మనందరం వేడివేడిగా తినడానికి ఇష్టపడే తియ్యని జిలేబీ మాదిరిగానే ఈ నెక్లెస్ పట్టీనీ డిజైన్ చేస్తున్నారు. దాన్ని పోలి ఉంటుందనే ఈ పేరొచ్చింది. అటు సంప్రదాయాన్నీ ఇటు సౌందర్యాన్నీ ప్రతిబింబించేలా ఈ నెక్లెస్‌లను తీర్చిదిద్దుతున్నారు. ఈ పసిడి నగకు కుందన్లు, నవరత్నాలు, రాళ్లు... నిలిచిపోవడంతో.... ఒక్కటి పెట్టుకున్నా ధగధగలాడిపోవచ్చు. ఈ నెక్లెస్‌కి గుత్తపూసలు, మామిడిపిందెలు, బొట్లు... వంటి అలంకరణలు చేర్చి కొత్తదనం సృష్టిస్తున్నారు. వీటిని ఓసారి మీరూ చూసేయండి.





# పుస్తక పఠనం ఎంతో ప్రయోజనకరం

కొంతమంది పిల్లలు గట్టిగా బయటకు చదివితే నెమ్మదిగా చదవలేవా అంటూ తిడుతుంటాం. కానీ ఇలా పుస్తక పఠనం చేయడం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు. నిపుణులు. అవేంటంటే..



- పిల్లలు పుస్తకంలో పదాలను గుర్తిస్తూ బయటకు చదివేటప్పుడు వాటిని గుర్తుంచుకోవడానికి ప్రయత్నిస్తారు. అంతేకాదు విషయాన్ని సులభంగా గ్రహించగలుగుతారు. ఇది వారిలో జ్ఞాపకశక్తి పెంచుతుంది.
- .విని నేర్చుకునే వారిని ఆడియో లెర్నర్స్ అంటారు. ఇలాంటివారు దేన్నైనా శ్రద్ధంగా వినడానికి ప్రయత్నిస్తారు. వారిలో భాషానైపుణ్యం మెరుగుపడి చిన్నతనం నుంచే ఉచ్ఛారణ అలవాటు అవుతుంది. పదాలు సులభంగా నేర్చుకుంటారు.
- చాలామంది పిల్లలకు చదవమంటే చిరాకు వస్తుంది. అదే గట్టి చదువు అంటే మాత్రం ఎంతో హుషారుగా ఉంటారు. దీని వల్ల వారిలో ఉన్న ఒత్తిడి, ఆందోళనలు దూరం అవుతాయని అంటూన్నారు. ▫

## చెలి చిట్కా

వామును నీళ్ళలో నానబెట్టి ఆ నీటిలో కొద్దిగా ఉప్పు కలిపి తాగితే వాంతులు తగ్గుతాయి. ▫

# వ్యథ: బలవంతపు పెళ్ళి మంచిది కాదు



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

ప్రశ్న : మా అమ్మాయి ఆలోచనలు దారితప్పుతున్నాయి. చదువు, సంధ్య మానేసి ప్రేమ, దోమ అంటోంది. చాల కష్టపడి చదివి మెడిసిన్‌లో సీటు సంపాదించింది. మొదటి సంవత్సరంలోనే ఒక అబ్బాయి మోజులో పడింది. మార్కులు తగ్గడంతో అనుమానం వచ్చి ఆరాతీస్తే ఆమె ప్రేమ వ్యవహారం బయటపడింది. దీనితో ఇంటికి తీసుకుని వచ్చి మందలించాము. ఇక నుంచి బుద్దిగా చదువు కుంటానని చెప్పడంతో నమ్మి తిరిగి హాస్టల్లో పెట్టాము. అయినా ఆమె బుద్ధి మారలేదు. అబ్బాయితో కలిసి సినిమాలు షికార్లకు వెళ్లుతోంది. ఆమె స్నేహితుల ద్వారా విషయం తెలిసింది. దీంతో కొంత కఠినమైన నిర్ణయం తీసుకున్నాము. కాలేజి మాన్పించి పెళ్ళి చేస్తే మంచిదని భావించాము. మా బంధువులలో సన్నిహితులకు చెప్పాము. వారు కూడ మా నిర్ణయాన్ని సమర్ధించారు. మా మామకూడ అదే మంచిదన్నారు. పెళ్ళి చేస్తే పిచ్చికుదురుతుందని సామెత కూడ చెప్పారు. దీనితో మా బంధువుల అబ్బాయితో మాట్లాడి పెళ్లికి ఒప్పించాము. మా అమ్మాయి కూడ బలవంతం మీద సమ్మతించింది. వచ్చే నెలలో ముహూర్తం కుదిరింది. మేము పెళ్ళి ఏర్పాటున చేసుకుంటుండగా ఆమె తన ప్రియుడితో కలిసి వెళ్ళి పోయింది. గుడిలో పెళ్ళి చేసుకోవడానికి ప్రయత్నం చేశారు. అయితే మా అమ్మాయి 18 ఏళ్ళు, అబ్బాయికి 17 ఏళ్ళు కావడంతో యే గుడిలోను సమ్మతించలేదు. మేము పోలీసు లకు ఫిర్యాదు చేయడం వల్ల వారు వెదికి తమిళనాడులోని తిరుత్తణిలో పట్టుకున్నారు. అబ్బాయి తల్లితండ్రులను మమమల్ని పిలిపించి కౌన్సెలింగ్ చేసి పంపేశారు. అమ్మాయి ఇంటికి వచ్చినప్పటి నుంచి ముఖావంగా ఉంటోంది. సరిగా అన్నం తినడంలేదు. ఒంటరిగా తనగదిలోనే ఉంటోంది. ఈ విషయం పెళ్ళి చేయాలనుకుంటున్న అబ్బాయి, అతని తల్లితండ్రులకు తెలిసింది. అయితే వారికి సర్ది చెప్పాము. వారు కూడ క్షమించి పెళ్ళికి సమ్మతించారు. ఈ దశలో ఆమె మనసు మార్చి పెళ్లికి ఒప్పించే మార్గం చెప్పండి. - ఒక సోదరి, కడప



జవాబు : అమ్మా అమ్మాయి ప్రేమ పేరుతో వ్యామోహంలో పడింది అనడంలో సందేహం లేదు. అంత మాత్రాన ఇష్టంలేని వ్యక్తితో బలవంతంగా పెళ్ళి చేయడం ఎంత మాత్రం మంచిది కాదు. ఇటీవల ఇష్టంలేని పెళ్ళి చేసుకుని, ప్రియుడితో కలసి భర్తను చంపిన భార్యల సంఘటనలు కొనినన వెలుగు చేశాయి. ఒకామె విహార యాత్రకు తీసుకెళ్ళి కిరాయి గుండాలతో చంపిం చింది. ఒకామె భర్తకు విషయం పెట్టి హతమార్చింది. ఇలాంటి సంఘట నలు చూసిన తరువాత కూడ ఆమెకు బలవంతంగా పెళ్లి చేయడం తగదు. ముందు ఆమెకు అనుభవం ఉన్న సైకాల జిస్టు ద్వారా కౌన్సెలింగ్ చేయించండి. డిప్రెషన్ ఎక్కువగా ఉంటే సైకియాట్రిస్టు ద్వారా చికిత్స చేయించండి. ఆమె కోలుకున్న తరువాత తిరిగి కాలేజీకి పంపండి. తన లక్ష్యాన్ని గుర్తుచేసి, సాధస్తే వచ్చే ఫలితాలు వివరించండి. డాక్టరు అయిన తరువాత పెళ్లి చేసు కోమని చెప్పండి. ఆమె ఇప్పుడు వ్యామోహానికి గురై తప్పుడు నిర్ణయం తీసుకున్నది. కొంత వివేకం కలిగిస్తే చదువుపై దృష్టి పెడుతుంది. మెడిసిన్ పూర్తయే నాటికి పిజి చేయలన్న లక్ష్యం ఏర్పాటు చేసుకుం టుంది. కెరీర్ మీద దృషి పెట్టడంతో ప్రేమ, పెళ్ళి వ్యవహారాలు పక్కన పెడుతుంది. హోదా పెరిగిన తరు వాత తగిన వ్యక్తిని భర్తగా స్వీకరించా లని లక్ష్యంగా పెట్టుకుంటుంది. తన జీవితాన్ని సాఫీగా గడిపేందుకు ప్రయత్నిస్తుంది. సహజంగా ఆ టీనేజిలో అమ్మాయిలు, అబ్బాయిల్లో హార్మోన్ల ప్రభావం ఉంటుంది. ఎక్కువ అయిన వారు వ్యామోహానికి గురవుతుం టారు. అంత మాత్రాన తప్పు పట్టాల్సిన పనిలేదు. అలాంటి వారికి సరైన మార్గనిర్దేశం చేయడం పెద్దల బాధ్యత అన్న విషయం గుర్తించండి. ▫

# ఉప్పు ఏది వాడుతున్నారు?

ఎంత గొప్ప వంట చేసినా చిటికెడు ఉప్పు వేయకపోతే దాన్ని రుచి చూడలేం. అయితే, మనం ఒకప్పుడు కల్లుప్పునీ, ఈ మధ్యకాలంలో అయొడైజ్డ్ సాల్ట్‌నీ ఎక్కువ వాడుతున్నాం. కానీ, ఇందులోనూ బోలెడు రకాలున్నాయని తెలుసా?



**రాతి ఉప్పు:** హిమాలయన్ పిక్ సాల్ట్.. లేత గులాబీ రంగులో కనిపించే ఇందులో ఐరన్ ఆక్సైడ్ ఎక్కువగా ఉంటుంది. అందుకే దీనికా ఛాయ వచ్చింది. సాధారణ ఉప్పులో కంటే ఇందులో సోడియం తక్కువ. ఉప్పు తక్కువ వాడాలనుకునేవారు దీన్ని ఎంచుకుంటే మంచిది. సూపులు, సలాడ్లలో ఎక్కువగా వినియోగిస్తారు.

**కోషెర్ సాల్ట్ :** ముతకగా ఉండే ఈ ఉప్పుతో ఆహార పదార్థాలు నిల్వ చేస్తారు. కాక్‌టెయిల్ గ్లాసుల చుట్టూ పూయడానికీ వాడతారు. వేపుళ్లు, గ్రిల్ వంటకాలకు ముందు చికెన్, కూరగాయలు వంటివాటిని మారినేట్ చేసేందుకూ దీన్ని ఎక్కువగా వినియోగిస్తారు.

**సెల్టిక్ సాల్ట్ :** లేత బూడిద రంగులో ఉండే ఈ ఉప్పులో తేమ ఎక్కువ. సాధారణ ఉప్పుతో పోల్చితే దీనిలో ఖనిజాల గాఢత సోడియం తక్కువే. రుచినీ పెంచుతుంది.

**నల్లఉప్పు:** దీనిలో ఇనుము, ఇతర ఖనిజాలు ఉండటం వల్ల దీనికా పేరు వచ్చింది. చాట్, పానీపూరి పదార్థాల తయారీలో ఎక్కువగా వాడతారు.

**సీ సాల్ట్ :** ఇందులో ఖనిజాల మోతాదు ఎక్కువ. దీన్ని సాస్‌లు, మసాలా, గ్రేవీ కూరల్లో ఎక్కువగా వాడతారు. టాపింగ్, డ్రెస్సింగ్‌ల్లోనూ వినియోగిస్తారు.

# చోఖామేళా

ఆధ్యాత్మికం

సాయిబాబా **షిరిడీకి వచ్చినప్పుడు** ఖండేరావు గుడిలోనికి పోబోతుంటే, ఆ ఆలయ పూజారి మహల్సాపతి వారించాడు. సాయిబాబా అప్పుడు కోపం తెచ్చుకోకుండా.. నీ అభిమతాన్ని అనుసరించి నేను దూరం నుండే దర్శనం చేసుకుంటాలే! దానికి అభ్యంతరం లేదనుకుటాను. మీ పురాణాలలో ఒక కథ ఉన్నది. పంచముడైన చోఖామేళా పాండురంగనికి ప్రియమైనవాడు. పాండురంగని వద్ద పూజ చేసే పురోహితులకంటే వంద రెట్లు శ్రేష్ఠుడు. శ్రీహరి ద్వారాన్ని చేరుటకు శ్రద్ధతో ప్రయత్నంచేసేవారు తప్ప మిగిలిన అందరూ పంచములే! ఎవరి ఆంతర్యం పరిశుద్ధంగా ఉంటుందో, వాడు సర్వత్ర పరిశుద్ధుడే! అన్నాడు. మహారాష్ట్రలో చోఖామేళాను గూర్చి తెలియని వారుండరు. అతనిని పాండురంగని ఆలయంలోపలకు రానీయలేదు. కానీ అంతటా పాండురంగని చూచి మైమరచిపోయే భక్తుడు. ఒకనాడు ఒక గోడను కడుతూండగా, అది కూలటం వలన చోఖామేళా, మరి కొందరు మరణించారు. శవాలను తీయటానికి చాలా సమయం పట్టింది. సామూహిక దహనం చేశారు. నామదేవునితో పాండురంగడు 'నా భక్తుడు చోఖామేళా అతని సమాధి నా మందిరమునకు ఎదురుగా ఉండాలనే ఒకే ఒక్క కోరికతో జీవించాడు. ఆ కోర్కె తీర్చుట నా లక్ష్యం' అన్నాడు. చోఖామేళా ఎముకలను గుర్తించటం సాధ్యం కాదుకదా? అన్నాడు నామదేవు. పాండురంగడు చోఖామేళుని ఎముకలు సహితం నా నామాన్ని ఉచ్ఛరిస్తాయి అన్నాడు. నాదేవుడు ఆ ఎముకల గుట్ట దగ్గరకు వెళ్లి, ఒకొక్క ఎముకను చెవి దగ్గర పెట్టుకొని, ఏవి



అయితే పాండురంగని నాకు స్మరణ చేసినవో, వాటిని ఏరి తీసుకువచ్చి, పాండురంగని ఆలయమునకు ఎదురుగా చోఖామేళా సమాధిని నిర్మించాడు. చోఖామేళుని ఎముకలు రంగని నామాన్ని ఉచ్చరిస్తాయి. చోఖామేళుడు వైశాఖ బహుళ పంచమినాడు (మే నెల) దేహాన్ని త్యజించాడు. సాయిదేహాన్ని త్యజించాడు. మహా సమాధిని నిర్మించాడు. బొంబాయి నివాసియగు శ్రీమతి రుస్తుంజీ బాబా మహా సమాధిపై శిరమునుంచి బాబా నీవు జీవించి ఉన్నప్పుడు నా కష్టాలను కడతేర్చి నన్ను రక్షించినావు, ఇప్పుడు నాకు దిక్కెవ్వరు? అని రోదించగా ఆమెకు సమాధి నుండి రుస్తుంబేటా కబ్ ఆయా? అన్న మాటలు మూడుసార్లు వినిపించినవి. సాయి బాబా అంటారు నా ఎముకలు సహితము భక్తులతో మాట్లాడును.

- యం.పి.సాయినాథ్

## ఫీఫా క్లబ్ వరల్డ్ కప్‌లో రివర్ ప్లేట్ విజయం



**న్యూఢిల్లీ:** ఫీఫా క్లబ్ ప్రపంచ కప్‌లో రివర్ ప్లేట్ 3-1 తేడాతో టోర్నమెంట్‌ను విజయంతో ప్రారంభించింది. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ఆతిథ్యం ఇచ్చిన ఫీఫా క్లబ్ ప్రపంచ కప్-2025లో భాగంగా బుధవారం అర్జెంటీనా ప్రతినిధి రివర్ ప్లేట్ మరియు జపాన్ జట్టు ఉరావా రెడ్ డైమండ్స్ సియాటిల్‌లోని లుమెన్ ఫీల్డ్‌లో ఒకదానికొకటి తలపడ్డాయి. 12వ నిమిషంలో ఫకుండో కొలిడియో గోల్ చేయడంతో రివర్ ప్లేట్ 1-0 ఆధిక్యంలోకి వెళ్ళింది. ఈ ఫలితంతో మొదటి అర్ధభాగం ముగియగా, 48వ నిమిషంలో, ఉరావా రెడ్ డిఫెన్స్‌లో జరిగిన పెద్ద తప్పిదానికి సద్వినియోగం చేసుకున్న సెబాస్టియన్ డ్రూస్సీ, తన తలతో బంతిని నెట్‌లోకి పంపి, తేడాను 2కి పెంచాడు. మ్యాచ్ 58వ నిమిషంలో, యుసుకే మాట్సువో పెనాల్టీ గోల్‌తో స్కోరును 21కి తీసుకువచ్చాడు. 73వ నిమిషంలో, మార్కోస్ అకునా ఉపయోగించిన కార్నర్ కిక్‌లో, మాక్సిమిలియానో మెజా హెడర్‌తో నెట్‌ను కొట్టి అర్జెంటీనా జట్టుకు మళ్లీ 2విభిన్న ఆధిక్యాన్ని అందించాడు. మిగిలిన నిమిషాల్లో ఇతర గోల్స్ లేనప్పటికీ, రివర్ ప్లేట్ 3 పాయింట్లతో టోర్నమెంట్‌ను ప్రారంభించింది.

## మహిళల టి20 వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల

### 2026 జూన్ 14న భారత్, పాక్ మధ్య హైటెన్షన్ మ్యాచ్

**న్యూఢిల్లీ:** మహిళల టి20 ప్రపంచకప్-2026 షెడ్యూల్ ఖరారైంది. ఈ మేరకు దీనికి సంబంధించి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంగ్లండ్ వేదికగా 2026 జూన్ 12వ తేదీన ఈ టోర్నమెంట్ ప్రారంభంకానుంది. తొలిసారిగా ఈ టోర్నమెంట్‌లో 12 జట్లు పాల్గొంటున్నాయి. భారత్, ఆస్ట్రేలియా, పాకిస్థాన్, సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, శ్రీలంక, వెస్టిండీస్‌లతో పాటు గ్లోబల్ క్వాలిఫయర్స్ ఫలితాల ఆధారంగా మరో నాలుగు జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తాయి. జూన్ 12వ తేదీన తొలి మ్యాచ్ ఆతిథ్య ఇంగ్లండ్, శ్రీలంక మధ్య జరగనుంది. టోర్నమెంట్‌లో గ్రూప్1లో ఇండియా, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, పాకిస్థాన్ ఉన్నాయి. గ్లోబల్ క్వాలిఫయర్‌లో అర్హత సాధించిన జట్లు ఈ గ్రూప్‌లో చోటు దక్కించుకుంటాయి. లీగ్ దశలో జూన్ 14 నుంచి 28 వరకూ ఇండియా ఐదు మ్యాచ్‌లు ఆడనుంది. ఇందులో తొలి మ్యాచ్‌లో భారత్ చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. ఇక టోర్నమెంట్ సెమీఫైనల్స్ జూన్ 30, జులై 2 తేదీల్లో ఓవెల్ వేదికగా జరుగుతాయి. లార్డ్స్ వేదికగా ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. టి20 ప్రపంచకప్ 2026లో ఇండియా షెడ్యూల్ చూస్తే జూన్ 14న ఇండియా వర్సెస్ పాకిస్థాన్, 17న ఇండియా వర్సెస్ క్వాలిఫయర్, 21న ఇండియా వర్సెస్ సౌతాఫ్రికా, 25న ఇండియా వర్సెస్ క్వాలిఫయర్, 28న ఇండియా వర్సెస్ ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లు ఉన్నాయి.




## ఆసియా కప్: ఫైనల్స్‌కు భారత్ ఆర్చర్లు

**న్యూఢిల్లీ:** ఆసియా కప్-2026లో పురుషుల మరియు మహిళల ఫైనల్స్‌కు భారత కాంపౌండ్ ఆర్చర్లు దూసుకుపోయారు. ఆసియా కప్ లెగ్ 2లో భారత జూనియర్ కాంపౌండ్ ఆర్చరీ జట్టు తన ఆధిపత్యాన్ని ప్రదర్శించడం కొనసాగిస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ఈ ఈవెంట్‌లో యువ భారత ఆర్చర్ల నైపుణ్యం, స్థిరత్వం మరియు రికార్డు స్థాయి ప్రదర్శనలు కనిపించాయి. కుశాల్ దలాల్ పురుషుల ఫైనల్లోకి దూసుకెళ్లాడు. సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌కు చెందిన హిము బచ్చర్‌పై 147-143 తేడాతో విజయం సాధించి టాప్ సీడ్ కుశాల్ దలాల్ పురుషుల వ్యక్తిగత కాంపౌండ్ ఫైనల్‌లో స్థానం సంపాదించాడు. ఈ రౌండ్లలో అతని స్థిరమైన షూటింగ్ ఇప్పటికే పురుషుల విభాగంలో





భారత్‌కు కనీసం రజత పతకాన్ని ఖాయం చేసింది. మరో సెమీఫైనల్‌లో, 10వ సీడ్‌గా ఎలిమినేషన్ రౌండ్లలోకి ప్రవేశించిన భారత్‌కే చెందిన సచిన్ చెచీ, ఆస్ట్రేలియాకు చెందిన జాషువా మాచన్ చేతిలో ఓడిపోయాడు. చెచీ ఇప్పుడు కాంస్య పతకం కోసం బంగ్లాదేశ్‌కు చెందిన బచ్చర్‌తో పోటీ పడనున్నాడు. ఇక మహిళల వ్యక్తిగత కాంపౌండ్‌లో ఆల్ ఇండియన్ ఫైనల్ మహిళల కాంపౌండ్ ఆర్చరీలో భారత్ యొక్క బలమైన స్థానం షణ్ముఖి బుడ్డే మరియు తేజల్ సాల్వే ఫైనల్‌కు చేరుకుని, ఈ విభాగంలో భారతదేశానికి స్వర్ణం మరియు రజతం రెండూ లభించేలా చేశారు. 706 అర్హత స్కోరుతో టాప్ సీడ్ షణ్ముఖి, సెమీఫైనల్లో ఇండోనేషియాకు చెందిన యురికే నినా బోనిటా పెరీరాను 145-139 తేడాతో ఓడించింది. అలాగే క్వాలిఫైయింగ్ రౌండ్‌లో 700 పాయింట్లు సాధించిన రెండవ సీడ్ తేజల్ సాల్వే, మలేషియాకు చెందిన ఫాతిన్ నూర్ఫతేహ్ మట్ సల్లెహ్‌ను 147-142 తేడాతో ఓడించి ఫైనల్ లైనప్‌ను పూర్తి చేశాడు. ఈటోర్నమెంట్ ప్రారంభంలో, భారత జట్టు జూనియర్ కాంపౌండ్ విభాగంలో రెండు ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టింది. షణ్ముఖి, తేజల్ మరియు తనిష్క తోకల్‌లతో కూడిన మహిళల కాంపౌండ్ జట్టు మొత్తం 2101 పాయింట్లతో కొత్త ప్రపంచ రికార్డును నమోదు చేసింది. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో, కుశాల్, షణ్ముఖి అర్హతలో 1420 పాయింట్లతో మరో ప్రపంచ రికార్డును సృష్టించడం ద్వారా భారత్ కీర్తికి జోడించారు.




## ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్‌లో.. భారత్ స్టార్లకు రికార్డుల ఛాన్స్

### శుభ్‌మన్ కెప్టెన్సీపై ఉత్కంఠ

**న్యూఢిల్లీ:** భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. తొలి టెస్టు మ్యాచ్ 20 నుంచి 24 వరకు లీడ్స్‌లో జరగనుంది. ఈ సిరీస్ కోసం ఇప్పటికే ఇంగ్లాండ్ చేరుకున్న టీమ్‌ఇండియా ఆటగాళ్లు ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్‌లు సుదీర్ఘ ఫార్మాట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించిన తరువాత భారత జట్టు ఆడనున్న తొలి సిరీస్ ఇదే. ఈ క్రమంలో శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని భారత జట్టు ఎలా రాణిస్తుందోనన్న అందరిలో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో టీమ్‌ఇండియా ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్, సిరాజ్‌లు పలు రికార్డులు అందుకునే అవకాశం ఉంది. టీమ్‌ఇండియా టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టెస్టుల్లో 2వేల పరుగుల మైలురాయిని చేరుకునేందుకు మరో 107 పరుగులు అవసరం. ఇప్పటి వరకు గిల్ 32 మ్యాచ్‌ల్లో 35.05 సగటుతో 1893 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలు, 7 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అయితే ఇంగ్లాండ్‌లో గిల్ రికార్డు ఏమంత గొప్పగా లేదు. 6 ఇన్నింగ్స్‌ల్లో 88 పరుగులు మాత్రమే చేశాడు. ఇక టీమ్‌ఇండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ టెస్టుల్లో 2వేల పరుగుల మైలురాయిని చేరుకునేందుకు మరో 202 పరుగులు అవసరం. ఇప్పటి వరకు యశస్వి 19 టెస్టుల్లో 52.88 సగటుతో 1798 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు శతకాలు, 10 అర్ధశతకాలు ఉన్నాయి. అంతర్జాతీయ క్రికెట్‌లో 9వేల పరుగుల మైలురాయిని చేరుకునేందుకు కేఎల్ రాహుల్ దగ్గరగా ఉన్నాడు. ఇప్పటి వరకు రాహుల్ 215 మ్యాచ్‌ల్లో 8565 పరుగులు చేశాడు. ఇందులో 17 సెంచరీలు, 57 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. టీమ్‌ఇండియా వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ టెస్టుల్లో 3వేల పరుగులు పూర్తి చేసేందుకు మరో 52 పరుగులు అవసరం. ఇప్పటి వరకు పంత్ 47 టెస్టుల్లో 42.1 సగటుతో 2948 పరుగులు చేశాడు. ఇందులో 6 శతకాలు, 15 అర్ధశతకాలు ఉన్నాయి. స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కూడా ఓ ప్రత్యేక మైలురాయిని చేరుకోవాలని చూస్తున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 7వేల పరుగుల మైలురాయిని చేరుకునేందుకు జడేజాకు ఇంకా 309 పరుగలు అవసరం. అలాగే పేసర్ సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్‌లో 200 వికెట్ల క్లబ్‌లో చేరేందుకు కేవలం 15 వికెట్ల దూరంలో ఉన్నాడు. వీరంతా రాణిస్తే ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌లో అవార్డుల పంట పండించే ఛాన్స్ కలుగుతుంది.

## మహిళల వన్ డే సిరీస్ దక్షిణాఫ్రికాదే

### వెస్టిండీస్‌పై 166 పరుగుల భారీ విజయం

**న్యూఢిల్లీ:** మహిళల వన్ డే సిరీస్‌ను దక్షిణాఫ్రికా కైవసం చేసుకుంది. బార్బడోస్‌లోని కేవ్ హిల్‌లో నిర్ణయాత్మక మ్యాచ్‌లో వర్ష ప్రభావంతో దక్షిణాఫ్రికా మహిళలు వెస్టిండీస్ మహిళలపై డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 166 పరుగుల భారీ విజయాన్ని సాధించి సిరీస్‌ను గెలుచుకుంది. బుధవారం టాస్ ఓడి దక్షిణాఫ్రికాను బ్యాటింగ్‌కు ఆహ్వానించి ంది. కానీ లారా వోల్వార్ట్ మరియు టాజ్మిన్ బ్రిట్స్ మధ్య మొదటి వికెట్‌కు 184 పరుగుల ఆధిపత్య భాగస్వామ్యంతో పరిస్థితిని తలకిందులు చేశారు. జైదా జేమ్స్‌పై బౌండరీలు సాధించి, జానిలియా గ్లాస్గో బౌలింగ్‌లో ఒక సిక్స్ మరియు ఫోర్ బాదిన బ్రిట్స్ జట్టు ఈ చొరవను ఆరంభంలోనే అందిపుచ్చుకుంది. బ్రిట్స్, వోల్వార్డ్ అర్ధ




సెంచరీలు చేశారు. ఇద్దరూ కలిసి 100 పరుగుల భాగస్వామ్యాన్ని 13వ ఓవర్‌కు పెంచారు. బ్రిట్స్ 89 బంతుల్లో సెంచరీతో రాణించి, 91 బంతుల్లో 101 పరుగుల వద్ద అఫీ ఫ్లెచర్ చేతిలో, వోల్వార్డ్ 75 పరుగుల వద్ద ఔటయ్యారు. ఫ్లెచర్ కూడా 53 పరుగులకు 3 వికెట్లు పడగొట్టింది. దక్షిణాఫ్రికా తడబడినప్పుడు ఇన్నింగ్స్ మధ్యలో 200 పరుగులకే 1 వికెట్ నష్టానికి 6 వికెట్లకు 264 పరుగులు చేసినప్పటికీ, మారి జాన్ కాప్ దానిని సమర్థంగా ఎదుర్కొంది. ఆమె అజేయంగా 34 పరుగులు చేయడంతో దక్షిణాఫ్రికా 45.5 ఓవర్లలో 6 వికెట్లకు 278 పరుగుల వద్ద నిలిచింది, వర్షంతో ఇన్నింగ్స్‌ను ముందుగానే ముగించింది. డిఎల్ఎస్ ప్రకారం 288 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో వెస్టిండీస్ జట్టు కష్టాల్లో పడింది. ఫామ్‌లో ఉన్న కెప్టెన్ హేలీ మాథ్యూస్ 8 పరుగులకే ఔటైంది. మసాబాట క్లాస్ తొలి దశలోనే బౌలింగ్ ప్రారంభించి మొదటి రెండు ఓవర్లలోనే మూడు వికెట్లు పడగొట్టింది, దానికి నోన్కులులెకో మ్లాబా మరో రెండు వికెట్లు జోడించడంతో వెస్టిండీస్ 6 వికెట్లకు 40 పరుగులు చేసింది. ఏడో వికెట్‌కు 65 పరుగులు అందించిన ఆలియా అల్లీన్ (34) మరియు జహ్జారా క్లాక్సన్ కొద్దిసేపు పోరాడారు. కానీ క్లాస్ అసోసియేషన్‌ను దెబ్బతీసి 21 పరుగులకు 4 వికెట్లు పడగొట్టింది. వెస్టిండీస్‌ను 27.5 ఓవర్లలో 121 పరుగులకే ఆలౌట్ చేయడం ద్వారా సిరీస్ విజయాన్ని సాధించాడు.

## అత్యంత సంపన్న కుటుంబాల్లో అంబానీయే టాప్!



**న్యూఢిల్లీ, జూన్ 18:** దేశంలోఅత్యంత ధనవంతులుగా అంబానీ కుటుంబం నిలిచింది. అంబానీ కుమారులు ఆకాష్, అనంత్ అంబానీ లు ఒక్కొక్కరు రూ. 3.6లక్షల కోట్ల నికరవిలువతో భారతదేశంలో అత్యంత ధనవం తులుగా నిలిచారు. క్రిసిల్ సహకారంతో దేశంలోని వివిధ రంగాల్లో సేవలందిస్తున్న అత్యంత సంపన్నుల జాబితాను 360 వన్ వెల్త్ తయారు చేసింది. ఈ జాబితాలో అంబానీ కుటుంబమే అగ్రస్థానంలో నిలిచింది మన దేశంలో ఈ నివేదికలో 2,013 మంది భారతీయ సంపద సృష్టికర్తల గురించి వివరించారు. వీరి మొత్తం నికరవిలువ సుమారు రూ.100 లక్షల కోట్లుగా ఉంది. ఈ నివేదిక కనీసం రూ.5 బిలియన్ల నికర విలువ కలిగిన ధన వంతులను పరిగణలోకి తీసుకుంది. వీరిలో వ్యవస్థాపకులు, నిపుణులు, పెట్టుబడి దారులు, టాప్ కంపెనీల వారసు లు ఉన్నారు. వీరి సగటు నికర విలువ రూ.14.2 బిలియన్లు. ట్రాక్ చేయబడిన సంపదలో భారతదేశంలోని టాప్50 వ్యాపార సంస్థలు 59శాతం వాటా కలిగి ఉన్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ ఎంటర్ ప్రైజెస్ మాత్రమే 12 శాతం నియంత్రణ లో ఉన్నాయి. ఈ అధ్యయనం ప్రకారం సమగ్ర జాబితాలో కనీసం రూ.500 కోట్ల నికర విలువ కలిగిన 2,013 మంది ధనవంతులు ఉన్నారు. వీరి సంపద దాదాపు రూ.100 లక్షల కోట్లుగా ఉందని వెల్త్ నివేదిక తెలిపింది. దేశంలో 161 మంది వ్యక్తులు రూ.10,000 కోట్లకు మించి ఆస్తులను కలిగి ఉండగా, 169 మంది వ్యక్తులు రూ.5,000రూ.10,000 కోట్ల మధ్య సంపద కలిగి ఉన్నారని ఈ తాజా అధ్యయనం తెలిపింది. దేశంలోని తిరుగులేని ఆర్థిక కేంద్రంగా దేశ ఆర్థిక రాజధాని ముంబై అవతరించింది. ముంబైలో దేశంలోనే మొత్తం సంపదలో 40శాతం వాటాను కలిగి ఉంది. ముంబై తర్వాత న్యూఢిల్లీ, బెంగళూరు వరుసగా 17శాతం, 8శాతం వాటాతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. బ్యాంకింగ్, టెలికాం, విమానయాన రంగాలు సగటు వ్యక్తిగత సంపదలో అగ్రస్థానంలో ఉన్నాయి. ఫార్మా స్యూటికల్స్ రంగం ముందంజలోఉంది. దీని తరు వాత ఆర్థిక పరమైన సేవలు, ఐటీ రంగం ఉన్నాయి. మహిళలు ముందంజలో ఉన్నారు.

## మెటా భారీ ఆఫర్లకు ఓపెన్‌ఏఐ గట్టి షాక్ !


**వాషింగ్టన్, జూన్ 18:** ప్రముఖ టెక్ సంస్థ మెటాపై ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్‌ఆల్ట్‌మన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ సంస్థలోని ఏఐ నిపుణులను ఆకర్షించేందుకు మెటా భారీ ఆఫర్లు ప్రకటించిందన్నారు. అత్యధిక వార్షిక ప్యాకేజీతో పాటు, 100 మిలియన్ డాలర్ల వరకు సైన్‌ఆన్ బోనస్‌లను ఆశజూపినట్లు తెలిపారు. తాజాగా తన సోదరుడు జాక్ ఆల్ట్‌మన్ నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మెటా తమను పోటీదారుగా భావిస్తోందని శామ్ ఆల్ట్‌మన్ అన్నారు. అందుకే నిపుణులైన ఇంజినీర్లను ఆకర్షించడానికి 100 మిలియన్ డాలర్లు (సుమారు రూ.864 కోట్లు) ఇచ్చేందుకు సిద్ధమైందని వెల్లడించారు. అయితే తమ సంస్థ ప్రత్యేక ప్యాకేజీలు అందిస్తోందని తెలిపారు. దీంతో ఒక్క ఉద్యోగి కూడా మెటా ఆఫర్‌ను స్వీకరించలేదని వివరించారు. భారీ వేతనంతో ఉద్యోగులను ఆకర్షించే మెటా వ్యూహం దీర్ఘకాలికంగా కొనసాగలేదని, డబ్బు మాత్రమే ఏఐ రేసులో విజయాన్ని తెచ్చిపెట్టదన్నారు. మెటా తన ఏఐ లక్ష్యాలను సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తోంది. ఇటీవల స్కేల్



ఏఐ మాజీ సీఈఓ అలెగ్జాండర్ వాంగ్ నేతృత్వంలో సూపర్ ఇంటెలిజెన్స్ బృందాన్ని ఏర్పాటు చేసింది. అంతే కాదు ఏఐ కోసం 14 బిలియన్ డాలర్లపైగా పెట్టుబడి పెట్టింది. మరో వైపు.. ఓపెన్‌ఏఐ, గూగుల్‌డీప్‌మైండ్ నుంచి ప్రతిభావంతుల్ని ఆకర్షించేందుకు మెటా అత్యధిక వేతన ఆఫర్లను అందిస్తోందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

## 'ఇవి' కారు వాడే వారికి అలర్ట్..

**ముంబై, జూన్ 18:** ఎండలు అధికంగా ఉన్న సమయంలో మీ ఎలక్ట్రిక్ కారును ఫుల్ కండిషన్‌లో ఉంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఉష్ణోగ్రత పెరుగుదల కారణంగా బ్యాటరీ సామర్థ్యం తగ్గే అవకాశం ఉంది. వేసవిలో 'ఇవి' పరిధిని పెంచడానికి నిపుణులు చెప్పే సులభమైన చిట్కాల గురించి మరిన్ని విషయాలను తెలుసుకుందాం. వేసవిలో ఏసీ వాడడం వల్ల బ్యాటరీ వినియోగం పెరుగుతుంది. దూరం ఆదా చేయడానికి, కారును నీడలో పార్క్ చేసి, కారు ఛార్జింగ్‌లో ఉన్నప్పుడు ప్రీకూలింగ్ ఫీచర్‌ను ఉపయోగించండి. ఏసీను తక్కువ ఉష్ణోగ్రతకు సెట్ చేయాలి లేదా డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఫ్యాన్‌ను మాత్రమే ఉపయోగించాలి. ఎండలు అధికంగా ఉంటే టైర్ ప్రెజర్ పెరుగుతుంది. ఇది రోలింగ్ నిరోధకతను ప్రభావితం చేస్తుంది. కాబట్టి మీ కారు కంపెనీ సిఫార్సు చేసిన విధంగా టైర్ ప్రెజర్ ఉందని నిర్ధారించుకోవాలి. సరైన టైర్ ప్రెజర్ మైలేజ్‌ను 5 నుండి 10 శాతం పెంచుతుంది. స్పీడ్ డ్రైవింగ్, ఆకస్మిక బ్రేకింగ్ బ్యాటరీని డ్రెయిన్ చేస్తాయి. కాబట్టి కారు వేగాన్ని స్థిరంగా ఉంచాలి. అలాగే పునరుత్పత్తి బ్రేకింగ్‌ను గరిష్ఠంగా ఉపయోగించుకోవాలి. ఇది బ్యాటరీకి కొంత శక్తిని తిరిగి ఇస్తుంది. క్రూయిజ్ కంట్రోల్‌ని ఉపయోగించడం వల్ల కూడా పరిధి మెరుగుపడుతుంది. బ్యాటరీ టెంపరేచర్ అధిక ఉష్ణోగ్రతలు బ్యాటరీ జీవితకాలం, పరిధిని తగ్గిస్తాయి. కాబట్టి మీ కారు నీడలో లేదా గ్యారేజీలో పార్క్ చేయడం మంచిది.



వాహనంలో బ్యాటరీ థర్మల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఉంటే దానిని యాక్టివ్‌గా ఉంచాలి. ఛార్జింగ్ సమయంలో బ్యాటరీని 80కి పరిమితం చేయండి. ఎందుకంటే పూర్తిగా ఛార్జ్ చేయడం వల్ల వచ్చే వేడి బ్యాటరీపై ఒత్తిడి పెంచుతుంది. పైకప్పు రాక్‌లు లేదా అదనపు సామగ్రి గాలి నిరోధకతను పెంచుతాయి. ఇలా జరగడం వల్ల మైలేజ్‌పై తీవ్ర ప్రభావం చూపతుంది. వాహనం నుంచి అనవసరమైన బరువును తొలగించడంతో పాటు ఏరోడైనమిక్స్‌ను మెరుగుపరచడం ద్వారా ఈవీ పరిధిని పెంచవచ్చు. వేసవిలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నప్పుడు రాత్రిపూట లేదా తెల్లవారుజామున ఛార్జ్ చేయాలి. బ్యాటరీ వేడెక్కుతుంది కాబట్టి ఫాస్ట్ ఛార్జింగ్‌ను తక్కువగా ఉపయోగించండి. మీ ట్రిప్‌ను ప్లాన్ చేసుకునే ముందు ఛార్జింగ్ స్టేషన్లు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవాలని సూచిస్తున్నారు.





భారతీయ ప్రమాణాలపై ఓ సరికొత్త సమాచార వేదిక..!
వినియోగదారులకు సమాచారం, పరిశ్రమలకు సాధికారత అందించే లక్ష్యంతో...

వాచ్ చేయండి
@IndianStandard

కొత్త బులెటిన్, ప్రతీ శుక్రవారం

విశ్వవ్యాప్తంగా గుర్తింపు పొందేందుకు, వికసిత భారత లక్ష్యాన్ని చేరుకునేందుకు మొదటి అడుగు మన భారతీయ ప్రమాణాలు, నాణ్యతపై అవగాహన కలిగి ఉండటమే. దీన్ని సాకారం చేసేందుకు, జాతీయ ప్రమాణాల సంస్థ.. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, "స్టాండర్డ్స్ వాచ్" పేరిట ఓ వారపు వార్తల బులెటిన్‌ను అందుబాటులోకి తెచ్చింది. యూట్యూబ్‌లో @ఇండియన్ స్టాండర్డ్స్ ఛానల్ ద్వారా ప్రతీ శుక్రవారం వార్తల సమాహారాన్ని మీ ముందుకు తేనుంది.
ఫాలో చేయండి, సబ్‌స్క్రైబ్ చేయండి - నలుగురితో పంచుకోండి!

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, హైదరాబాద్ శాఖా కార్యాలయం:
జెడ్‌టీఎస్-ఎన్ఎఫ్‌సీ రోడ్, హెచ్‌బీ కాలనీ, మౌలాలీ, హైదరాబాద్, తెలంగాణ 500040, +9154843230/31/32/33
Follow us on: @Indianstandards | Website: www.bis.gov.in


Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.